

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 ఈ రోజు సంచికతో సాక్షి కేలండర్ (*on demand) వెల: ₹ 8.00


సంపుటి: 15
సంచిక: 107

ఆదివారం 1-1-2023

2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి నూతన సంవత్సర శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రెండేళ్ల తర్వాత జోష్

కోవిడ్ భయాన్ని వీడి రెండు సంవత్సరాల విరామం తర్వాత ప్రజలు నూతన సంవత్సర వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వివరాలు 2లో ▶



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక

నూతన సంవత్సరం అందరికీ శుభాలు తీసుకురావాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి. గట్టిగా అనుకుందాం.. తప్పక నెరవేరుతుంది.

వివరాలు 11లో ▶



ఏడాదంతా ఆడేద్దాం..

ఈ ఏడాది జరిగే వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నీతో పాటు అన్ని క్రీడా పోటీలకు సంబంధించిన వివరాలతో షెడ్యూల్.

వివరాలు 12లో ▶



ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి

రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

వివరాలు 2లో ▶

సామాన్య భక్తులకే పెద్దపీట

- తిరుమలలో వైకుంఠ ఏకాదశికి భారీ ఏర్పాట్లు.. 10 రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనం
- 12 టన్నుల పుష్పాలతో ఆలయ అలంకరణ
- 2న స్వర్ణరథోత్సవం.. 3న చక్రస్నానం

5 లో

పింఛన్ వారోత్సవం

రూ.2,750 చొప్పన పింఛన్ పంపిణీ నేటి నుంచే

- తెల్లవారుజాము నుంచే వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందజేత.. 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు
- మండలం, మున్సిపాలిటీ వారీగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశాలు
- 3న రాజమండ్రిలో జరిగే కార్యక్రమానికి సీఎం జగన్ హాజరు
- అర్హులకు కొత్తగా పింఛన్లు, బియ్యం కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలు మంజూరు
- పంపిణీ చేయనున్న ఎమ్మెల్యేలు
- తాజాగా 2.31 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు
- మొత్తంగా 64.06 లక్షల మంది పింఛన్లకు రూ.1,765 కోట్లు సిద్ధం



సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరంతో పాటే రాష్ట్రంలో లక్షలాది మంది అవ్వాతాతలు, వితంతు, ఒంటరి మహిళ, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల ఇళ్లలో కొత్త వెలుగులు వచ్చేశాయి. ఇప్పటి దాకా.. ప్రతి నెలా వీరు రూ.2,500 చొప్పున అందుకుంటున్న పింఛను డబ్బులు ఈ రోజు (జనవరి 1వ తేదీ) నుంచి ప్రతి నెలా రూ.2,750 చొప్పున

మిగతా 2వ పేజీలో ▶

కొత్తగా బియ్యం.. ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలు

- పింఛన్లు రూ.2,750కి పెంపుతో పాటు కొత్తగా పెన్షన్, బియ్యం కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు, ఇళ్ల పట్టాలను (జూలై 2022 నుంచి నవంబర్ 2022 వరకు) అర్హులైన వారికి మంజూరు కార్డులను వారోత్సవాల్లో ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తారు.
- 44,543 మంది కుటుంబాలకు ప్రభుత్వం కొత్తగా బియ్యం కార్డులు, 14,401 కుటుంబాలకు కొత్తగా ఆరోగ్యశ్రీ, మరో 14,531 కుటుంబాలకు కొత్తగా ఇళ్ల పట్టాలను ప్రభుత్వం తాజాగా మంజూరు చేసింది.
- వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పింఛన్ల కోసం రూ.62,500 కోట్లు ఖర్చు పెట్టారు. లబ్ధిదారుల సంఖ్య తాజాగా 64.06 లక్షలకు పెరిగింది. పెరిగిన పింఛన్లపై ఏటా రూ. 21,180 కోట్లు ప్రభుత్వం వ్యయం చేయనుంది.

ఉత్పత్తి అదిరింది

ఖరీఫ్‌లో ధాన్యాలు, పప్పులు, నూనె గింజల ఉత్పత్తిలో పెరుగుదల

- గత ఏడాది, ఈ ఏడాది ఖరీఫ్ ఉత్పత్తి, దిగుబడి, విస్తీర్ణంపై ఆర్‌బీఐ నివేదిక
- ధాన్యం 16.2% మేర.. ముతక ధాన్యాలు 10.3% మేర వృద్ధి
- పప్పు ధాన్యాలు 34.1%.. నూనె గింజల ఉత్పత్తి 53.9% పెరిగింది
- 4.5% మేర పత్తి ఉత్పత్తి కూడా..



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖరీఫ్ పంట పండింది. గత సీజన్‌తో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో అన్ని ప్రధాన పంటల ఉత్పత్తి, దిగుబడిలో వృద్ధి నమోదైంది. 2021-22 కన్నా 2022-23లో ధాన్యం, ముతక, చిరు ధాన్యాలు, పప్పులు, నూనెగింజల ఉత్పత్తితో పాటు దిగుబడిలోనూ పెరుగుదల నమోదైనట్లు ఆర్‌బీఐ నివేదిక

మిగతా 2వ పేజీలో ▶

బెనెడిక్ట్-16 అస్తమయం



మాజీ పోప్ బెనెడిక్ట్-16 ఇక లేరు. శనివారం వాటికన్‌లో తుదిశ్వాస విడిచారు. గురువారం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో పోప్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరుగుతాయి. మాజీ పోప్‌కు ప్రస్తుత పోప్ అంతిమ సంస్కారాలు జరిపిన అరుదైన సన్నివేశంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది.

- వివరాలు 6లో

రాష్ట్ర పండుగగా వేమన జయంతి



- మహాకవి యోగి వేమనకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. యోగి వేమన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రతి సంవత్సరం జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించింది.

- వివరాలు 2లో

చకచకా గ్రూప్-1

8న ప్రిలిమ్స్, జనవరి ఆఖరులోగా ఫలితాలు

- ఏప్రిల్‌లో మెయిన్స్.. జూలైలో ఫలితాలు, ఆపై ఇంటర్వ్యూలు.. ఆగస్టులో నియామక ప్రక్రియ
- సెప్టెంబర్‌లో మరో నోటిఫికేషన్
- ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్

3 లో

రేషన్ బియ్యం ఉచితం

- ఏడాది పాటు పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం.. జిల్లా కలెక్టర్లకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు
- అక్రమ రవాణాపై కఠిన చర్యలు


3 లో



'స్వచ్ఛ సంకల్పం' సిద్ధించింది

'క్లాప్'తో మెరుగుపడిన పారిశుధ్యం

- 'స్వచ్ఛ సర్వేక్షణ్-2022'లో రాష్ట్రానికి ఉత్తమ పురస్కారాలు
- టాప్-10 అవార్డుల్లో ఆరు రాష్ట్రానికే..
- తిరుపతికి 'సఫాయి మిత్ర సురక్షా శహర్' పురస్కారం
- 'స్వచ్ఛ రాష్ట్ర రాజధాని నగరం'గా విజయవాడ.. 'క్లీన్ బిగ్ సిటీ'గా విశాఖ
- టాప్-100 యూఎల్బీల్లో రాష్ట్రంలోని 21 పట్టణాలకు చోటు
- రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ పట్ల ఎన్జీటీ సంతృప్తి
- జగనన్న స్వచ్ఛ సంకల్పం విధానాలను అభినందించిన ఎన్జీటీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పురపాలికలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చాయి. వీధి చివరనున్న చెత్త డబ్బాలను తొలగించి.. నేరుగా ఇళ్ల నుంచే చెత్త తరలింపు కేంద్రాలకు వ్యర్థాలను తరలించడంతో వీధులు కొత్తరూపును సంతరించుకున్నాయి. తద్వారా రాష్ట్రంలో స్వచ్ఛ సంకల్పం పరిఢవిల్లుతోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్-2022' పోటీల్లో రాష్ట్రంలోని మూడు నగరాలు జాతీయ స్థాయి అవార్డులతోపాటు మొత్తం 5 అత్యున్నత పురస్కారాలను, వివిధ కేటగిరీల్లో 21 నగరాలు, పట్టణాలు పురస్కారాలను సొంతం చేసుకుని దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన నిలిచింది. 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' కార్యక్రమం ద్వారా చేపట్టిన విధానాలను జాతీయ హరిత ట్రిబ్యునల్ సైతం మెచ్చుకుంది. మరోపక్క పట్టణాలను కాలుష్య కోరల నుంచి తప్పించి ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు 45 యూఎల్బీల్లో జగనన్న హరిత నగరాలకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు.

మురుగు నిర్వహణపై ఎన్జీటీ కితాబు

మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణ సక్రమంగా లేదని దేశంలోని వివిధ రాష్ట్రాలకు వేలాది కోట్ల రూపాయల అపరాధ రుసుం విధిస్తున్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఏపీలో పాటిస్తున్న విధానాలపై నవంబర్‌లో సర్వే నిర్వహించింది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న విధానాలపై ఆరా తీసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పట్టణాల్లో అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రణాళిక, అమలు తీరు బాగున్నాయని కితాబివ్వడంతో పాటు స్వచ్ఛతా పనులను ఇలాగే కొనసాగించాలని చెప్పడం మునిసిపల్ శాఖ సాధించిన మరో ఘనత.

హరిత నగరాలకు శ్రీకారం

పట్టణాలు కూడా పల్లెసీమల్లా పచ్చగా కళకళలాడాలని, పట్టణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో 'జగనన్న హరిత నగరాల'కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో ఎంపిక చేసిన 45 పట్టణాలు, నగరాల్లో రోడ్లకు ఇరువైపులా.. రోడ్డు మీడియన్స్‌లోనూ మొక్కలు నాటే చర్యలు చేపట్టారు. ఆగస్టులో ప్రారంభమైన పనులు నవంబర్ నాటికి పూర్తవడంతో పాటు చాలా యూఎల్బీల్లో మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

స్వచ్ఛతలో ఏపీనే టాప్

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న ఢిల్లీలో నిర్వహించిన అజాదీ స్వచ్ఛ సర్వేక్షణ్-2022 వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి హర్‌దీప్‌సింగ్ నుంచి ఏపీ అధికారులు 13 జాతీయ స్వచ్ఛతా అవార్డులను అందుకున్నారు. 2022లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో 4,354 పట్టణాలు/నగరాలు పాలుపంచుకోగా ఆంధ్రప్రదేశ్‌కే అధిక అవార్డులు రావడం, టాప్-100 బెస్ట్ సిటీస్ ర్యాంకింగ్‌లో ఏపీ 7వ స్థానాన్ని సొంతం చేసుకోవడం విశేషం. అత్యుత్తమ పారిశుధ్య కార్మిక విధానాలను పాటిస్తున్న తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ జాతీయస్థాయిలో మొదటి ర్యాంకుతోపాటు 'సఫాయి మిత్ర సురక్షా సెహెర్' పురస్కారాన్ని సొంతం చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించింది. రాజధాని నగరాల్లో విజయవాడ 'స్వచ్ఛ రాష్ట్ర రాజధాని నగరం'గా అవార్డు అందుకుంది. 10-40 లక్షల జనాభా కేటగిరీలో విశాఖపట్నం 'క్లీన్ బిగ్ సిటీ' పురస్కారం పొందింది. సౌత్ జోన్‌లోని 50 వేలు-లక్ష జనాభా కేటగిరీలో 'ఇన్నోవేషన్ అండ్ బెస్ట్ ప్రాక్టీసెస్' విభాగంలో పులివెందుల, 25 వేలు-50 వేల జనాభా కేటగిరీలో సాలూరు యూఎల్బీలు అవార్డులను సొంతం చేసుకున్నాయి. 'ప్రజాభిప్రాయం' విభాగంలో పుంగనూరు మునిసిపాలిటీ అవార్డులను దక్కించుకుంది. 'ఇండియన్ స్వచ్ఛతా లీగ్' విభాగంలో మిలియన్ ప్లస్ కేటగిరీలో విశాఖపట్నం, ప్రత్యేక కేటగిరీలో శ్రీకాకుళం, పాదిలి యూఎల్బీలు 'టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' అవార్డులు అందుకున్నాయి. చెత్త రహిత నగరాలుగా జీవీఎంసీ, విజయవాడ, తిరుపతి '5 స్టార్ రేటింగ్'ను సొంతం చేసుకున్నాయి. ఉత్తమ పారిశుధ్య విధానాలతో లక్ష పైబడిన జనాభా గల నగరాల్లో జీవీఎంసీ, విజయవాడ, తిరుపతి బెస్ట్ టాప్-10లో, కర్నూలు, నెల్లూరు, కడప, రాజమహేంద్రవరం యూఎల్బీలు టాప్-100లో చోటు సంపాదించాయి. సౌత్ జోన్‌లో 50 వేల నుంచి లక్ష జనాభా కేటగిరీలో టాప్-100 ర్యాంకింగ్‌లో 21 నగరాలు స్థానం సంపాదించాయి. ఇందులో పుంగనూరు మునిసిపాలిటీ 3, పులివెందుల 9వ ర్యాంకు సాధించగా.. 25 వేల నుంచి 50 వేల విభాగంలో 8 యూఎల్బీలు టాప్ 100లో నిలిచాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'క్లీన్ ఆంధ్రప్రదేశ్' (క్లాప్) కార్యక్రమం పటిష్ట నిర్వహణతో ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలను ఏపీ అధికంగా గెలుచుకుంది.

ప్రజలు శాంతి, సంతోషాలతో విలసిల్లాలి

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: నూతన సంవత్సర శుభారంభం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పౌరులందరూ శాంతి, శ్రేయస్సు, ఉల్లాసం, సంతోషాలతో విలసిల్లాలని కోరుకుంటున్నానని గవర్నర్ పేర్కొన్నారు. ఉజ్వల భవిష్యత్, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, నూతన లక్ష్యాలను సాధించడానికి నూతన సంవత్సరం ప్రేరణనిస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతి ఇల్లు ఆనందంగా ఉండాలి

సీఎం జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కొత్త సంవత్సరం ప్రతి ఇంటిలో ఆనందాలను నింపాలని, మంచి ఆరోగ్యం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం తన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా...

రాష్ట్ర పండుగగా యోగి వేమన జయంతి

జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి/తెనాలి: 'విశ్వదాభిరామ వినుర వేమ... అనే మాట వినని తెలుగువారు ఉండరు. వానకు తడవనివారు, ఒక వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరు' అని లోకోక్తి. ఆ మహాకవికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. యోగి వేమన జయంతిని రాష్ట్ర పండుగగా ప్రతి సంవత్సరం జనవరి 19వ తేదీన అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నంబరు 164ను విడుదల చేసింది. అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు శనివారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

8న కర్నూలుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాక



కర్నూలు కల్చరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ నెల 8వ తేదీన కర్నూలుకు రానున్నట్లు బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.రామస్వామి 'సాక్షి'కి తెలిపారు. ప్రవాసి యోజన కార్యక్రమంలో భాగంగా హోం మంత్రి కర్నూలు జిల్లాతో పాటు హిందూపురంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా కర్నూలు నగరంలోని బీజేపీ కార్యకర్త ఇంటికి వెళ్తారని తెలిపారు. అనంతరం నగరంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 142 పీఎం జనౌషధి కేంద్రాలు

దేశవ్యాప్తంగా 9 వేల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 142 ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ) కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రజలకు తక్కువ ధరకే ఔషధాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 743 జిల్లాల్లో 9 వేలకు పైగా జనౌషధి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఏపీలోని 26 జిల్లాల్లో మొత్తం 142 జనౌషధి కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇందులో అత్యధికంగా నంద్యాల జిల్లాలో 12, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 11 చొప్పున ఉన్నాయని పేర్కొంది. బ్రాండెడ్ ఔషధాల కంటే 50 శాతం నుంచి 90 శాతం తక్కువ ధరకే నాణ్యమైన ఔషధాలను ఈ కేంద్రాల ద్వారా అందించి.. గత ఎనిమిదేళ్లలో సుమారు రూ.18 వేల కోట్లను ప్రజలకు ఆదా చేశామని కేంద్రం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2024 మార్చి నాటికి పీఎంబీజేపీ కేంద్రాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్ చివరి నాటికి జనౌషధి అమ్మకాలు రూ.758.69 కోట్లు కాగా.. ప్రజలకు రూ.4,500 కోట్లు ఆదా అయ్యిందని కేంద్రం తెలిపింది.

పలువురు ఐపీఎస్‌లకు పదోన్నతులు

సాక్షి, అమరావతి: ఏపీ కేడర్‌కు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఐపీఎస్–1993 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు అడిషనల్ డీజీలకు డీజీపీ ర్యాంక్ ఇచ్చింది. వారిలో ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీస్‌లో ఉన్న మహేష్ దీక్షిత్, అమిత్‌గార్గ్ ఉన్నారు. ఐపీఎస్–1998 బ్యాచ్‌కు చెందిన మహేష్ చంద్రలడ్డాకు అడిషనల్ డీజీగా పదోన్నతి కల్పించింది. లడ్డా ప్రస్తుతం డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులో ఉన్నారు. డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసులో ఉన్న ఎస్.శ్యామ్‌సుందర్, గుంటూరు రేంజ్ డీజీ సీఎం త్రివిక్రమవర్మ, ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజులకు ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ)గా పదోన్నతి కల్పించింది. విశాఖపట్నం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ కోయ ప్రవీణ్, డిప్యూటేషన్‌పై కేంద్ర సర్వీసులో ఉన్న భాస్కర్ భూషణ్, ఏపీ డీజీపీ కార్యాలయంలో శాంతిభద్రతల ఏఐజీగా ఉన్న ఆర్ఎన్ అమ్మిరెడ్డికి డీఐజీ(సూపర్ టైమ్ స్కేల్)గా, విజయనగరం ఎస్పీ ఎం.దీపిక, ఏసీబీ ఎస్పీ బి.కృష్ణారావు, సీఐడీ ఎస్పీ అమిత్‌బర్దర్‌లకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్(సెలక్షన్ గ్రేడ్)కు పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులిచ్చారు. వీరందరి పదోన్నతులు 2023, జనవరి ఒకటో తేదీ నుంచి వర్తిస్తాయని పేర్కొన్నారు.

రైతన్నకు 'విత్తన' దన్ను

- 'మాండూస్' ప్రభావిత ప్రాంతాల్లో 80% సబ్సిడీపై రైతులకు సరఫరా
- ఆర్బీకేల ద్వారా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో పంపిణీ
- 33వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని గుర్తించిన వ్యవసాయ శాఖ



సాక్షి, అమరావతి: మాండూస్ తుపాను కారణంగా విత్తనాలు కొట్టుకుపోయి ఆర్థికంగా నష్టపోయిన రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. అదును ఉన్నా మళ్లీ విత్తేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక ఆందోళనకు గురవుతున్న అన్నదాతలపై ఆర్థిక భారం పడకుండా అండగా నిలుస్తోంది. వీరికి 80 శాతం సబ్సిడీపై విత్తనాలను అందిస్తోంది. ఏ విత్తనం కావాలన్నా, సాగు విస్తీర్ణం బట్టి ఎంత కావాలన్నా సరఫరా చేస్తోంది. మాండూస్ తుపాను ఇటీవల రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో తీవ్ర ప్రభావం చూపిన విషయం తెలిసిందే. రబీ సీజన్‌లో ముందుగా పంటలు సాగుచేసే నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంది. ఆయా జిల్లాల్లో వరి, శనగ, వేరుశనగ, నువ్వులు, మినుము విత్తనాలను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నారు. వరిలో ఎన్ఎల్ఆర్–34449, ఆర్ఎన్ఆర్–15048, శనగలో జేజీ 11, పెసలులో పీయూ 31, వేరుశనగలో కదిరి లేపాక్షి రకం విత్తనాల కోసం రైతుల నుంచి డిమాండ్ వచ్చింది. ఇలా ఆయా జిల్లాల నుంచి 33వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 28వేల క్వింటాళ్లను ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధంచేసింది. ఆర్బీకేల్లో విత్తనం కావాల్సిన రైతుల వివరాలను నమోదు చేస్తోంది. వారికి డి.క్రిష్ యాప్ ద్వారా పారదర్శకంగా విత్తన సరఫరా చేస్తోంది.

15వేల మంది రిజిస్ట్రేషన్

ఇక విత్తనాల కోసం ఇప్పటివరకు 15వేల మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 10వేల మందికి 8,727 క్వింటాళ్ల విత్తనం సరఫరా చేశారు. వీరికి 4,686 క్వింటాళ్ల వరి, 3,288 క్వింటాళ్ల శనగ, 748 క్వింటాళ్ల వేరుశనగ, ఐదు క్వింటాళ్ల నువ్వుల విత్తనం సరఫరా చేశారు. జనవరి 10 కల్లా మిగిలిన వారికి 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు విత్తనాలను ఆయా జిల్లాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచనున్నారు.

సబ్సిడీపై విత్తన ధరలు ఇలా.. (రూ.లలో)

విత్తనాలు	రకం	క్వింటాల్‌కు అమ్మకపు ధర	80% సబ్సిడీపై ధర
శనగ	జేజీ–11	6,456	1,291.20
వరి	ఎన్ఎల్ఆర్–34449	3,367	673.40
	ఆర్ఎన్ఆర్–15048	3,645	729
వేరుశనగ	కదిరిలేపాక్షి	8,580	1,716
పెసలు	పీయూ 31	11,350	2,270

గతంలో ఎప్పుడూ ఇలా ఇవ్వలేదు



రబీలో 8 ఎకరాల్లో ఆర్ఎన్ఆర్ వరి విత్తనం వేశా. తుపాన్ దెబ్బకు మొత్తం పోయింది. ఆర్థికంగా చాలా నష్టపోయా. సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసు చేసుకుని 80 శాతం సబ్సిడీపై విత్తనం సరఫరా చేశారు. మొన్న రెండు బ్యాగ్‌లు ఆర్ఎన్ఆర్ 15048 విత్తనం తీసుకున్నా. ప్రభుత్వం ఆదుకోవడం ఆనందంగా ఉంది. పంట నష్టాన్ని కూడా అంచనా వేశారు.

– అట్ల కృష్ణయ్య, తునుబాక, పెళ్లకూరు మండలం, తిరుపతి జిల్లా


జనవరి 10కల్లా అందరికీ సరఫరా



సీఎం జగన్ ఆదేశాల మేరకు 80 శాతం సబ్సిడీపై వరి, శనగ, వేరుశనగ, అపరాల విత్తనాన్ని సరఫరా చేస్తున్నాం. 33వేల క్వింటాళ్ల విత్తనం కోసం ఇండెంట్ పెట్టారు. ఇప్పటికే 28వేల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధంచేశాం. 8,727 క్వింటాళ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేశారు. పంట దెబ్బతిన్న రైతులు ఆర్బీకేల్లో వివరాలు నమోదు చేసుకుంటే జనవరి 10కల్లా కావాల్సిన విత్తనం సరఫరా చేస్తాం.

– డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నాకున్న ఐదెకరాల్లో శనగ పంట వేశాను. వేసిన వారంలోనే తుపానువల్ల మొలక దశలోనే పంట పూర్తిగా దెబ్బతింది. 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేస్తోంది. కేవలం రూ.2,040 చెల్లించి ఆర్బీకేల్లో 1.25 క్వింటాళ్ల శనగ విత్తనం తీసుకున్నా. సబ్సిడీపై విత్తనం ఇవ్వకపోతే చాలా ఇబ్బందిపడే వాళ్లం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– నలదల కొండయ్య, పలుకూరు, కందుకూరు మండలం, ప్రకాశం జిల్లా

లంక భూములకు డి పట్టాలు

- అసైన్‌మెంట్ నిబంధనలు సవరించిన రాష్ట్ర ప్రభుత్వం
- వేలాది మంది రైతులకు మేలు చేసేలా మరో కీలక నిర్ణయం
- ఏ, బీ కేటగిరీల్లోని వాటికి డి పట్టాలు.. సీ కేటగిరీలోని భూమికి ఐదేళ్ల లీజు పట్టాలు
- అసైన్‌మెంట్ కమిటీల అనుమతితో కలెక్టర్లకు పట్టాలిచ్చే అధికారం
- లంక భూముల కేటగిరీ మార్పునకు కూడా అవకాశం
- గతంలో ఇచ్చిన పట్టాలు, అడంగల్‌లో పేర్లు నమోదైన వాటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు
- అర్హులకు డి పట్టాలివ్వగా మిగిలిన భూమి ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదలకు పంపిణీ

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలోని లంక భూములకు డి పట్టాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఏ, బీ కేటగిరీలుగా గుర్తించిన లంక భూములకు సంబంధించి వివాదాల్లేకుండా సాగు చేసుకుంటున్న అర్హులకు పట్టాలు ఇవ్వడంతోపాటు సి కేటగిరీలో ఉన్న భూములకు ఐదేళ్ల లీజు పట్టాలు ఇవ్వనుంది. ఈ మేరకు లంక భూముల అసైన్డ్ నిబంధనలను సవరిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ జీఓ జారీ చేశారు. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఒండ్రు మట్టి ఒక దగ్గర చేరి ఉన్న భూములు కాలక్రమేణా సాధారణ భూములుగా మారి సారవంతంగా ఉండడంతో రైతులు (శివాయి జమేదార్లు) వాటిని సాగు చేసుకుంటున్నారు. ఏ, బీ కేటగిరీ భూముల్లోని కొందరికి గతంలో డి పట్టాలిచ్చారు. మునిగిపోయే అవకాశం ఉండడంతో సీ కేటగిరీ భూములకు పట్టాలివ్వకుండా ఒక సంవత్సరం లీజుగా ఇచ్చారు. వాటినే లీజు పట్టాలుగా పిలుస్తారు.

ఎంజాయ్‌మెంట్ సర్వే ద్వారా పట్టాలు

పూర్వపు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ మూడు కేటగిరీల్లో ఉన్న లంక భూములను సాగు చేసుకుంటున్న చాలా మందికి పట్టాలు లేవు. అలాంటి వారిని గుర్తించి నిబంధనల ప్రకారం పట్టాలివ్వాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఏ, బీ కేటగిరీల్లోని భూములకు ఆమోదంతో పట్టాలివ్వనుంది. సీ కేటగిరీ కింద ఉన్న భూములకు గతంలో ఇచ్చే సంవత్సరం లీజును ఐదేళ్లకు పొడిగించి ఇవ్వనున్నారు. అసైన్‌మెంట్ కమిటీల ఆమోదంతో పట్టాలిచ్చే అధికారాలను జిల్లా కలెక్టర్లకు ఇచ్చారు. లంక భూముల్లో సీజీఎఫ్ (కో–ఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్) సొసైటీలు ఉండేవి. మిగిలిన ప్రాంతాల్లోని సీజీఎఫ్ఎస్ భూములకు పట్టాలిచ్చినా, లంక భూముల్లోని సీజీఎఫ్ఎస్ భూములకు మాత్రం ఇవ్వలేదు. ఈ సొసైటీలు రద్దయ్యే పరిస్థితుల్లో వాటి కింద ఉన్న అర్హులను గుర్తించి తాజాగా పట్టాలివ్వాలని నిర్ణయించారు. గతంలో ఇచ్చిన పట్టాలు, అడంగల్‌లో నమోదైన పట్టాదారులకు ఇబ్బంది లేకుండా ఇప్పుడు డి పట్టాలివ్వాలని జీవోలో స్పష్టం చేశారు.



ఏ కేటగిరీ : గట్టుకు దగ్గరగా ఉండి, వరద వచ్చినా కొట్టుకుపోని భూమి
బీ కేటగిరీ : ఏ కేటగిరీ భూమికి ఆనుకుని, కొంత నదిలోకి ఉన్న భూమి
సీ కేటగిరీ : ఏ, బీ కేటగిరీకి ఆనుకుని నదిలోకి ఉండి.. వరదలు వస్తే పూర్తిగా మునిగిపోయే భూమి

10 వేల మందికి మేలు

లంక భూముల కేటగిరీలను మార్చేందుకు తాజాగా అవకాశం కల్పించారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, రివర్ కన్సర్వేటర్ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్)లతో ఉన్న కమిటీ కేటగిరీ మార్పుపై వచ్చే దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్ సిఫారసు చేస్తారు. ఈ సిఫారసుల ఆధారంగా జిల్లా కలెక్టర్ దీనిపై నిర్ణయం తీసుకుంటారు. ఈ మేరకు నిబంధనలను సవరించారు. దీనివల్ల సుమారు 10 వేల మంది లంక భూముల రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. అర్హులకు పట్టాలివ్వగా మిగిలిన భూముల్లో 50 శాతాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులకు, మిగిలిన 50 శాతం భూమిలో మూడింట రెండొంతుల (2/3) భూమిని బీసీ రైతులకు, మిగిలిన (1/3) భూమిని నిరుపేద రైతులకు పంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పింఛన్ వారోత్సవం

▶ మొదటి పేజీ తరువాయి

అందుకుంటారు. మరోవైపు ఈ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 2,31,989 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జనవరి 1 నుంచి జరిగే పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి పండుగ వాతావరణంలో వారోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మండల, మున్సిపాలిటీల స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనుంది. జనవరి 3వ తేదీన సీఎం వైఎస్ జగన్ రాజమండ్రిలో పింఛను పెంపు వారోత్సవ కార్యక్రమంలో స్వయంగా పాల్గొననున్నారు.

64.06 లక్షలకు చేరిన పింఛన్ల సంఖ్య

ప్రభుత్వం తాజాగా మంజూరు చేసిన 2,31,989 పింఛన్లతో కలిపి జనవరి నెలలో రాష్ట్రంలో సామాజిక పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య 64,06,240కి చేరుకుంది. జనవరి ఒకటి ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ.. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పెరిగిన పింఛను డబ్బులు చెల్లిస్తారు. ఇందుకోసం ప్రభుత్వం శనివారమే అన్ని గ్రామ, వార్డు సచివాలయ శాఖల బ్యాంకు ఖాతాల్లో రూ.1,765 కోట్ల నిధులను జమ చేసింది.

మండల, మున్సిపాలిటీల వారీగా సమావేశాలు

- 1వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో స్థానిక ఇన్‌చార్జి మంత్రుల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు మొదలవుతాయి. 7వ తేదీ వరకు స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో విడతల వారీగా అన్ని మండల కేంద్రాలతో పాటు మున్సిపల్, నగర కార్పొరేషన్ల వారీగా పింఛన్ లబ్ధిదారుల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 3వ తేదీ రాజమండ్రిలో పాల్గొనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాలు.. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యక్ష ప్రసారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- 1వ తేదీ నుంచి పింఛన్ల పెంపు వారోత్సవ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణకు ప్రభుత్వం మండల కేంద్రానికి రూ.10 వేలు, మున్సిపాలిటీకి రూ.15 వేలు, కార్పొరేషన్‌కు రూ.50 వేలు, విజయవాడ, తిరుపతి వంటి పెద్ద కార్పొరేషన్లకు రూ.లక్ష.. విశాఖపట్నం కార్పొరేషన్‌కు రూ.1.50 లక్షలు విడుదల చేసింది. జిల్లా కేంద్రాల్లో స్థానిక మంత్రుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాల నిర్వహణకు రూ.20 వేల చొప్పున ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది.

అప్పటికీ ఇప్పటికీ తేడా..

- చంద్రబాబు ప్రభుత్వంలో రూ.1,000 ఉన్న పింఛన్‌ను జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే రూ.2,250కు పెంచడంతో పాటు.. 2022 జనవరిలో రూ.2,500కు, ఈ జనవరి నుంచి రూ.2,750కి పెంచుకుంటూ వచ్చారు.
- గత చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు నెల వారీగా పింఛన్ల పంపిణీకి అరకొరగా రూ.400 కోట్ల చొప్పున పంపిణీ చేయగా, 2019లో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పింఛన్ల వ్యయం ఏకంగా మూడున్నర రెట్లు పెంచి రూ.1,350 కోట్లు ఖర్చు చేసింది.
- గత చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లు పంపిణీ చేస్తే.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సంతృప్త స్థాయిలో అర్హులందరికీ వంద శాతం పింఛన్ల మంజూరు చేసే విధానం తీసుకొచ్చారు. తద్వారా 2019లో 52.17 లక్షలకు, 2022లో 62.31 లక్షలకు, 2023లో 64.06 లక్షలకు ఆ సంఖ్య చేరుకుంది.

పేదలకు పెద్దన్న సీఎం జగన్



కొత్త సంవత్సరం రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను పెంపు ద్వారా పేదల కళ్లలో ఆనందం, ముఖంలో చిరునవ్వు, ఆత్మ గౌరవం తీసుకొచ్చారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నవరత్నాల కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఏకంగా 64.06 లక్షల మందికి పింఛన్లు ఇవ్వడం అంటే చిన్న విషయం కాదు. సీఎం జగన్.. తన సంక్షేమాభివృద్ధి పాలన ద్వారా రాష్ట్రంలో పేదలకు పెద్దన్నగా మారారు. ఈ ప్రభుత్వంలో భాగస్వామినైనందుకు గర్వ పడుతున్నాను.

– బూడి ముత్యాలనాయుడు, ఉప ముఖ్యమంత్రి

లంచం, వివక్ష లేకుండా పింఛన్ల మంజూరు

కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ అనే తారతమ్యాలు లేకుండా.. లంచాలు, వివక్షకు అవకాశం ఇవ్వకుండా అర్హులైతే చాలు ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు అవుతున్నాయి. అదే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో కొత్త పింఛన్లకు అర్హులను గుర్తించే పద్ధతే ఉండేది కాదు. లంచాలు.. లేదంటే వివక్షే కనిపించేది. టీడీపీ నేతలతో కూడిన జన్మభూమి కమిటీలే అర్హులను గుర్తించేవి. వాళ్లు లంచాలు ఇస్తేనో లేక తమ వర్గం, తమ పార్టీ వాళ్లో అయితేనే పింఛన్లు మంజూరు చేసేవారు. ఒక్కొక్క గ్రామానికి ఇన్ని పింఛన్లే అని కోటా పెట్టుకొని, ఆ కోటాకు మించి ఎంత మంది అర్హులున్నా వారెవ్వరికీ పింఛన్లు ఇచ్చే వారు కాదు. మాకు పింఛను అర్హత ఉంది కదా అని ఎవరైనా అడిగితే.. మీ ఊరిలో ఎవరైనా పెన్షనర్ చనిపోతే వారి స్థానంలో ఇస్తామని నిస్సిగ్గుగా చెప్పేవారు. పింఛన్లు తీసుకోవడం కోసం వృద్ధులు, దివ్యాంగులు ప్రతి నెలా చాంతాడంత క్యూలో గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చాక అవ్వాతాతలతో పాటు దివ్యాంగులకు ఏ చిన్న కష్టం లేకుండా ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల డబ్బులు అందజేస్తున్నారు. కొత్త పింఛన్ల మంజూరు కూడా పూర్తి పారదర్శకంగా చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల జాబితాలను ప్రదర్శించి, సామాజిక తనిఖీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

ఉత్పత్తి అదిరింది

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. దేశంలో గత ఖరీఫ్‌లో (2021–22) వ్యవసాయ ఉత్పత్తుల నాల్గవ ముందస్తు అంచనాలు, 2022–23 ఖరీఫ్ మొదటి ముందస్తు అంచనాలతో ఆర్‌బీఐ ఈ నివేదికను విడుదల చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో కూడా గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో ప్రధాన పంటల ఉత్పత్తి, దిగుబడి, విస్తీర్ణంలో ఏ రాష్ట్రంలో ఎంతమేర వృద్ధి నమోదైందో ఈ నివేదికలో ఆర్‌బీఐ విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, పంజాబ్, గుజరాత్, హరియాణా, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే ధాన్యం ఉత్పత్తి గత ఖరీఫ్ కన్నా ఈ ఖరీఫ్‌లో పెరిగింది. మిగతా రాష్ట్రాల్లో క్షీణత నమోదైంది. జాతీయ స్థాయిలో కూడా గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో ధాన్యం ఉత్పత్తిలో 6.1 శాతం క్షీణత నమోదైంది. ఈ ఖరీఫ్‌లో మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి 46 శాతం వృద్ధి నమోదైంది. ఆ తరువాత రాజస్థాన్‌లో 32.3 శాతం.. ఆంధ్రప్రదేశ్‌లో 16.2, ఒడిశాలో 5.9, గుజరాత్‌లో 5.1, పంజాబ్‌లో 3.8, హరియాణాలో 2.9, ఉత్తరాఖండ్‌లో 1.7 శాతం వృద్ధి నమోదైంది.

ఖరీఫ్ విస్తీర్ణంలో వృద్ధి ఇలా..

➡ అలాగే, దేశం మొత్తం ఖరీఫ్ విస్తీర్ణంలో 47 శాతం విస్తీర్ణం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, గుజరాత్, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఉంది. ➡ ఇక మన రాష్ట్రం విషయానికొస్తే.. వరి సాగు విస్తీర్ణం గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ ఖరీఫ్‌లో ఐదు శాతం మేర పెరిగింది. ➡ ధాన్యం దిగుబడిలో 10.6 శాతం మేర వృద్ధి నమోదైంది. ➡ రాష్ట్రంలో ముతక, చిరు ధాన్యాల విస్తీర్ణం తగ్గినప్పటికీ ఉత్పత్తి, దిగుబడిలో భారీ వృద్ధి నమోదైంది. ➡ పప్పు ధాన్యాల విస్తీర్ణం, నూనె గింజల విస్తీర్ణం తగ్గినప్పటికీ ఉత్పత్తి, దిగుబడుల్లో భారీగా పెరుగుదల ఉంది. ➡ పత్తి విస్తీర్ణం, ఉత్పత్తి కూడా పెరిగినప్పటికీ దిగుబడి మాత్రం ఈ ఖరీఫ్‌లో తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్‌లో కాలువల కింద సాగుకు నీటిని ముందస్తుగా విడుదల చేసింది. విత్తనాలతో పాటు, ఎరువులను రైతుభరోసా కేంద్రాల ద్వారానే సకాలంలో అందించింది. సాగు విషయంలో రైతుల అవసరాలను తీర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది.

రాష్ట్రంలో 2021-22 ఖరీఫ్‌తో పోలిస్తే 2022-23 ఖరీఫ్‌లో పంటల ఉత్పత్తి, విస్తీర్ణం, దిగుబడి వివరాల వృద్ధి శాతం ఇలా..

పంట	ఉత్పత్తి	విస్తీర్ణం	దిగుబడి
ధాన్యం	16.2	5.0	10.6
ముతక, చిరు ధాన్యాలు	10.3	-12.5	26.1
పప్పు ధాన్యాలు	34.1	- 2.6	37.7
నూనె గింజలు	53.9	-14.5	80.1
పత్తి	4.5	8.7	- 3.8



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న బీసెంట్ రోడ్డు



విశాఖ బీచ్ రోడ్డులో నూతన సంవత్సర ఉత్సాహం


రెండేళ్ల తర్వాత న్యూ జోష్

సాక్షి నెట్‌వర్క్ : కోవిడ్ భయాన్ని వీడి రెండేళ్ల విరామం తర్వాత జనం కొత్త సంవత్సరం వేడుకల్లో హుషారుగా పాల్గొన్నారు. డిసెంబర్ 31 రాత్రి సంబరాల్లో ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా గడిపారు. 2021 జనవరిలో డెల్టా వేరియంట్ రూపంలో రెండో వేవ్ తీవ్రత ఉండటం, గతేడాది ఒమిక్రాన్ రూపంలో మూడో వేవ్ ఆంక్షలు, వైరస్ భయంతో ప్రజలు కొత్త సంవత్సరాన్ని స్వేచ్ఛగా స్వాగతించలేకపోయారు. ఈసారి ఇటు భయం నామమాత్రమే కావటం, మాస్కులు ధరించాలన్న సూచన తప్ప ఎలాంటి ఆంక్షలు లేకపోవటంతో ప్రజల్లో కొత్త జోష్ వెల్లివిరిసింది. శనివారం అర్ధరాత్రి కొత్త సంవత్సరాన్ని ఫుల్‌జోష్‌తో స్వాగతం పలికారు. గడియారం ముల్లు అర్ధరాత్రి 12 వద్దకు చేరుకోగానే.. హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలు మిన్నంటాయి. మిరుమిట్లు గొలిపే బాణసంచా వెలుగులు ఆకాశంలో తళుకులీనాయి. కేక్ కటింగ్స్‌తో సంబరాలు అంబరాన్నంటాయి. పలు హోటళ్లు, రిసార్టుల్లో ఏర్పాటుచేసిన న్యూ ఇయర్ సంబరాల్లో యువత మునిగితేలారు. ఇక విజయవాడ, విశాఖపట్నం సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతోపాటు పల్లెల్లోనూ పెద్దఎత్తున యువత సొంత వాహనాల్లో రోడ్లపైకి వచ్చి హడావుడి చేశారు. పరస్పరం హ్యాపీ న్యూఇయర్ చెప్పుకుంటూ సందడి చేశారు. దీంతో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఇక రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో సందడి అంతా ఇంతా కాదు. అన్ని దేవాలయాలూ ప్రత్యేక పూజల, భక్తుల రాకతో కిటకిటలాడాయి. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.



3 నుంచి జాతీయ నాబార్డ్ క్రాఫ్ట్స్ మేళా

సాక్షి, అమరావతి: విజయవాడ వేదికగా జనవరి 3 నుంచి 12వ తేదీ వరకు జాతీయ నాబార్డ్ క్రాఫ్ట్స్ మేళా–2023 జరగనుంది. స్థానిక మేరీ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో పది రోజులపాటు జరగనున్న ఈ మేళాలో 12 రాష్ట్రాలకు చెందిన 130 మంది కళాకారులు పాల్గొననున్నారు. నాబార్డు ఆర్థిక చేయూతతో పని చేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలతో పాటు వ్యక్తిగతంగా రాణిస్తున్న వారు తమ ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాల కోసం వేదిక కల్పిస్తారు. ఈ మేళాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన హస్తకళలు, చేతి వృత్తులు, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలతో పాటు ఆహార ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. 10వేలకుపైగా కళాకృతులు మేళాలో ప్రదర్శించనున్నారు. ఈ క్రాఫ్ట్ మేళాను జనవరి 3వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారని నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎస్‌ఆర్ చంద్రమూర్తి తెలిపారు.



విశాఖ పోర్టుకు భారీ షిప్

సాక్షి, విశాఖపట్నం: భారీ కార్గో షిప్ విశాఖపట్నం పోర్టులో సందడి చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) నుంచి సున్నపురాయి లోడుతో ఇక్కడికి చేరుకున్న ఎంవీ జీసీఎల్ సబర్మతి అనే బేబీ కేప్ వెసెల్‌ను విశాఖ పోర్టు అథారిటీ మెరైన్ బృందం శనివారం బెర్తింగ్ చేసింది. 253.50 మీటర్ల పొడవు, 43 మీటర్ల బీమ్ ఉన్న సబర్మతి షిప్ తొలిసారిగా పోర్టుకు వచ్చిందని అధికారులు తెలిపారు. 1,06,529 డెడ్ వెయిట్ టన్నేజ్ సామర్థ్యం కలిగిన షిప్ బెర్తింగ్ విజయవంతంగా చేసిన సిబ్బందిని పోర్టు చైర్మన్ రామ్మోహన్‌రావు అభినందించారు.

సాగర జలాల్లో ఇక నిరంతర నిఘా!

10 మల్టీకాప్టర్ డ్రోన్‌లను వినియోగించనున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ ● రాత్రీపగలు తీర ప్రాంతంలో భద్రత

సాక్షి, విశాఖపట్నం: దేశ రక్షణ వ్యవస్థను ఎప్పటికప్పుడు ఆధునికీకరించుకుంటూ డిఫెన్స్ సెక్టార్ కీలకంగా వ్యవహరిస్తోంది. కేవలం నౌకాదళం, ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడమే కాకుండా... సాంకేతికతను అందిపుచ్చుకుంటూ... అగ్రరాజ్యాలకు దీటుగా బలాన్ని, బలగాన్ని పెంచుకుంటోంది. వైరి దేశాల కవ్వింపు చర్యలకు సరైన సమాధానం ఇచ్చేందుకు నిరంతరం నూతన రక్షణ వ్యవస్థలతో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా సాగర జలాల్లో నిరంతరం పహారా కాసేలా ఇండియన్ కోస్ట్ గార్డ్ తొలిసారిగా మానవ రహిత మల్టీకాప్టర్లను అందుబాటులోకి తెచ్చింది. ఇండియన్ కోస్ట్‌గార్డ్(ఐసీజీ) హెలికాప్టర్లకు బదులుగా... సరికొత్త సాంకేతికతతో మల్టీకాప్టర్లను తన అమ్ములపొదిలో చేర్చుకుంది. నిరంతరం పహారా కాసే సామర్థ్యం ఉన్న ఈ మల్టీకాప్టర్ డ్రోన్‌లు... కోస్ట్‌గార్డ్ రక్షణ వ్యవస్థకు కీలకంగా మారనున్నాయి. వెర్టికల్‌గా టేకాఫ్‌తోపాటు ల్యాండింగ్ కూడా అయ్యేలా ఇవి పనిచేస్తాయి. కోస్ట్‌గార్డ్ నౌకల్లోనూ, ఆఫ్‌షోర్ స్టేషన్‌ల నుంచి వీటిని ప్రయోగించొచ్చు.


కోస్ట్‌గార్డ్ షిప్ నుంచి ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న మల్టీకాప్టర్ డ్రోన్

మూడేళ్లలో 100 మల్టీకాప్టర్లు..

ప్రస్తుతం కోస్ట్ గార్డ్.. తొలి విడతగా 10 మల్టీకాప్టర్లను కొనుగోలు చేసుకుంది. వీటిని విశాఖ, కోల్‌కతా ప్రాంతాల్లోని ఐసీజీ ప్రధాన స్థావరాలకు కేటాయించాలని నిర్ణయించింది. తీర ప్రాంత నిఘా, భద్రత వ్యవస్థలను మరింత పటిష్టం చేసేలా.. సరిహద్దు ప్రాంతాల్లో ఈ మల్టీకాప్టర్ డ్రోన్‌లు రాత్రి, పగలు పహారా కాస్తాయి. నిఘాకు మాత్రమే కాకుండా... ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు రెస్క్యూ ఆపరేషన్లలోనూ, యాంటీ పైరసీ, యాంటీ స్మగ్లింగ్, ఆయిల్‌స్పిల్, కాలుష్య నియంత్రణ ఆపరేషన్స్ మొదలైనవాటికి కూడా వీటిని వినియోగించనున్నారు. ఏడాది నుంచి ఇండియన్ కోస్ట్‌గార్డ్ తీర ప్రాంత భద్రతపై మరింత పట్టు సాధించింది. యాంటీ టెర్రరిజం స్క్వాడ్‌తో కలిసి నిర్వహించిన ఏడు జాయింట్ ఆపరేషన్లలో రూ.1,900 కోట్ల విలువైన 350 కిలోల హెరాయిన్ దేశంలోకి రాకుండా స్వాధీనం చేసుకుంది. ఈ ఆపరేషన్లలో పాక్, ఇరాన్ దేశాలకు చెందిన చొరబాటుదారుల్ని కూడా అదుపులోకి తీసుకుంది. ఇకపై భద్రత వ్యవస్థను మరింత స్మార్ట్‌గా పటిష్టం చేసేందుకు మల్టీకాప్టర్లను వినియోగించాలని కోస్ట్‌గార్డ్ నిర్ణయించింది. ఇందుకోసం 2025 నాటికి మరో 100 మల్టీకాప్టర్ డ్రోన్‌లను కొనుగోలు చేసే దిశగా అడుగులేస్తోంది.

క్లుప్తంగా...

రేషన్ బియ్యం ఉచితం

- ఏడాది పాటు పంపిణీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లా కలెక్టర్లకు పౌర సరఫరాల శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ఏడాది పాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేయనుంది. ఇప్పటి దాకా కిలో రూ.1కే అందిస్తున్న బియ్యాన్ని జనవరి నుంచి డిసెంబర్ వరకు (ఏడాది కాలం) ఉచితంగా అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలో 1.46 కోట్ల బియ్యం కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఆహార భద్రత చట్టం కిందకు వచ్చే (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కార్డుదారులందరికీ ఏడాదిపాటు ఉచిత బియ్యం అందించనున్నట్టు ప్రకటించింది. ఏపీలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కార్డుదారులతో సమానంగా నాన్ ఎన్‌ఎస్‌ఎఫ్‌ఏ కార్డుదారులకు కూడా ఉచితంగా బియ్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉచిత బియ్యం పంపిణీ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది ఒక్క బియ్యానికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ 1967కు లేదా 18004250082 నంబర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు. ఉచిత బియ్యం పంపిణీపై విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టి, అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నేడు స్వగ్రామానికి తెలుగు దంపతుల కుమార్తెలు


ఇద్దరు కుమార్తెలతో నారాయణ, హరిత దంపతులు (ఫైల్)

ప్రత్తిపాడు: అమెరికాలో దుర్మరణం చెందిన తెలుగు దంపతుల కుమార్తెలు ఆదివారం స్వగ్రామానికి రానున్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం పాలపర్రుకు చెందిన నారాయణ, హరిత దంపతులు ఉద్యోగ రీత్యా ఏడేళ్లుగా అమెరికాలోని అరిజోనాలో ఉంటున్నారు. ఈ నెల 26వ తేదీన పిల్లలతో కలిసి విహారయాత్రకు వెళ్లిన దంపతులు సరస్సులో గల్లంతై, మృత్యుఒడికి చేరిన విషయం తెలిసిందే. వారి ఇద్దరు కుమార్తెలు పూజిత, హర్షితలు ఒంటరిగా మిగిలిపోయారు. తానాతో పాటు నారాయణ పనిచేస్తున్న టీసీఎస్ కంపెనీ ప్రతినిధులు చొరవ తీసుకుని ఇద్దరు చిన్నారులను భారత్‌కు తీసుకువస్తున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం చిన్నారులను తీసుకుని టీసీఎస్ ప్రతినిధులు అమెరికాలోని డల్లాస్ నుంచి భారతదేశానికి బయల్దేరారు. ఆదివారం ఉదయానికి హైదరాబాద్ చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా స్వగ్రామానికి తీసుకువచ్చి నాయనమ్మ వెంకటరత్నం, తాతయ్య సుబ్బారావుకు చిన్నారులను అప్పగిస్తారని బంధువులు చెప్పారు. నారాయణ, హరిత మృతదేహాలు ఇక్కడకు వచ్చేందుకు మరికొద్ది రోజులు పడుతుందని తెలిపారు.

'చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి'


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కందుకూరు ఘటనలో పేదల మృతికి కారణమైన చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 825వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ కందుకూరు సభలో చనిపోయిన బాధితులలో ఇద్దరు గిరిజనులు, ఇద్దరు ఎస్సీలున్నారని, ఇరుకు మార్గంలో సభ నిర్వహించి వీరి మరణానికి కారణమైన చంద్రబాబును క్షమించకూడదన్నారు. నాయకులు ఎం.గురునాథం, పి.వరప్రసాద్, ఎన్.జోషి, బి.సాంబయ్య, పి.దాసు, ఇ.ఆదాం, పి.బాబు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో ప్రశాంతత లేకుండా చేశారు

- పోలవరాన్ని 2024కు కూడా పూర్తి చేయలేరు
- చంద్రబాబునాయుడు విమర్శ



కొడవలూరు: ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ నాయకులు ప్రశాంతత లేకుండా చేశారని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. ఆయన శనివారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం నార్నురాజుపాలెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. గడిచిన మూడేళ్లలో 52,557 మంది మహిళలపై అత్యాచారాలు, వేధింపులు జరిగాయని ఆరోపించారు. హైదరాబాద్‌ను నాలెడ్జ్ అకాడమీకి చిరునామాగా తీర్చిదిద్దింది తానేనన్నారు. ఐటీ ఒక బ్యాక్ బోన్‌గా భావించి 1995లోనే ప్రారంభించానన్నారు. భారతదేశం నుంచి 5 కోట్ల మంది ప్రపంచమంతా వెళితే వారిలో 35 శాతం మంది తెలుగువారే ఉన్నారంటే అది తనవల్లేనని చెప్పారు. నెల్లూరు నుంచి చెన్నైకు తొలుత హైవే వేసింది కూడా తానేనని, ఆ తరువాతే వాజ్‌పేయి 8 లేన్ల హైవేను తన అభ్యర్థన మేరకు నిర్మించారని చెప్పారు. అమరావతికి ఐదారు టాప్ యూనివర్సిటీలను తెస్తే అక్కడికి ప్రభుత్వం రోడ్లు వేయలేదన్నారు. కందుకూరు సభకు పోలీసులను కేటాయించలేదని, అందువల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఇరిగేషన్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, పోలవరాన్ని 2024కు కూడా పూర్తి చేయలేరని అన్నారు.

చంద్రబాబుది అధికార దాహం

వైఎస్సార్ సీపీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అధికార దాహానికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన తాడేపల్లిలో శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ గెలిచినా అది ప్రజా నిర్ణయం, ప్రజా తీర్పు అవుతుందని పేర్కొన్నారు. గెలుపు, ఓటములు ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పక్షాలకు మాత్రమే గానీ.. ప్రజలకు కాదన్నారు. అలాంటిది 2024 ఎన్నికల్లో టీడీపీ గెలిస్తేనే అది ప్రజా విజయం అవుతుందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేసిన మూడు పర్యాయాలు 2004, 2009, 2019 ఓటమి చెందారని, నెల్లూరు జిల్లాలో చెప్పిన మాటలనుబట్టి ఆయన ఓటమి నుంచి ఏమి నేర్చుకున్నట్లు కనిపించడం లేదన్నారు. మూడు నెలలుగా ఆయన బీసీలకు కొత్త చుట్టంలా కనిపించడానికి తెగ ప్రయాసపడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయ చైతన్యం ఉన్న కాపులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు వంటి అన్ని సామాజికవర్గాలు మోసపోయే రోజులు పోయాయని స్పష్టంచేశారు.

చేతకాని చంద్రబాబుకు ఎవరైనా చాన్స్ ఇస్తారా?

- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- 82 వేల మంది బీసీలను ప్రజాప్రతినిధులను చేసింది సీఎం జగనే
- కందుకూరు ఘటనలో బాబును అరెస్ట్ చేయాల్సిందే



సాక్షి,అమరావతి: సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్న సమయంలో పరిపాలన చేతకాని చంద్రబాబుకు మళ్లీ సీఎంగా ఒక్క చాన్స్ ఇమ్మంటే ఎవరైనా ఎందుకు ఇస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. 'చేతకాని దద్దమ్మకు, చెడు చేసిన వారికి మళ్లీ చాన్సిస్తారా? 14 ఏళ్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై ఎక్కి తొక్కి.... మాతో ఊడిగం చేయించుకున్నావు. అలాంటి నీకు మళ్లీ చాన్సివ్వాలా? దేనికివ్వాలి?' అని ఆయన నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జోగి రమేష్ విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి, పేద వారికి విద్య, వైద్య, ఆరోగ్య పరంగా 2022 విజయనామ సంవత్సరం అని చెప్పారు. చంద్రబాబుకు ఏడుపు మిగిల్చిన సంవత్సరం.. అయ్యన్న, అచ్చెన్నలాంటి వాళ్లకు బూతులనామ సంవత్సరంగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు.

డేట్, టైమ్, ప్లేస్.. చెబితే నేనే చర్చకు వస్తా

'చంద్రబాబు సవాల్‌ను స్వీకరిస్తున్నా. బీసీల సంక్షేమంపై చర్చకు నేను సిద్ధం. డేట్, టైమ్, ప్లేస్.. చెబితే నేనే చర్చకు వస్తా. 2024లో మరోసారి బీసీలు చంద్రబాబు నడ్డివిరుస్తారు. బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తారు. బీసీలను బాబు కులవృత్తులకు పరిమితం చేస్తే, సీఎం వైఎస్ జగన్ 82వేల మంది బీసీలను ప్రజాప్రతినిధులను చేశారు. సీఎం జగన్.. మా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, పేద పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి, ఇంగ్లిష్ మీడియం చదువులు చదివిస్తున్నారు. ఇలాంటి ఆలోచన చంద్రబాబుకు ఏనాడైనా వచ్చిందా? లోకేశ్ పాదయాత్రకు పప్పు గళం, తుప్పు గళం, చిప్పగళం అని ఈ మూడింటిలో ఒక పేరు సూటవుతుంది. ఎలాంటి పొత్తు లేకుండా సొంతంగా 175 స్థానాల్లో పోటీ చేస్తామని చంద్రబాబు, దత్తపుత్రుడు చెప్పగలరా? ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు, వాటిపై చర్చలు.. నిత్యం ఇదే మీ పని. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తుంది. పప్పు, తుప్పు కొట్టుకుపోతారు. కందుకూరులో 8మంది ప్రాణాలు కోల్పోవడానికి కారకుడైన చంద్రబాబును అరెస్టు చేయాల్సిందే...' అని మంత్రి జోగి రమేష్ అన్నారు.

ఏసీబీ అధికారులమంటూ ఎంపీడీవోకు బెదిరింపులు

- రూ.10 లక్షలు డిమాండ్
- భయపడి రూ.1.40 లక్షలు అకౌంట్‌లో వేసిన వైనం
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు?

కనిగిరి రూరల్: ఏసీబీ అధికారులమంటూ ప్రకాశం జిల్లా కనిగిరి ఎంపీడీవో జె.మల్లికార్జునరావును సైబర్ నేరగాళ్లు బెదిరించి రూ.1.40 లక్షలు తీసుకున్న ఘటన వెలుగు చూసింది. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. శనివారం కొందరు వ్యక్తులు ఎంపీడీవోకు ఫోన్ చేశారు. 'ఏసీబీ డీఎస్పీ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నాం. నీ చిట్టా మొత్తం మా దగ్గర ఉంది. రైడింగ్‌కు వచ్చి పట్టుకుపోతాం. వదిలి పెట్టాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలి' ఆయన్ను బెదిరించారు. చివరకు రూ.5 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. భయపడిన ఎంపీడీవో రూ.1.40 లక్షల వరకు ఫోన్ పే ద్వారా చెల్లించారు. మిగతా నగదు బ్యాంక్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలపగా.. అక్కడ అంకె తప్పుతో డబ్బులు బదిలీ కాలేదు. డబ్బులు త్వరగా వేయాలని బెదిరించసాగారు. దీంతో భయపడిన ఎంపీడీవో తన కార్యాలయానికి వచ్చి ఎంపీపీ దంతులూరి ప్రకాశం వద్ద విలపించారు. ఎంపీపీ ప్రకాశం ఫోన్ చేసిన వ్యక్తితో మాట్లాడారు. అసలు నీవు ఎవరని ప్రశ్నించగా.. అది మీ అధికారికి తెలుసునంటూ బుకాయించాడు. తాను ఎంపీపీనని, పోలీసు శాఖలో అందరూ తెలుసని, మీ అధికారితో మాట్లాడతానంటూ గట్టిగా చెప్పడంతో ఫోన్ కట్ చేశారు. దీంతో ఊపిరి పీల్చుకున్న ఎంపీడీవో విషయాన్ని పోలీసు శాఖలోని కొందరు అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అనంతరం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఎంపీడీవోను సంప్రదించగా.. 'అయిపోయిందేదో అయిపోయింది వదిలేయండి' అని అన్నారు.

చకచకా గ్రూప్–1

ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్–1 పోస్టుల నియామక ప్రక్రియను గతంలోలా న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా కాలపరిమితిని నిర్ణయించుకుని ఏడాదిలోగా పూర్తి చేయనున్నట్లు ఏపీపీఎస్సీ చైర్మన్ డి.గౌతమ్ సవాంగ్ చెప్పారు. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌లో 92 పోస్టులను పొందుపరిచినా, గత నోటిఫికేషన్‌లో భర్తీ కాని సుమారు 18 పోస్టులను క్యారీఫార్వర్డ్ కింద ప్రస్తుత నోటిఫికేషన్‌కు జోడించే అవకాశముందని ఆయన 'సాక్షి'కి తెలిపారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్, ఇంటర్వ్యూల వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితితో 2023 ఆగస్టు నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. జనవరి 8వ తేదీన గ్రూప్–1 ప్రిలిమ్స్ (స్క్రీనింగ్ టెస్టు) నిర్వహిస్తామన్నారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఓఎమ్మార్ షీట్ల ఆధారంగా నిర్వహించే వీటి మూల్యాంకనాన్ని రెండు వారాల్లో పూర్తి చేయించి జనవరి ఆఖరులోగా ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం మెయిన్స్‌కు సన్నద్ధత కోసం అభ్యర్థులకు 90 రోజుల వ్యవధి ఉండేలా చూస్తున్నామని, 2023, ఏప్రిల్ చివరిలో మెయిన్స్ నిర్వహించాలని భావిస్తున్నట్లు చెప్పారు. మెయిన్స్ సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని రెండు నెలల్లో పూర్తిచేయించి 2023, జూన్ ఆఖరు లేదా జూలై మొదటివారంలోపు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఆగస్టు ఆఖరులోగా ఇంటర్వ్యూలను కూడా ముగించి పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రణాళికను రూపొందించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి సెప్టెంబర్‌లో గ్రూప్–1 పోస్టుల భర్తీకి మరో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసే అవకాశముందని తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలను డిసెంబర్ 18నే నిర్వహించేలా ఇంతకు ముందు షెడ్యూల్ ఇచ్చినా, పాలనాపరమైన కారణాల వల్ల జనవరి 8కి వాయిదా వేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రూప్–2 పోస్టుల భర్తీకీ కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు 1,26,449 మంది

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు 1,26,449 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని 18 జిల్లా కేంద్రాల్లో 297 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పేపర్–2ను నిర్వహిస్తారు. ఈ పరీక్ష హాల్ టికెట్లను శనివారం నుంచి కమిషన్ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. జిల్లాలవారీగా పరీక్ష కేంద్రాల వివరాలను, ప్రశ్నపత్రం బుక్‌లెట్, ఓఎమ్మార్ ఆన్సర్ షీట్‌లలో నమోదు చేయాల్సిన అంశాలపై సూచనలను కూడా వెబ్‌సైట్లో పొందుపరిచారు. అభ్యర్థులు ముందుగా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని రిపోర్టింగ్ సమయం, ఇతర అంశాలపై అందులో ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించాలని కమిషన్ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను చూసుకోవాలని, తద్వారా పరీక్ష రోజున నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవచ్చని సూచించారు. అభ్యర్థులకు సహాయం కోసం 18 జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు యూనివర్సిటీ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ అనుమతితో బీఎస్సీ అనస్థీషియా టెక్నాలజీ, బీఎస్సీ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, బీఎస్సీ కార్డియాక్, కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ, బీఎస్సీ రెనాల్ డయాలిసిస్ టెక్నాలజీ, బీఎస్సీ ఆప్టోమెట్రీ, బీఎస్సీ రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ న్యూరోసైన్స్ టెక్నాలజీ, బీఎస్సీ క్రిటికల్ కేర్ టెక్నాలజీ, బీఎస్సీ రేడియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ, బీఎస్సీ ఆడియోలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ మెడికల్ రికార్డ్స్ సైన్సెస్, బీఎస్సీ న్యూక్లియర్ మెడిసిన్, బీఎస్సీ రేడియో థెరపీ టెక్నాలజీ తదితర నూతన కోర్సులను ఉంటాయని వివరించింది. గతంలో ఉన్న బీఎస్సీ (ఎంఎల్‌టీ) కోర్సుతో పాటు నూతనంగా ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఆదివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు.

బాణసంచా పేలి నలుగురి దుర్మరణం

తమిళనాడులో వ్యాపారి ఇంట్లో దుర్ఘటన

సాక్షి, చెన్నై/సేలం: తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లా మోగనూరులో శనివారం తెల్లవారుజామున ఓ ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన బాణసంచా పేలి నలుగురు దుర్మరణం చెందారు. పది మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఐదు ఇళ్లు ధ్వంసమయ్యాయి. టపాకాయలకు తోడు ఇంటిలోని గ్యాస్ సిలిండర్లు కూడా పేలడంతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది. మోగనూరుకు చెందిన తిల్‌లెక్షుమార్ (35) బాణసంచా వ్యాపారి. ఆయనకు ఓడపాళయంలో బాణసంచా గోడౌన్ ఉంది. మోగనూరు మేట్టు వీధిలో భార్య ప్రియాంక (30), కుమార్తె సజని (4), తల్లి సెల్వి (55)తో కలిసి నివాసం ఉంటున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా శుక్రవారం రాత్రి శివకాశి నుంచి పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి తెప్పించాడు. వాటిని ఇంటి వద్దే ఓ గదిలో ఉంచి నిద్రకు ఉపక్రమించాడు. శనివారం తెల్లవారుజామున గదిలోని బాణసంచా ఒక్కసారిగా పేలింది. దీంతో తిల్‌లెక్షుమార్ ఇంటితో పాటుగా పక్కనే ఉన్న మరో నాలుగు ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఛిద్రమైన తిల్‌లెక్షుమార్ మృతదేహం 50 అడుగుల దూరంలో మరో ఇంటి పైకప్పుపై ఎగిరిపడింది. అతడి భార్య ప్రియాంక, తల్లి సెల్వి సజీవ దహనమయ్యారు. పక్కింటిలోని పెరియక్క(73) కూడా మరణించింది. ఈ ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50వేలు చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

తెలంగాణ

మృత్యువై వచ్చిన గ్రానైట్ లారీ

ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు దుర్మరణం.. ఐదుగురికి గాయాలుమహబూబాబాద్ జిల్లాలో ఘటన

సాక్షి, మహబూబాబాద్: వారందరూ ఆటో నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు చేసుకునేందుకు రోజూ వెళ్లే రైస్‌మిల్లు ఓనర్ వద్ద నుంచి డబ్బులు తెచ్చుకునేందుకు ఆటోలో వెళ్తుండగా ఓ గ్రానైట్ లారీ వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మంగోరుగూడెం గ్రామానికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు బానోత్ సుమన్ (24), యాకాలపు శ్రీకాంత్(24), డెంకల నవీన్ (34), లూనావత్ వీరన్న, బొడ్డు శేఖర్, బానోత్ రాములు, లింగంపల్లి రాంబాబు, బానోత్ రమేశ్‌లు మొత్తం ఎనిమిది మంది శనివారం సాయంత్రం ఆప్పే ఆటోలో కురవి మండల కేంద్రానికి బయలుదేరారు. కురవి పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే మహబూబాబాద్ నుంచి గ్రానైట్ లోడుతో వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌పై గ్రానైట్ బండరాయి పడి నుజ్జునుజ్జు అయ్యాడు. తీవ్రగాయాలైన వారిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమన్ మార్గమధ్యలో చనిపోగా, మిగతావారిని మహబూబాబాద్‌కు తరలించారు. వారిలో డెంకల నవీన్ పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. బొడ్డుశేఖర్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

11 కరోనా కేసుల నమోదు

సాక్షి,హైదరాబాద్ : రాష్ట్రంలో శనివారం 5, 250 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 11 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక రోజులో 13 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్న వారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 66 మంది ఐసోలేషన్ లేదా చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. రాష్ట్రంలో శనివారం 3,202 మందికి కరోనా వ్యాక్సిన్లు ఇచ్చారు. అందులో బూస్టర్ డోసును 2,564 మందికి వేయగా, రెండో డోసును 389 మంది, మొదటి డోసును 249 మందికి వేసినట్లు ఆయన తెలిపారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు బీజేపీ పాలక్‌లు

- తమకు కేటాయించిన సీట్లలో పార్టీ నిర్దేశం ప్రకారం కార్యక్రమాలు
- బూత్ కమిటీల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కమిటీలతో భేటీలు
- 7న బూత్ కమిటీలను ఉద్దేశించి వర్చువల్‌గా జేపీ నడ్డా ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేందుకు ఆ పార్టీ జాతీయ నాయకత్వం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంస్థాగతంగా పార్టీ బలోపేతంతో పాటు, మెజారిటీ సీట్లలో అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసేందుకు డిసెంబర్ 29న నాలుగంచెల వ్యవస్థను ప్రకటించింది. ఈ వ్యవస్థలో పార్టీకి పూర్తి సమయమిచ్చి పనిచేసే ఫుల్‌టైమర్ 'విస్తారక్'తో పాటు కన్వీనర్, ప్రభారీ (ఇన్‌చార్జి), పాలక్‌లను నియమించారు. పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత, రాజకీయ సలహాలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని అన్ని రకాల వనరుల సమీకరణ బాధ్యతలను 'పాలక్'లకు అప్పగించారు. శనివారం కొందరు నాయకులు తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యతలు తీసుకుని పనిచేయడం ప్రారంభించారు. తమకు బాధ్యతలు అప్పగించిన సీట్లలో ఎన్నికలు ముగిసేదాకా ప్రతీనెల మూడురోజుల పాటు పూర్తి సమయమిచ్చి పనిచేయాలనే నిబంధను జాతీయ నాయకత్వం విధించింది. దీంతో నాయకులు ఆయా అసెంబ్లీసీట్లలోని పరిస్థితుల అధ్యయనంలో నిమగ్నమయ్యారు.

వర్చువల్ కుదరకపోతే వీడియో సందేశం..

ఇదిలా ఉంటే జనవరి 7న 119 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో బూత్ కమిటీలు, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. ఒకవేళ సమయాభావం వల్ల నడ్డా వర్చువల్‌గా ప్రసంగించే అవకాశం లేకపోతే వీడియో రికార్డింగ్ ద్వారా ఆయన సందేశం వినిపించనున్నట్టు పార్టీవర్గాల సమాచారం. పాలక్‌లుగా నియమితులైన వారిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు ఉన్నారు. జనవరి మొదటివారంలో, ముఖ్యంగా 5,6,7 తేదీల్లో వీరంతా పాలక్‌లుగా ఆయా నియోజకవర్గాల్లో పని ప్రారంభించనున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి, మేడ్చల్‌కుడా.కె.లక్ష్మణ్, కుత్బుల్లాపూర్‌కు డీకే అరుణ, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ఇంద్రసేనారెడ్డి, పటాన్‌చెరువు– పి.మురళీధర్‌రావు, వరంగల్ తూర్పు– ఈటల రాజేందర్, మెదక్–ధర్మపురి అర్వింద్, చేవెళ్ల–ఏపీ జితేందర్‌రెడ్డి, జుక్కల్–జి.వివేక్ వెంకటస్వామి, ఎల్లారెడ్డి–రఘునందన్‌రావు, జూబ్లీహిల్స్–కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్–కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, పరిగి–విజయశాంతి, ములుగు–సోయం బాపూరావు, రాజేంద్రనగర్–మర్రి శశిధర్‌రెడ్డి, కల్వకర్తి–ఎన్.రామచంద్రరావు నియమితులైన విషయం తెలిసిందే. వీరంతా అసెంబ్లీ పాలక్‌లుగా తమకు అప్పగించిన విధుల నిర్వహణలో భాగంగా బూత్ కమిటీల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు, మండల కమిటీ అధ్యక్షులతో భేటీలు నిర్వహించనున్నారు. జనవరి 7వ తేదీలోగా సంస్థాగతంగా అన్ని కమిటీల నియామకంపై కార్యాచరణ అమలు చేయనున్నారు.



ఆ తండ్రి మహిమ క్రీస్తును మరణం నుండి లేపినట్టుగానే, మనం కూడా జీవితపు కొత్తదనంలోకి నడకను సాగించవచ్చు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్యమాసం, **తిథి:** శు.దశమి రా.10.30 వరకు తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** అశ్వని సా.4.36 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.12.34 నుండి 2.11 వరకు, తదుపరి రా.2.22 నుండి 4.01 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.03 నుండి 4.49 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.23 నుండి 11.01 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నిర్మలా సీతారామన్ (ఆర్థిక మంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఉదయం వాకిలి తెరవగానే ఒకేసారి ఆరు నవ్వు ముఖాలు! ఆరు పూల బొకేలు!!

"హ్యాపీ న్యూ ఇయర్ మేడమ్.."

సోమనాథన్, అనంత నాగేశ్వరన్, వివేక్ జోషీ, సంజయ్ మల్హోత్రా, తుహిన్ కాంత్ పాండే, అజయ్ సేథ్! బడ్జెట్ టీమ్ మొత్తం నార్త్ బ్లాక్ నుంచి నేనుంటున్న 15 సఫ్దర్‌జంగ్ రోడ్‌కి షిఫ్ట్ అయినట్లుగా అనిపించింది.

"రండి.. రండి. డోర్ బెల్ కొట్టాల్సింది కదా.." అని నవ్వుతూ లోపలికి ఆహ్వానించాను.

"మొదట అలానే అనుకున్నాం మేడమ్. తర్వాత అనిపించింది.. న్యూ ఇయర్ మీకోసం వేచి చూస్తే బాగుంటుంది కానీ, న్యూ ఇయర్ కోసం మిమ్మల్ని వెయిట్ చేయించడం ఏంటని..! అందుకే వచ్చే ముందు కాల్ చేయలేదు. వచ్చినా కాలింగ్ బెల్ కొట్టలేదు.." అన్నారు అనంత నాగేశ్వరన్!

పెద్దగా నవ్వాన్నేను.

నాగేశ్వరన్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్. నా అనుమానం.. అతడు తన కాలేజ్ రోజుల్లో అమ్మాయిల మీద అడపాదడపా కొన్ని సొగసైన కవితల్ని అల్లే ఉంటాడని. మనిషి కూడా ఒక సరళమైన కవితలా అనిపిస్తాడు!



"ఎలా ఉన్నారు మేడమ్?!".. అడిగారు వివేక్ జోషీ.

"ఫైన్ జోషీజీ, థ్యాంక్యూ.." అన్నాను.

జోషీ కొంచెం పెద్ద తరహా. ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ. బడ్జెట్ ప్రిపేర్ చేస్తున్నప్పుడు మిగతా ఐదుగురూ బ్రేక్‌లోనైనా కాస్త నవ్వుతూ కనిపించేవారు. ఆయన మాత్రం.. ఆ టైమ్‌లో నవ్వడం పెద్ద ఆర్థిక నేరం అన్నట్లుగా ఉండేవారు. అక్టోబర్ 30న బడ్జెట్ మేకింగ్ మొదలైంది. అప్పట్నుంచీ జోషీ అలాగే ఉన్నారు. బహుశా ఫిబ్రవరి 1 వరకు ఆయన అలాగే ఉండొచ్చు.

"నిర్మలాజీ, మీరు ఎయిమ్స్‌లో అడ్మిట్ అయ్యారని తెలిసి దేశం యావత్తూ ఒక్కసారిగా ఊపిరి బిగబట్టింది. ఎయిమ్స్ నుంచి డిశ్చార్జ్ అయ్యారని తెలిసి ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది. మధ్యలోని ఆ నాలుగు రోజులు.. మనవాళ్లకు నాలుగు చీకటి యుగాల్లా అనిపించాయి.." అన్నారు సోమనాథన్!

"ముందు టీ తీస్కోండి.." అన్నాను చిన్న నవ్వుతో ఆయన మాటను తప్పిస్తూ.

'మనవాళ్లు' అంటే ఆయన ఉద్దేశం.. బడ్జెట్ టీమ్. సోమనాథన్ ఫైనాన్స్ సెక్రటరీ. టీమ్‌కి హెడ్‌లాంటి వారు కనుక ఆ చీకటి యుగాలలో తనను కలుపుకున్నట్లు లేరు.

"సోమనాథన్‌జీ.. నేను పక్కన లేనందుకు నార్త్‌బ్లాక్‌లో మనవాళ్లకు చీకటి యుగంలా అనిపిస్తే, మనవాళ్లు నా పక్కన లేనందుకు ఎయిమ్స్‌లో నాకు చీకటి యుగంలా అనిపించాలి కదా.. చెప్పండి, బ్రేక్‌ఫాస్ట్‌లోకి ఏం తెప్పించమంటారు?" అన్నాను నవ్వుతూ.

ఆ మాటకు అజయ్ సేథ్, తుహిన్ కాంత్, సంజయ్ మల్హోత్రా ఒకేసారి నవ్వారు.

"ఎంతైనా బడ్జెట్ టైమ్‌లో మీరు పక్కనే ఉంటే ఆ ధీమానే వేరు కదా మేడమ్.." అన్నారు. అజయ్ ఎకనమిక్ అఫైర్స్ సెక్రెటరీ. తుహిన్ పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ సెక్రెటరీ. సంజయ్ రెవిన్యూ సెక్రెటరీ.

"ఇంకా నెల రోజులు ఉంది కదా.. మండే నుంచి మీ ధీమా మీతోనే ఉంటుంది లెండి.." అన్నాను నవ్వుతూ.

'వెల్కమ్ మేడమ్‌జీ' అంటూ అంతా క్లాప్స్ కొట్టారు.

"మరి ప్రజలకు మనమేం ధీమా ఇవ్వబోతున్నాం?" అని టీమ్‌ని అడిగాను.

"మేజీ.. ఒక హ్యాపీ న్యూ ఎకనమిక్ ఇయర్?!" అని నవ్వారు నాగేశ్వరన్.

"మన బడ్జెట్ కంటే ముందు తన బడ్జెట్ క్వొశ్చనీర్‌ని చిదంబరం రెడీ చేసుకుంటున్నారట మేడమ్! సుబ్రహ్మణ్యస్వామి అయితే ఆర్థికమాంద్యం సెకండ్ వేవ్ రాబోతోందని ప్రజలందరికీ ఫోన్‌లు చేసి చెబుతున్నారు.." అన్నారు తుహిన్ కాంత్.

"ఫస్ట్ వేవ్ ఎప్పుడొచ్చి వెళ్లిందట తుహిన్! నేను హాస్పిటల్‌లో ఉన్నప్పుడా?" అన్నాను.


నవ్వుల వేవ్‌తో మా న్యూ ఇయర్ మొదలైంది.

న్యూఇయర్ 'ఆయుధ పూజ'

జనతంత్రం



వర్ధెల్లి మురళి



అర్జునా... జాగ్రత్త!

ఏకలవ్యుల బొటనవేళ్లు ఇక మీదట తెగిపోవడం లేదు. వారి వింటి నారి ఝుంకారాన్ని విని ఝడుసుకోకు.

సూతపుత్ర కర్ణుడి దివ్యాస్త్రాలు పనిచేయకుండా ఏ పరశురాముడూ ఇప్పుడు శపించలేదు. నీ అరివీరుని ధనుష్టంకారానికి అదిరిపడకు.

ఆయుధమే కదా విజేత ఎవరో విజితుడెవరో నిర్ణయించేది! ఆయుధ ప్రయోగ మంత్రమే కదా విజేతల విజయ రహస్యం! అది దేశాల మధ్య యుద్ధమైనా, సమాజంలోని భిన్నవర్గాల పోరాటమైనా... ఆయుధమే గెలుపు తులాభారం. కేవలం నాలుగైదు దేశాలు ప్రపంచ రాజ్యాలన్నిటిపై పెత్తనం చేసి వలసపాలన స్థాపించగలిగింది ఆయుధ బలంతోనే. నూటికి ఎనభై మంది పేద ప్రజల జీవితాలతో పిడికెడుమంది శ్రీమంతులు యథేచ్ఛగా ఆటలాడుతున్నదీ సాయుధ గర్వంతోనే!

మారుతున్న కాలంతోపాటు ఆయుధం కూడా తన రూపును మార్చుకుంటున్నది. ఒకనాడది తుపాకీ కావచ్చు. తుపాకుల్లో శ్రేష్ఠమైనదీ కావచ్చు. క్రమంగా విజ్ఞానమే ఆయుధంగా మారుతున్నది. ఆయుధం పుస్తక రూపాన్ని కూడా సంతరించుకున్నది. ఆ పుస్తకం కాలానికి తగినట్టు కంప్యూటర్ అవతారమెత్తుతున్నది. సాంకేతిక నైపుణ్యాన్ని ఆవాహన చేసుకుంటున్నది. ఆ చదువే ఇప్పుడు పరమాయుధం. చదువే ఇప్పుడు పాశుపతాస్త్రం. చదువే ఇప్పుడు నారాయణాస్త్రం. చదువే ఇప్పుడు బ్రహ్మాస్త్రం!

కాలంతోపాటు నడిపించే ఇంగ్లిషు మీడియం చదువు శ్రీమంతుల కుటుంబాలకే పరిమితం కావడం అన్యాయం కాదా? కాలాన్ని శాసించే కంప్యూటర్ చదువు వారి గుప్పిట్లోనే బందీ కావడం సామాజిక దోపిడీ కాదా? నిరుపేదల బిడ్డలు వసతుల్లేని బడుల్లో అరకొర అక్షర జ్ఞానంతో ఇంకెన్నాళ్లు వెనకబాటుతనాన్ని దిద్దుకుంటూనే ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడీ దుర్నీతికి సంకెళ్లు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విప్లవదీక్షతో ప్రభుత్వ బడుల స్వరూప స్వభావాలను మార్చివేసింది. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పేదబిడ్డల చేతికి ట్యాబ్‌లను అందజేస్తున్నది. కేవలం ట్యాబ్‌లే కాదు సుమా! అత్యంత ఆధునికంగా ఆడియో విజువల్ బోధనా పద్ధతులు మేళవించిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లవి.

ఆ పెట్టెలో శస్త్ర సంధాన మంత్రోపదేశం ఉన్నది. అర్జునుడి చెవిలో ద్రోణాచార్యుడు చెప్పిన విలువిద్యా రహస్యం ఇక ఏకలవ్యులకు కూడా వినబడబోతున్నది. డిజిటల్ డివైడ్ అంతం కానున్నది. అక్షర పెత్తందారీతనానికి తెరపడబోతున్నది. సాంకేతిక దోపిడీకి చరమగీతం పాడే సమయం ఆసన్నమవుతున్నది. అదిగో ఈ ఫోటోలోని బాలిక పరవశాన్ని చూడండి. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను అపురూపమైన ఆయుధంగా భావించి ముద్దాడుతున్న ఆ బాలిక స్పందన చూడండి. పద్మవ్యూహ చక్రబంధంలో అభిమన్యుని ఇరికించిన కురువీరులు అధర్మ యుద్ధంతో అతడిని నిరాయుధునిగా మార్చినప్పుడు... ఏ అదృశ్యశక్తో అతడి చేతికి ధనుర్బాణాలను అందజేస్తే స్పందన ఎలా ఉండేదో?... ఈ ఏకలవ్యుల స్పందన కూడా అలాగే ఉన్నది. చేతికందిన విల్లంబుల్ని ఎక్కుపెట్టడానికి వారు సిద్ధపడుతున్నారు. చేప యంత్రాలను కొట్టడానికో, చెట్టుమీదున్న పిట్ట కన్నును పొడవడానికో వారు పరిమితం కాబోరు. ఈ లోకపు వెలుగుల్ని దిగంతాల దాకా మండించగల విలుకాళ్లవుతారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు వర్గపోరాటం (క్లాస్ వార్) నడుస్తున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నిజమే ఇప్పుడిక్కడ స్పష్టమైన వర్గ విభజన ఏర్పడుతున్నది. పేదలంతా ఒకవైపు సమీకృతమవుతున్నారు. సంపన్నవర్గ ప్రయోజనాన్ని కాంక్షించే వారంతా ఒకవైపునకు కదులుతున్నారు. పేదవర్గాల ప్రజలందరికీ సమానావకాశాలు లభిస్తే, అవకాశాలను అందిపుచ్చుకోగల నైపుణ్యాన్ని ఆ వర్గాలు సంతరించుకుంటే సంపన్నుల పెత్తందారీతనానికి సవాల్ ఎదురౌతుంది. సహజ వనరులపై, రాజకీయ, ఆర్థిక రంగాలపై వారికి ఉన్న పట్టు సడలుతుంది. భారత రాజ్యాంగం దేశ ప్రజలకు హామీ ఇచ్చింది కేవలం రాజకీయ ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం కూడా. ఈ ప్రజాస్వామ్యాలు విస్తృతమవుతున్న కొద్దీ పేదవర్గాలు అదే నిష్పత్తిలో సాధికారతను సాధిస్తాయి. ఇది మౌలిక సూత్రం. అందువల్లనే ప్రజాస్వామ్యం విస్తృతమవడానికి పెత్తందారీ వ్యవస్థ ఇచ్ఛగించదనే సంగతి మనందరికీ తెలిసిన సత్యమే. రాజ్యాంగం కల్పించిన అవకాశాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న కారణంగానే ఇప్పుడు రాష్ట్రంలో వర్గపోరాటం అనివార్యమయ్యే పరిస్థితి నెలకొన్నది.

పెత్తందారీ వ్యవస్థ వేయిచేతుల కార్తవీర్యార్జునుడి లాంటిది. ఏకకాలంలో ఐదువందల బాణాలను వివిధ లక్ష్యాల పైకి ప్రయోగించగలదు. మనం ఏం తింటే రైటు? ఎప్పుడు పడుకుంటే రైటు? సంప్రదాయాలేమిటి? ఆచారాలేమిటి? వగైరా వ్యక్తిగత విషయాలను కూడా కట్టుబాట్ల పేరుతో పెత్తందారీ వ్యవస్థ నిర్దేశిస్తుంది. ఏది న్యాయం? ఏది ధర్మం? ఏది అభివృద్ధి? ఏది అరాచకం? అనే విషయాలను ఈ వ్యవస్థ తన వేయిబాహువుల ద్వారా వెల్లడి చేస్తుంది. దీన్నే మనం ఆధిపత్య భావజాలం అంటున్నాము. దాన్ని మనం నమ్మాలి. సేవ్ డెమోక్రసీ పేరుతో హఠాత్తుగా విజయవాడలో ఒక మీటింగ్ జరుగుతుంది. పెత్తందారీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేస్తుంది. దానికి జనసేనతోపాటు కమ్యూనిస్టు పార్టీలు రెండూ హాజరవుతాయి. పీపుల్స్ డెమోక్రసీ (జనతా ప్రజాస్వామ్యం) పేరుతో జాతీయ అధికార పత్రికను నడుపుతున్న రాజకీయ పార్టీ ఈ హెజిమోనిక్ డెమోక్రసీ (పెత్తందారీ ప్రజాస్వామ్యం) సమావేశానికి హాజరు కావడం విచిత్రం. అదే పెత్తందారీ కార్తవీర్యార్జునుడి ప్రత్యేకత.

అదే విజయవాడలో అసందర్భంగా ప్రపంచ తెలుగు రచయితల సభ జరుగుతుంది. ఆ సభలోని వక్తలంతా తెలుగు భాష ప్రాచుర్యంపైన కాకుండా ఇంగ్లిష్ మీడియం బోధనపైన దాడిని ఎక్కుపెడతారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశపెట్టిన తర్వాత తెలుగుదేశం పార్టీ, ఎల్లో మీడియా వ్యతిరేకించాయి. కానీ ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో తోక ముడిచాయి. పొలిటికల్ ఫ్రంట్‌లో కాల్పుల విరమణ ప్రకటించి ఇప్పుడు కల్చరల్ వార్ ఫ్రంట్‌ను ఓపెన్ చేశాయన్నమాట. పొలిటికల్ పార్టీ చేతికి మట్టి అంటకుండా ఆధిపత్య భావజాలం ద్వారా సంస్కృతి పేరుతో కొన్ని మెదళ్లనయినా కలుషితం చేయడమన్నమాట.

మన పెత్తందారీ వర్గం చెప్పుచేతల్లోనే సినిమా రంగం కూడా ఉన్నదనే విషయం అందరికీ తెలిసిందే. చంద్రబాబు నాయుడు బామ్మర్ది, ప్రసిద్ధ నటుడైన బాలయ్య షో ఒకటి నడుస్తున్నది. ఆ షోలో అతిథిగా చంద్రబాబు పాల్గొన్నారు. చంద్రబాబు చేసిన వెన్నుపోటు మహాపాతకంపై పసుపునీళ్లు చల్లి ప్రక్షాళన చేసే ప్రయత్నం ఆ షోలో చేశారు. ఒకరినొకరు ద్వేషించుకునే చరిత్ర ఉన్న నటులంతా కడుపులో కత్తులు దాచుకొని కౌగిలింతలు ప్రదర్శించడాన్ని ఈ షో ద్వారా జనం వింతగా చూస్తున్నారు. మేమంతా ఒక్కటే, పెత్తందారీ వ్యవస్థకు ప్రమాదం ఏర్పడితే ఒక్కటిగా కదులుతామనే సందేశాన్ని ఇవ్వడానికి ఈ షోను వాడేస్తున్నారని అర్థమవుతున్నది. పైన పేర్కొన్న మూడు దృష్టాంతాలు దేనికవే యథాలాపంగా జరిగినవి కావు. ఇవన్నీ పేద ప్రజల సాధికారత ఉద్యమానికి వ్యతిరేకంగా, వారికి స్ఫూర్తిగా నిలబడిన వైఎస్ జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన బాణాలే. మూడు విషయాలనే మనం చర్చించుకున్నాము. కానీ పెత్తందారీ కార్తవీర్యార్జునుడికి వేయి చేతులు, వేయి కుంపట్లను రాజేస్తూనే ఉంటాడు. వాటి లక్ష్యం మాత్రం ఒకటే.

సాధారణ ప్రజలను, మర్మం తెలియని కొందరు మేధావులను బోల్తా కొట్టించడానికి అభివృద్ధి అనే పాచికను ప్రయోగించడం పెత్తందారీ ప్రతినిధులకు అలవాటుగా మారింది. తెలుగుదేశం పార్టీ నగ్నదేహం మీద ఒక దేవతా వస్త్రాన్ని కప్పి దాన్నే అభివృద్ధిగా ప్రచారం చేసుకోవడం చాలామందికి తెలిసిన విషయమే. అభివృద్ధి అంశంపైన అర్థవంతమై చర్చకు సిద్ధపడితే ఈ ప్రతినిధులు తోక ముడవడం ఖాయం. వీరి అభివృద్ధి అంకంలో మొదటిది అమరావతి ప్రస్తావన. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందని, దాని వెనకున్న లక్షల కోట్ల స్కామ్‌ను దాచే ప్రయత్నం చేస్తారు. రాజధానే లేని అభివృద్ధి ఏమిటని ప్రశ్నిస్తారు. పల్లెపల్లెనా, వీధివీధినా వెలసిన పదిహేను వేల రాజధానులు (సెక్రటేరియట్‌లు) ఆంధ్రదేశాన్ని పరిపాలిస్తుండగా రాజధాని లేదనే ఆక్రోశమేమిటి? ఈ పదిహేను వేల రాజధానులు జనతా ప్రజాస్వామ్యానికి కొలమానాలైతే, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీల్లేని అమరావతి పెత్తందారీ ప్రజాస్వామ్యానికి నిదర్శనం.

మూడున్నరేళ్ల కింద మన ఊరు ఎలా ఉన్నది? ఇప్పుడెలా ఉన్నది? పెత్తందారీ ప్రతినిధులు ఎవరైనా సరే గ్రామ చావడిలో కూర్చొని చర్చించడానికి సిద్ధమా? మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండానే సొంత ఊరిలోనే అన్ని వ్యవహారాలు నడిపిస్తున్న సెక్రటేరియట్. అక్కడ ఒక్క రూపాయి లంచమడగని కొత్త మార్పు. ఊళ్లో విలేజి క్లినిక్. అక్కడ ఎల్లవేళలా సిద్ధంగా ఉండే మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి టెలిమెడిసిన్ ద్వారా అందుబాటులో డాక్టర్. కొత్తగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం. ఈ ఫ్యామిలీ డాక్టర్ క్రమం తప్పకుండా మన ఊరికి వచ్చే డ్యూటీ.

ప్రతి గ్రామ పంచాయతీలో రైతు భరోసా కేంద్రం. అక్కడ అందుబాటులో వ్యవసాయ – ఉద్యానవన శాఖలకు సంబంధించిన అసిస్టెంట్లు. బ్యాంకింగ్ కరస్పాండెంట్లు. బుక్‌చేసిన 24 గంటల్లో సర్టిఫైడ్ ఎరువులు, విత్తనాలు అందజేసే కియోస్క్‌లు. వ్యవసాయ పనిముట్లు అద్దెకిచ్చే కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు... ఇవన్నీ ఊరికి ఎప్పుడొచ్చాయో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం ఉన్నదా? శిథిలమైపోయిన బడి 'నాడు–నేడు' తర్వాత కొత్త కాంతులు పూస్తున్న వైనం మన కళ్లముందే కనిపిస్తున్నది. బడికెళ్లే పిల్లలకు యూనిఫామ్, బూట్లు, బెల్ట్, బ్యాగ్, పుస్తకాలు ... ఇలా అవసరమైనవన్నీ ప్రభుత్వం సమకూర్చుతున్న వైనం... పిల్లల్ని బడికి పంపినందుకు అమ్మఒడిలో ఏటా పదిహేను వేలు. పెద్దక్లాసుల పిల్లలకు విద్యాదీవెన, వసతి దీవెన. బీదా–బిక్కి తేడా లేకుండా రాబోయే తరం మొత్తంగా నాణ్యమైన విద్యను అభ్యసించే విధంగా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకున్నది. ఇవి కావా అభివృద్ధి రూపాలు?

విద్యారంగానికి సంబంధించి చంద్రబాబు హయాంలో రాష్ట్రం జాతీయ స్థాయిలో 18వ ర్యాంకులో ఉండగా ఇప్పుడు 4వ స్థానానికి ఎగబాకినట్టు ఇండియా టుడే నివేదిక వెల్లడించింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై ప్రధానమంత్రి ఆర్థిక సలహా కమిటీ ఇచ్చిన నివేదికలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నట్టు వెల్లడించారు. విద్యారంగంలో ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని కూడా ఇతర రాష్ట్రాలకు సూచించారు. పరిశ్రమలు కొత్తవి రావడం లేదనే విషప్రచారం యెల్లో మీడియాలో తరచూ చూస్తున్నాము. ఈ మూడున్నరేళ్లలో 108 భారీ, అతిభారీ యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. వీటిద్వారా 75 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 60 వేల మందికి ఈ పరిశ్రమల్లో ఉద్యోగాలొచ్చాయి. ఈ కేటగిరీలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏటా సగటున 11 వేల కోట్ల పెట్టుబడులు వస్తే, ఇప్పుడు మూడున్నరేళ్లలో రెండేళ్లను కరోనా కోసేసినప్పటికీ సగటున ఏటా 13 వేల కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇవన్నీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ లెక్కలు.

సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు 2019 నాటికి ఒక లక్షా ఐదువేల యూనిట్లు ఉంటే ఈ మూడున్నరేళ్లలో వంద శాతానికి పైగా పెరిగి 2,13,826కు చేరుకున్నాయి. ఈ యూనిట్ల ద్వారా పది లక్షల మందికి కొత్తగా ఉపాధి లభించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్స్ వెల్లడించిన గణాంకాలు ఇవి. 30 వేల కోట్లతో నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మాణం కాబోతున్నాయి. సముద్ర తీర ప్రాంత అభివృద్ధి కొత్త పుంతలు తొక్కబోతున్నది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న పద్నాలుగేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పడలేదు. మూడున్నరేళ్ల కాలంలో వైఎస్ జగన్ 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని తలకెత్తుకున్నారు. ఈ సంవత్సరం అందులో ఐదు కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఇప్పుడు చెప్పండి ఎవరు అభివృద్ధి ప్రదాత? ఎవరు విజినరీ?

కాకపోతే నిరుపేదల సాధికారతకూ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు వైఎస్ జగన్ కృషి చేస్తున్నారు. ఈ కర్తవ్యాన్ని రాజ్యాంగబద్ధ ధర్మంగా ఆయన పరిగణిస్తున్నారు. రాజ్యాంగ యంత్రాంగాన్ని ఇంతకాలంగా అదుపులో పెట్టుకున్న పెత్తందారీ వర్గాలకు ఇది సహించడం లేదు. అందుకే పేదవర్గాల మీద పెత్తందారీ వర్గాలు యుద్ధాన్ని ప్రకటించాయి. పేదవర్గాలకు దన్నుగా నిలబడి వైఎస్ జగన్ ప్రభుత్వం మీద విష రసాయనాల దాడికి పూనుకుంటున్నాయి. ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు పేద వర్గాలు సమాయత్తమవుతున్నాయి. ఈ నూతన సంవత్సరం ప్రభవించే వేళ ఆ వర్గాల ప్రజలు 'ఆయుధ పూజకు' సిద్ధపడుతున్నారు. కార్తవీర్యార్జునుడి వేయి చేతులనూ భార్గవ రాముడు ఒక్క గొడ్డలి వేటుతో నరికేశాడు. పేదవర్గాల ప్రజలు చైతన్యమనే ఆయుధాన్ని విసిరితే పెత్తందార్ల సహస్ర బాహువులూ తెగిపడక తప్పదు.

vardhelli1959@gmail.com

> ఆ పెట్టెలో శస్త్ర సంధాన మంత్రోపదేశం ఉన్నది. అర్జునుడి చెవిలో ద్రోణాచార్యుడు చెప్పిన విలువిద్యా రహస్యం ఇక ఏకలవ్యులకు కూడా వినబడబోతున్నది. డిజిటల్ డివైడ్ అంతం కానున్నది. అక్షర పెత్తందారీతనానికి తెరపడబోతున్నది. సాంకేతిక దోపిడీకి చరమగీతం పాడే సమయం ఆసన్నమవుతున్నది. అదిగో ఈ ఫోటోలోని బాలిక పరవశాన్ని చూడండి. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ను అపురూపమైన ఆయుధంగా భావించి ముద్దాడుతున్న ఆ బాలిక స్పందన చూడండి. పద్మవ్యూహ చక్రబంధంలో అభిమన్యుని ఇరికించిన కురువీరులు అధర్మ యుద్ధంతో అతడిని నిరాయుధునిగా మార్చినప్పుడు... ఏ అదృశ్యశక్తో అతడి చేతికి ధనుర్బాణాలను అందజేస్తే స్పందన ఎలా ఉండేదో?... ఈ ఏకలవ్యుల స్పందన కూడా అలాగే ఉన్నది. చేతికందిన విల్లంబుల్ని ఎక్కుపెట్టడానికి వారు సిద్ధపడుతున్నారు. చేప యంత్రాలను కొట్టడానికో, చెట్టుమీదున్న పిట్ట కన్నును పొడవడానికో వారు పరిమితం కాబోరు. ఈ లోకపు వెలుగుల్ని దిగంతాల దాకా మండించగల విలుకాళ్లవుతారు.

> సాధారణ ప్రజలను, మర్మం తెలియని కొందరు మేధావులను బోల్తా కొట్టించడానికి అభివృద్ధి అనే పాచికను ప్రయోగించడం పెత్తందారీ ప్రతినిధులకు అలవాటుగా మారింది. తెలుగుదేశం పార్టీ నగ్నదేహం మీద ఒక దేవతా వస్త్రాన్ని కప్పి దాన్నే అభివృద్ధిగా ప్రచారం చేసుకోవడం చాలామందికి తెలిసిన విషయమే. అభివృద్ధి అంశంపైన అర్థవంతమైన చర్చకు సిద్ధపడితే ఈ ప్రతినిధులు తోక ముడవడం ఖాయం. వీరి అభివృద్ధి అంకంలో మొదటిది అమరావతి ప్రస్తావన. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందని, దాని వెనకున్న లక్షల కోట్ల స్కామ్‌ను దాచే ప్రయత్నం చేస్తారు. రాజధానే లేని అభివృద్ధి ఏమిటని ప్రశ్నిస్తారు. పల్లెపల్లెనా, వీధివీధినా వెలసిన పదిహేను వేల రాజధానులు (సెక్రటేరియట్‌లు) ఆంధ్రదేశాన్ని పరిపాలిస్తుండగా రాజధాని లేదనే ఆక్రోశమేమిటి? ఈ పదిహేను వేల రాజధానులు జనతా ప్రజాస్వామ్యానికి కొలమానాలైతే, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి వీల్లేని అమరావతి పెత్తందారీ ప్రజాస్వామ్యానికి నిదర్శనం.

'భీమా కోరేగావ్' స్ఫూర్తితో పోరాడుదాం!

కుల వ్యవస్థ దుర్మార్గపు అణచివేత, వివక్ష, అంటరాని తనం నుండి విముక్తి పొందడానికి మహార్ పీడిత కులానికి చెందిన ఐదు వందలమంది సైనికులు 1818 జనవరి ఒకటవ తేదీ నాడు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ తరఫున రెండవ బాజీరావు పీష్వా సైన్యంతో భీమానది ఒడ్డున వీరోచితంగా పోరాడి విజయం సాధించారు. ఈ విజయానికి సూచనగా అప్పటి బ్రిటిష్ గవర్నమెంట్ కోరేగావ్ వద్ద మహార్ అమరవీరుల స్థూపాన్ని నిర్మించి, ఆ స్థూపంపై యుద్ధంలో చనిపోయిన 22 మంది మహార్ వీరుల పేర్లను చెక్కించారు. భీమా నది ఒడ్డున నిర్మించిన మహార్ వీరుల స్మారక విజయ స్తంభాన్ని 1927లో డాక్టర్ అంబేడ్కర్ సందర్శించే వరకు భీమా కోరేగావ్ చరిత్ర... స్వతంత్ర పోరాటం పేరుతో వక్రీకరణకు గురైంది. అక్కడ జరిగిన యుద్ధం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దురాక్రమణకు వ్యతిరేకంగా మరాఠాలు చేసిన స్వాతంత్ర్య పోరాటంగా కుహనా చరిత్రకారులు చిత్రించారు.

నిజానికి చరిత్ర లోతుల్లోకి తొంగిచూస్తే... మహార్ వీరులు ఆ యుద్ధంలో తమ పట్ల పీష్వాలు అనుసరిస్తున్న అంటరానితనం, అణచివేతలకు వ్యతిరేకంగా... తమ విముక్తి కొరకే పాల్గొన్నారనేది వాస్తవం. అంబేడ్కర్ భీమాకోరేగావ్ వద్ద విజయాన్ని మరాఠా పీష్వాల రాజ్యంలో 'బ్రాహ్మణీయ అణచివేతపై దళిత ఆత్మగౌరవ ప్రతీకగా' ప్రకటించడంతో అసలు చరిత్ర వెలుగులోకి వచ్చింది. మరాఠా సామ్రాజ్యంలో నిజానికి పీష్వాలు దళితులపై చేస్తున్న కుల అణచివేత, ఆగడాలు అంతా ఇంతా కాదు. నడుముకు చీపురు, మూతికి ముంత కట్టించారు.



భీమా కోరేగావ్ స్థూపం

దళితులకు భూమి, ఆత్మగౌరవం, ఆయుధాలు నిరాకరించి పశువుల కన్నా హీనంగా చూస్తున్న పీష్వాల పాలనలో పోరాటం తప్పితే మరేమీ మిగల్లేదు. యుద్ధానికి ముందు మహార్ల నాయకుడైన సిఖ్ నాయక్... పీష్వా సైన్యాధికారిని యుద్ధం జరగకుండా ఉండాలంటే... తమను మనుషులుగా గుర్తించి, అంటరానితనం పాటించడం నిలిపివేసి కనీస హక్కులు ఇవ్వాలని అడిగాడు. 'మీరు యుద్ధం చేసి గెలిచినా కూడా అస్పృశ్యులే, మీ అంటరానితనం పోదు. మీరు ఎప్పుడూ మా కాళ్లకింద ఉండేవారే' అని కండకావరంతో సైనికాధికారి మాట్లాడటంతో యుద్ధం అనివార్యమైంది. అత్యంత బలస్థులూ, పోరాట యోధులైన మహార్ యువకులు ఆ మాటలతో ఆత్మగౌరవం కోసం పోరాటం చేశారు.

రెండు రోజులు కాలినడకన ప్రయాణం చేశారు. వెంట తెచ్చుకున్న రొట్టెలు అయిపోయాయి. అయినా ఆకలితో ఉండి కూడా భీమా నది ఒడ్డున 1818 జనవరి ఒకటవ తేదీనాడు 20 వేల అశ్వికదళం, 8 వేల పదాతిదళం కలిగినన పీష్వాల సైన్యంతో పోరాడి విజయం సాధించారు. ఇది ముమ్మాటికీ కుల పీడనపై 'ప్రతిఘటన'గానే మనం చూడాలి.

నేడు కుల వ్యవస్థ ఆధునిక రూపాలు సంతరించుకొని గ్రామాల నుండి పట్టణాల వరకూ, పాఠశాలల నుండి యూనివర్సిటీల వరకూ, చిన్న పని ప్రదేశాల నుండి కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల వరకూ రాజ్యమేలుతోంది.

రోజురోజుకు బలోపేతం అవుతున్న హిందుత్వ ఫాసిజం మనుస్మృతిని అధికారికంగా నెలకొల్పే దిశగా పయనిస్తున్నది. దళిత బహుజనుల నీడ, గాలి సోకకుండా వారి మానవ హక్కులన్నింటినీ నిషేధించిన పీష్వాల అగ్రవర్ణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిన భీమా కోరేగావ్ పోరాటాన్ని ఎత్తి పడుతూ అంబేడ్కర్ ఆ పోరాటాన్ని ఆత్మగౌరవ ప్రతీక అని ప్రకటించి, దానిని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళారు. అనంతరం ఈ దేశ రాజ్యాంగంలో దళితులకు హక్కులను పొందుపర్చడంతో పాటు కుల వర్గ పీడన అంతం కావాలని ఆశించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాతిపదికన మహిళలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీలతో కూడిన బహుజన సమాజపు విముక్తికై వినూత్న మార్గంలో పోరాడారు. అయినా కొత్త పీష్వాలు అధికారాన్ని చెలాయిస్తున్న సందర్భంలో మళ్లీ మనువాదం పూర్తి స్థాయిలో జడలు విప్పుకునే అవకాశం ఉంది. అందుకే బహుజన సమాజం అప్రమత్తతతో ఉండాలి.

– కోట ఆనంద్, కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ | 96523 57076

(నేడు భీమా కోరెగావ్ పోరాటం జరిగిన రోజు)

క్లుప్తంగా...

3 రోజులు మల్లన్న స్పర్శదర్శనం నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం నుంచి జనవరి 2వ తేదీ వరకు మల్లన్న స్పర్శదర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. జనవరి 1న నూతన సంవత్సరం, జనవరి 2న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మల్లన్న స్పర్శదర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. మల్లికార్జునస్వామి గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేక సేవాకర్తలు, వీఐపీ విరామదర్శనం (బ్రేక్ దర్శనం) టికెట్లు తీసుకున్న వారికి కూడా స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తామని పేర్కొన్నారు.

దుర్గమ్మ, శ్రీలక్ష్మీనృసింహస్వామిలను దర్శించుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)/మంగళగిరి : రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో భ్రమరాంబ.. జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను అందజేశారు. అలాగే, మంగళగిరిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామిని కూడా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు దర్శించుకున్నారు. ఈవో రామకోటిరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్



ఆలయం వెలుపల మనోజ్‌సిన్హా

తిరుచానూరు(తిరుపతి జిల్లా): శ్రీపద్మావతి అమ్మవారిని శనివారం జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో ప్రభాకర్‌రెడ్డి గవర్నర్‌కు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపం వద్ద వేద పండితులు వేద ఆశీర్వచనం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు.

సామాన్య భక్తులకే పెద్దపీట



తిరుమల: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ భారీ ఏర్పాట్లు చేసింది. సోమవారం రాత్రి ఒంటి గంట నుంచే శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. మొత్తం 10 రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనుంది. శ్రీవారి దర్శనార్థం విచ్చేస్తున్న సామాన్యులకు పెద్దపీట వేస్తోంది. ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టీటీడీ పూర్తిగా రద్దు చేసింది. సప్తగిరులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. దాదాపు 12 టన్నుల పుష్పాలతో శ్రీవారి ఆలయం, అనుబంధ ఆలయాలను తీర్చిదిద్దారు. గోవింద మాల ధరించిన భక్తులు ఇరుముడిని చెల్లించేందుకు ఆలయం వెలుపల హుండీలను ఏర్పాటు చేశారు. తిరుమలకు విచ్చేస్తున్న వీఐపీల కోసం ప్రత్యేకంగా పద్మావతి అతిథిగృహం ప్రాంతంలోని సన్నిధానం, వెంకటకళానిలయం, రామరాజు, సీతా నిలయం, గోవిందసాయి వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే ఆరు టికెట్లు, అధికారులకు నాలుగు టికెట్లను జారీ చేయనున్నారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం 20 మంది పైగా న్యాయమూర్తులు, పలువురు కేంద్ర మంత్రులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన 20 మంది మంత్రులు, 100 మందికి పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు వస్తున్నట్లు టీటీడీకి సమాచారం అందింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ పది రోజులలో దాదాపు ఎనిమిది లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది.

సామాన్యులకే ప్రాధాన్యం



వైకుంఠ ద్వార దర్శనానికి తరలివచ్చే సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నా. ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్వం సిద్ధం చేశాం. అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, టీ, కాఫీ తదితరాలను ఎప్పటికప్పుడు అందించేలా జాగ్రత్తలు తీసు కున్నాం. తిరుపతిలో ఏర్పాటు చేసిన స్వరదర్శనం కౌంటర్ల వద్ద పటిష్ట భద్రత కల్పించాం.

– అనిల్‌కుమార్ సింఘాల్, టీటీడీ ఈవో

విశిష్టం.. ఉత్తర ద్వారం

వేంకటాచల మహత్యంలో ధనుర్మాసాన్ని దేవతల నెలగా పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున దేవతలు కొలువై ఉండే ఉత్తర ద్వారం గుండా స్వామి వారు వెలుపలికి వచ్చి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అదే విధంగా శ్రీవారి గర్భాలయ ప్రాకారాన్ని స్పృశించే భాగ్యం భక్తులకు కలుగుతోంది. ఈ మార్గం ద్వారా శ్రీవారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఏకాదశి పర్వదినాన శ్రీవారు ప్రత్యేకంగా స్వర్ణ రథంపై మాడవీధుల్లో ఊరేగుతారు. ఇక ద్వాదశి పర్వదినాన వేకువజామున స్వామి వారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు.

ఐదు పైసలకే బిర్యానీ

- క్యూ కట్టిన జనం.. పోలీసుల లాఠీ చార్జ్



బిర్యానీ కోసం భారీగా క్యూలో ఉన్న ప్రజలు

బొమ్మలసత్రం: డిసెంబర్ 31 (2022 చివరి రోజు) సందర్భంగా నంద్యాల పట్టణంలోని క్లాసిక్ జైల్ రెస్టారెంట్ నిర్వాహకులు పాత 5 పైసల నాణెం ఇస్తే బిర్యానీ ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. దీని కోసం 5 పైసల నాణేలు తీసుకొచ్చి వందల మంది స్థానిక పద్మావతి నగర్‌లోని రెస్టారెంట్ వద్ద గుమిగూడారు. ప్రజలు భారీగా తరలిరావటంతో రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. బిర్యానీ కోసం జనాల మధ్య తోపులాట జరిగింది. ఇంతలో అక్కడికి చేరుకున్న పోలీసులు స్వల్పంగా లాఠీ చార్జ్ చేయాల్సి వచ్చింది. జనాలను అక్కడి నుంచి పంపి రెస్టారెంట్‌కు పోలీసులు తాళం వేశారు. ఇందుకు కారణమైన రెస్టారెంట్ నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు.

జనవరిలో తిరుమలలో విశేష పర్వదినాలు

తిరుమల: తిరుమలలో 2023 జనవరిలో జరిగే విశేష పర్వదినాలను టీటీడీ ప్రజా సంబంధాల విభాగం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం. 2న తిరుమల శ్రీవారి స్వర్ణ రథోత్సవం, 3న శ్రీ స్వామి పుష్కరిణి తీర్థ ముక్కోటి, శ్రీవారి చక్రస్నానం, 7న ప్రణయకలహ మహోత్సవం, 7 నుంచి 13వ తేదీ వరకు ఆండాళ్ నీరాటోత్సవం, 14న భోగిపండుగ, 15న అధ్యయనోత్సవం, మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ, శ్రీ గోదా పరిణయోత్సవం, 26న భారత గణతంత్ర దినోత్సవం, వసంత పంచమి, 28న రథసప్తమి నిర్వహించనున్నట్టు పేర్కొంది. తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం నుంచి గరుడ పురాణ పారాయణం ప్రారంభం కానుంది. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు ఐ.సత్యకిషోర్ శాస్త్రి, ఆర్.కుమార స్వామి గరుడ పురాణ పారాయణం చేయనున్నారు.



తిరుమల ఆలయం వెలుపల కేంద్రమంత్రి కిషన్ పాల్ గుర్జార్

2022లో 2.35 కోట్ల మందికి శ్రీవారి దర్శనం

తిరుమల 2022 సంవత్సరం గణంకాలను టీటీడీ విడుదల చేసింది. ఈ ఏడాది స్వామివారిని 2,35, 58,325 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకల రూపేణా రూ.1,446 కోట్లు లభించింది. ఈ మేరకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వామివారి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేశారు. 1,08,51,706 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. 11,42, 78,291 లడ్డూల విక్రయాలు జరిగాయి. కాగా, తిరుమలలో శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 18 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతుంది. తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి కిషన్ పాల్ గుర్జార్, ఎంపీలు సంజీవ్ కుమార్, మాగంటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే పోసగుంట్ల ప్రభాకర్‌రెడ్డి, తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి తదితరులు దర్శించుకున్నారు.

తెలంగాణ

ఎన్‌ఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా డాక్టర్ కోమల్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్‌ఎఫ్‌సీ) కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా డాక్టర్ కోమల్ కుమార్ నియమితులయ్యారు. డాక్టర్ దినేష్ శ్రీవాత్సవ పదవీ విరమణ చేసిన నేపథ్యంలో కోమల్ కుమార్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. లోహ శాస్త్రంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన కోమల్ కుమార్ 1989లో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ నుంచి శిక్షణ పొందారు. అనంతరం ఎన్‌ఎఫ్‌సీలో శాస్త్రవేత్తగా చేరిన ఆయన ఇప్పటివరకూ వివిధ హోదాల్లో సేవలు అందించారు. ఐఐటీ ముంబై నుంచి మెటలర్జికల్ ఇంజనీరింగ్ డాక్టరేట్ కూడా పొందిన కోమల్ కుమార్ దేశ అంతరిక్ష, రక్షణ రంగాల్లో కీలకమైన లోహ పరికరాల తయారీకి దోహదపడ్డారు. అణు రియాక్టర్లలో, బ్రహ్మోస్ క్షిపణిలో వాడే అతుకులు లేని వేర్వేరు మిశ్ర ధాతు గొట్టాల తయారీలో కోమల్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

గంజాయి స్మగ్లర్ల చెర నుంచి గిరిజనుడికి విముక్తి


- మహారాష్ట్రకు చెందిన ఇద్దరు అరెస్టు



చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): గంజాయి స్మగ్లర్ల చెరలో ఉన్న ఓ గిరిజనుడిని విడిపించి ఇద్దరిని అరెస్టు చేశామని శనివారం ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని జలగం జిల్లా పరోలా గ్రామానికి చెందిన రూపేష్ చింతపల్లి ప్రాంతానికి చెందిన రాజారత్నం, శిరీష, సలోని, శ్రీను, ఒడిశాకు చెందిన మాధవ్, అజయ్ అనే వ్యక్తులతో 600 కిలోల గంజాయి సరఫరా చేయాలని రూ.3 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్ తీసుకోవడానికి విశాఖపట్నం రావలసిందిగా రూపేష్ తెలిపాడు. దీంతో రాజారత్నం శ్రీను దగ్గర రూ.5 వేలు అప్పుగా తీసుకుని అతనిని తనతో పాటు విశాఖపట్నం తీసుకెళ్లాడు. అక్కడ రూపేష్, రెహ్మాన్, పేరు తెలియని మరో వ్యక్తి గంజాయి సరఫరాకు సంబంధించి రూ.3 లక్షలు చెల్లించి శ్రీనును వారి వద్ద హామీగా ఉంచుకున్నారు. అనుకున్న సమయానికి గంజాయి దొరకలేదు. దీంతో శ్రీనును రూపేష్, రెహ్మాన్ మహారాష్ట్ర తీసుకుపోయి నిర్బంధించి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. సుమారు 68 రోజులపాటు వారి వద్ద నిర్బంధంలో ఉండడంతో శ్రీను భార్య గత నెలలో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ మహ్మద్ షరీఫ్ అలీ బృందం సాంకేతిక సహాయంతో పాటు అక్కడి పోలీసుల సహకారంతో శ్రీనును విడిపించి శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, కేసుతో సంబంధం ఉన్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నామని ఏఎస్పీ తెలిపారు.

శ్రీకృష్ణావతారంలో రామయ్య

- భద్రాద్రికి ముక్కోటి శోభ
- నేడు తెప్పోత్సవం, రేపు ఉత్తర ద్వారదర్శనం



విద్యుద్దీప కాంతుల్లో వెలిగిపోతున్న భద్రాద్రి రామాలయం

భద్రాచలం: వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలంలో ఆదివారం సాయంత్రం తెప్పోత్సవం, సోమవారం తెల్లవారుజామున ఉత్తర ద్వార దర్శనం జరగనున్నాయి. ఈమేరకు శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలు, చలువ పందిళ్లు, షామియానాలతో అందంగా ముస్తాబు చేశారు. గోదావరి ఒడ్డున స్వామి వారికి తెప్పోత్సవం జరిపే హంస వాహనాన్ని ఇప్పటికే తీర్చిదిద్దగా ట్రయల్ రన్‌ను పూర్తి చేశారు. దీనికి గోదావరిలో ర్యాంప్ ఏర్పాటు చేశారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు, బట్టలు మార్చుకోవటానికి గదులు సిద్ధమయ్యాయి. ఉత్తర ద్వారదర్శనం టిక్కెట్లు, వసతి గృహాలను ఆన్‌లైన్‌లో భక్తుల సౌకర్యార్థం అందుబాటులో ఉంచారు. తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరుకానున్న నేపథ్యాన పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఉదయం బేడా మండపంలో ఆళ్వార్లతో కూడిన స్వామి వారి ఉత్సవమూర్తులకు వేదపండితులు 200 పాశురాల దివ్యప్రబంధం పఠించారు. స్వామి వారిని కృష్ణావతారంలో ప్రత్యేకంగా అలంకరించి కనులపండువగా ఊంజల్‌సేవ జరిపారు. అనంతరం స్వామివారిని పల్లకిసేవలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియం వేదికపైకి తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశాక, తిరువీధి సేవ జరిపారు.

తెలంగాణ

భళా చిత్రం.. కళా యజ్ఞం!

సోషల్ మీడియాలో ఆకట్టుకుంటున్న 'ఆర్ట్ చాలెంజ్'

- 21 రోజుల పాటు 21 అంశాలపై చిత్రాలు
- పాల్గొంటున్న వందల మంది చిత్రకారులు
- ఇందులో వచ్చిన ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ఆర్ట్ ఎగ్జిబిషన్ పెడతామన్న నిర్వాహకులు

సాక్షి, హైదరాబాద్: అప్పుడే కుంచె పట్టడం మొదలుపెట్టిన వారి నుంచి అలవోకగా కళాకృతులను సృష్టించే చిత్రకారులు. చూడగానే ఆకట్టుకునే, ఆలోచింపజేసే చిత్రాలు. ఓ సరికొత్త కళాయజ్ఞం. 21 రోజులపాటు రోజూ ఒక చిత్రాన్ని గీయాలంటూ ప్రముఖ చిత్రకారుడు యేలూరి శేషబ్రహ్మం ఇచ్చిన పిలుపునకు స్పందన ఇది. దేశంలోనే తొలిసారిగా ఫేస్‌బుక్ వేదికగా డిసెంబర్ 11న మొదలైన ఈ 'చాలెంజ్' శనివారం (31వ తేదీ)తో ముగిసింది. 400 మందికిపైగా చిత్రకారులు, వేలకొద్దీ చిత్రాలను గీసి ఈ 'కళాయజ్ఞం'లో పాల్గొన్నారు. ఇందులో పదుల సంఖ్యలో విదేశీ చిత్రకారులూ ఉండటం గమనార్హం.

ఆర్ట్ చాలెంజ్ లాంటిదే..

దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఈ '21 రోజుల కళాయజ్ఞ'.. సోషల్ మీడియా వేదికగా నడుస్తున్న పలు చాలెంజ్‌ల తరహాలో ఒక ఆర్ట్ చాలెంజ్ అని చెప్పొచ్చు. అయితే దాన్ని 'కళాయజ్ఞ'గా పేర్కొనడంతో మరింత భారతీయతను సంతరించుకుంది. నిర్వాహకులు ముందే ప్రకటించిన 21 అంశాలలో రోజుకొక అంశం చొప్పున సింగిల్ కలర్ లేక మోనోక్రోమ్ విధానంలో 21 రోజుల పాటు చిత్రాలు గీయడమే దీని లక్ష్యం. ప్రకటిత అంశాలన్నీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, సామాన్య జనజీవన విధానాన్ని తెలిపేలా రూపొందించారు. దీనికోసం 'ఫేస్‌బుక్'లో ప్రత్యేకంగా ఒక గ్రూపును ఏర్పాటు చేశారు. అప్పుడప్పుడే కుంచె పట్టిన చేతుల నుంచి కళాత్మకంగా కుంచెను నాట్యమాడించే వారి వరకు ప్రతిఒక్కరూ అద్భుత కళాఖండాలను సృష్టిస్తున్నారు. ప్రొఫెషనల్ చిత్రకారులే కాక ఇల్లస్ట్రేటర్స్, కార్టూనిస్టులు, స్థపతులు, డిజైనర్లు ఇంకా అనేక రంగాలలో ఉండి అభిరుచితో చిత్రాలు గీసేవారు కూడా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. డ్రాయింగ్స్, పెయింటింగ్స్, శాండ్ ఆర్ట్, ప్రింట్ మేకింగ్, గ్రానైట్ ఎచింగ్స్ ద్వారా కూడా చిత్రాలకు ప్రాణం పోస్తున్నారు.

అనూహ్య స్పందన వస్తోంది

విదేశాలతో పోలిస్తే మన దగ్గర ఆర్ట్ చాలెంజ్‌లు అరుదు. అందుకే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల థీమ్‌తో దీన్ని డిజైన్ చేశాం. పదుల సంఖ్యలో వస్తారనుకున్నాం. కానీ అనుకోని విధంగా భారీ స్పందన లభించింది. వందలాది మంది వర్క్స్ ఒకేరోజు చూసే అవకాశం కళాభిమానులకు కనువిందు చేస్తుంది. చిత్రకారులకు ఒక చక్కని సాధనలా కూడా ఉపకరిస్తుంది. ఇప్పటికే వేలాది చిత్రాలతో ఈ కార్యక్రమం కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. వీటిని 'Brahmam Kaayajna' ఫేస్‌బుక్ పేజీలో వీక్షించవచ్చు.

– శేషబ్రహ్మం, ప్రముఖ చిత్రకారుడు

హైదరాబాద్‌లో చిత్ర ప్రదర్శన

నిబంధనల మేరకు కళాయజ్ఞంలో పాల్గొన్న కళాకారుల నుంచి మంచి కౌశలం చూపిన 21 మందిని ఎంపిక చేయనున్నారు. జాతీయ స్థాయిలో పేరొందిన ప్రముఖ చిత్రకారులు ఐదుగురు న్యాయ నిర్ణేతలుగా ఉంటారు. ఎంపిక చేసిన అద్భుత చిత్రాలతో హైదరాబాద్‌లో 3 రోజులపాటు చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తారు. కళాయజ్ఞంలో పూర్తిస్థాయిలో పాలుపంచుకోలేని ఔత్సాహిక కళాకారులకు గెస్ట్ ఆర్టిస్ట్‌గా కొన్ని చిత్రాలు గీసే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

అడవిలోనే ఆపరేషన్లు

రెండేళ్ల క్రితం వరకు అడవి బిడ్డల ఆరోగ్యం విషమిస్తే పరిస్థితి అగమ్య గోచరమయ్యేది. జ్వరం వచ్చినా మన్యాన్ని వీడి.. ప్రాణాలను అరచేత పట్టుకుని మైదానం వైపు పరుగులు తీయాల్సి వచ్చేది. కనీసం వంద కిలోమీటర్లు ప్రయాణిస్తే గానీ మెరుగైన వైద్యం అందేది కాదు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ఒకప్పుడు జ్వరానికి మాత్రలందించేందుకు సైతం వీల్లేని దుస్థితి నుంచి అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేయగలిగే స్థాయికి గిరిజన ఆస్పత్రులు చేరుకున్నాయి. మైనర్ సర్జరీ అయినా.. మేజర్ సర్జరీ అయినా.. కాన్పు అయినా.. తక్షణ చికిత్స అందించేలా ఆధునిక వైద్య సేవలు అడవి ముంగిట్లోనే అందుబాటులోకి వచ్చాయి. గిరిపుత్రుల చెంతకు మేజర్ శస్త్రచికిత్సలు చేరువకావడంతో అడవిలో ఆరోగ్య వెలుగులు విరబూస్తున్నాయి.

చరిత్రలో తొలిసారి గిరిజన గ్రామాలకు చేరువైన కీలక శస్త్రచికిత్సలు

- పాడేరు ఆస్పత్రిలో 1,522 ఆపరేషన్లు
- ఏజెన్సీ వైద్య రంగంలో రెండేళ్లలో ఎన్నో మార్పులు
- సిజేరియన్లు, ఈఎన్‌టీ, కంటి ఆపరేషన్లన్నీ అక్కడే
- పెరిగిన వైద్య సిబ్బంది.. అందుబాటులో నిరంతర వైద్యం



డీసీపీ ప్లేటింగ్ ఆపరేషన్ చేస్తున్న వైద్య బృందం



జనరల్ సర్జరీ థియేటర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నాటినుంచి ఇప్పటివరకు ఏజెన్సీలోని ఆస్పత్రుల్లో ఆపరేషన్లకు సౌకర్యాలు, డాక్టర్లు లేని పరిస్థితి. రెండేళ్ల క్రితం వరకూ పాడేరు జిల్లా ఆస్పత్రిలో జనరల్ సర్జరీ, ప్రసూతి–గైనకాలజీ, ఈఎన్‌టీకి సంబంధించి 3 సర్జికల్ వైద్యులు మాత్రమే ఉండేవారు. ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ వంటి ఇతర శస్త్రచికిత్స శాఖలు లేవు. సర్జికల్ శాఖలకు ప్రధాన సహాయక శాఖ అయిన అనస్థీషియా విభాగం కూడా లేని దుస్థితి. దుర్భరమైన సదుపాయాలతో ఆపరేషన్ థియేటర్లు పేరుకే ఉండేవి. ఆస్పత్రి ఏర్పాటు చేసినప్పటి నుంచీ కనీసం అప్‌గ్రేడ్ చేసిన దాఖలాలు కనిపించలేదు. శస్త్ర చికిత్స చేసే పరికరాలు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణకు సిబ్బంది కూడా ఉండేవారు కాదు. ఉన్న వనరులతోనే ఒకట్రెండు కుటుంబ నియంత్రణ చికిత్సలు మినహా.. ఏ ఒక్క ఆపరేషన్ సరిగా చేసే పరిస్థితి ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యంపై దృష్టి సారించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీ వైద్య రంగానికి శస్త్ర చికిత్స చేయడం ప్రారంభించారు.

ఆపరేషన్లకు ప్రత్యేక వైద్య విభాగం...

ఒకప్పుడు డెలివరీల కోసం గిరిజన మహిళలు 100 కిలోమీటర్లకుపైగా ప్రయాణించి విశాఖలోని కేజీహెచ్‌కి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు పాడేరు ఆస్పత్రిలో సిజేరియన్లు, కంటి, ఈఎన్‌టీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. అనస్థీషియన్‌ని నియమించారు. ఆర్థోపెడిక్, ఆప్తమాలజిస్ట్, ఈఎన్‌టీ సర్జన్, తదితర సర్జికల్ బ్రాంచ్ వైద్యుల నియామకం కూడా పూర్తి చేశారు. కేవలం శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. ముగ్గురు స్టాఫ్ నర్స్‌లని విశాఖపట్నం ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో శిక్షణ పూర్తి చేయించారు. ఆరుగురు స్టాఫ్ నర్స్‌లకు ఇన్ హౌస్ సర్జన్, గైనకాలజిస్ట్ ద్వారా సర్జికల్ శిక్షణ అందించారు. ఆపరేషన్ థియేటర్‌ను వివిధ సర్జరీలకు కావల్సిన అత్యాధునిక పరికరాలతో ఆధునికీకరించారు.

గిరిజనుల చెంతకే అత్యాధునిక వైద్యం



గిరిజనులకు అత్యాధునిక వైద్య సేవలను మరింతగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. కార్పొరేట్ తరహా వైద్యం అందించేందుకు పాడేరు, అరకు ఆస్పత్రులను ఆపరేషన్ల కోసం సిద్ధం చేశాం. ఇప్పటికే అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాం. ఆపరేషన్ థియేటర్లని వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికీకరించాం. ఎలాంటి ఆపరేషన్ అయినా ఇక్కడే విజయవంతంగా పూర్తవుతుందన్న విశ్వాసం గిరిజనుల్లో ఏర్పడింది. ఆరోగ్య శ్రీ పథకం కింద ఆపరేషన్లు చేసి రూ.38 లక్షల వరకూ క్లెయిమ్ కూడా చేశాం.

– రోణంకి గోపాలకృష్ణ, ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ

రెండేళ్లలో రికార్డు స్థాయిలో 1,522 ఆపరేషన్లు

2021 మార్చి 19లో తొలి మైనర్ సర్జరీతో ఏజెన్సీలో కొత్త చరిత్ర ప్రారంభమైంది. మేజర్ సర్జరీని 2022 జనవరి 8న చేశారు. సాధారణ శస్త్రచికిత్సలు, గైనకాలజీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ.. ఇలా ఎన్నో శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. పాడేరు జిల్లా ఆస్పత్రి చరిత్రలో హెర్నియా ఆపరేషన్లతో పాటు వెరికోస్ వెయిన్స్ ట్రెండెలెన్‌బర్గ్, సాఫ్ట్‌టిష్యూ సర్కోమా, ఇంటెస్టినల్ అబ్‌స్ట్రక్షన్స్, కాంప్లెక్స్ అనల్ ప్రొసీజర్స్, బాకెర్స్ సిస్ట్, ఫ్రాక్చర్ రేడియస్, డీసీపీ ప్లేటింగ్, ఫ్రాక్చర్ టిబియా, తొడ ఎముక ఐసీ ఫ్రాక్చర్(హెమియార్థోప్లాస్టీ), కాంప్లికేటెడ్ ట్యూబెక్టమీస్, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, సెప్టోప్లాస్టీ, టింపానోప్లాస్టీ, టాన్సిలెక్టమీ తదితర మేజర్ శస్త్రచికిత్సలు కూడా చేయడం ఇదే ప్రప్రథమం కావడం గమనార్హం. మొత్తంగా రెండేళ్ల కాలంలో పాడేరు జనరల్ ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో 1,522 ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారు.



నూతన వత్సరానికి స్వాగత సుమాంజలి

తూర్పు గోదావరి జిల్లా కడియం నర్సరీలు ఎప్పటిలానే ఈ ఏడాదీ పూలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నాయి. వివిధ రకాల సందేశాలిస్తూ వేలాది మొక్కలను వినియోగించి ఆకట్టుకునే రీతిలో ఇలా తీర్చిదిద్దారు. పల్ల వెంకన్న నర్సరీలో పూల కూర్పుతో ఇలా స్వాగతం పలికారు.

- కడియం

సుప్రీంకోర్టులో త్వరలో...
ఖాళీల సంక్షోభం!

రిటైరవనున్న 9 మంది న్యాయమూర్తులు

న్యూఢిల్లీ: పెండింగ్ కేసుల భారానికి తోడు న్యాయమూర్తుల కొరత రూపంలో కొత్త సంవత్సరంలో సుప్రీంకోర్టు కొత్త సంక్షోభాన్ని ఎదుర్కొనేలా కన్పిస్తోంది. ఈ ఏడాది 9 మంది న్యాయమూర్తులు రిటైర్ కానున్నారు. జస్టిస్ అబ్దుల్ నజీర్ పదవీకాలం జనవరి 4న, జస్టిస్ ఎంఆర్ షా మేలో, జస్టిస్ కేఎం జోసెఫ్, అజయ్ రస్తోగీ, వి.రామసుబ్రమణియం జూన్‌లో, జస్టిస్ కృష్ణ మురారి జూలైలో, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ అక్టోబర్లో, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ పదవీకాలం డిసెంబర్లో ముగియనుంది. ఇప్పటికే సుప్రీంకోర్టులో ఆరు ఖాళీలున్నాయి. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థపై న్యాయ వ్యవస్థకు, కేంద్ర ప్రభుత్వానికి విభేదాలు ముదురుతున్న నేపథ్యంలో ఈ ఖాళీలన్నింటినీ సకాలంలో భర్తీ చేయడం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు సవాలు కానుంది. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులుండాలి. ప్రస్తుతం 28 మంది ఉన్నారు. కొలీజియం గత భేటీలో ఐదుగురి పేర్లను సిఫార్సు చేసింది. వీటిలో కొన్నింటిని కేంద్ర న్యాయ శాఖ త్వరలో ఆమోదించవచ్చని సమాచారం.


ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద కొత్త ఏడాది సంబరాలు

సంబరంగా న్యూ ఇయర్ వేడుకలు

న్యూఢిల్లీ/మెల్‌బోర్న్: 2022కు గుడ్‌బై చెబుతూ, 2023కు స్వాగతం పలుకుతూ ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కోవిడ్ ఆంక్షల బెడద తొలగిపోవడంతో ఎక్కడ చూసినా జనం పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా వేడుకల్లో మునిగిపోయారు. పసిఫిక్ మహాసముద్రంలోని కిరిబాటి దీవులవాసులు అందరికంటే ముందుగా న్యూ ఇయర్‌కు ఆహ్వానం పలికారు. వారు న్యూజిలాండ్ కంటే గంట ముందే కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ స్కై టవర్ వద్ద అర్ధరాత్రికి 10 సెకన్ల ముందు నుంచి బాణసంచా వెలుగుల్లో ప్రజలు 2023కు స్వాగతం పలుకుతూ కేరింతలు కొట్టారు. చైనాలోని గ్రేట్ వాల్ వద్ద, షాంఘైలోని డిస్నీల్యాండ్‌లో ప్రత్యేకంగా మతాబులు కాల్చారు. ఇక ఆస్ట్రేలియాలోని విఖ్యాత సిడ్నీ హార్బర్ బ్రిడ్జిపై, సమీపంలోని ఒపెరా హౌస్ వద్ద కన్నులు మిరుమిట్లు గొలిపేలా బాణసంచా పేల్చారు.

రాష్ట్రపతి శుభాకాంక్షలు..: దేశ విదేశాల్లోని భారతీయులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్రత, ఐక్యత, సమ్మిళిత అభివృద్ధి కోసం పునరంకితమవుదామని పిలుపునిచ్చారు.


పశ్చిమబెంగాల్‌లోని నదియాలో 2022 చివరి సూర్యాస్తమయానికి వీడ్కోలు

క్లుప్తంగా...

కొత్త ఏడాదిలో చైనాలో రోజుకు...
25 వేల కోవిడ్ మరణాలు

న్యూఢిల్లీ: చైనాలో కొత్త ఏడాదిలో కరోనా అత్యంత తీవ్ర స్థాయికి చేరనుంది. ఈ నెల 13వ తేదీ కల్లా రోజుకు 37 లక్షల కేసులు నమోదవుతాయని, మరో 10 రోజుల తర్వాత రోజుకు 25 వేల కరోనా మరణాలు సంభవిస్తాయని యూకేకు చెందిన అధ్యయన సంస్థ ఎయిర్ ఫినిటీ తెలిపింది. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి చైనాలో కరోనాతో రోజుకు 9 వేల మంది చొప్పున చనిపోతున్నారని తెలిపింది. జనవరి చివరి నాటికి చైనాలో 5,84,00 కోవిడ్ మరణాలు చోటుచేసుకుంటాయని పేర్కొంది. ఏప్రిల్ కల్లా కోవిడ్‌తో మృతుల సంఖ్య 17 లక్షలకు చేరుకుంటుందని తెలిపింది. మార్చి 3వ తేదీ నుంచి మరో విడత విజృంభణతో రోజుకు 42 లక్షల కేసులు నమోదవుతాయని అంచనా వేసింది.

2023లో సమస్యలతో సావాసమే: సునాక్

లండన్: బ్రిటన్‌వాసులకు ప్రధాని రిషి సునాక్ తన న్యూ ఇయర్ సందేశంలో చేదు వార్త విన్పించారు. దేశాన్ని వేధిస్తున్న పెను సమస్యలు 2023లో పూర్తిగా పరిష్కారం కాబోవని స్పష్టం చేశారు. ''నేనలాంటి డొల్ల మాటలు చెప్పబోను. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఆర్థికంగా బ్రిటన్‌తో పాటు ప్రపంచం వెన్ను విరిచింది. రుణ భారాన్ని అదుపులోకి తెచ్చే క్రమంలో కఠినమే అయినా సరైన నిర్ణయాలు తీసుకుంటున్నాం'' అంటూ చెప్పుకొచ్చారు.

గయ డిప్యూటీ మేయర్‌గా పారిశుద్ధ్య కార్మికురాలు

పట్నా: పారిశుద్ధ్య కార్మికురాలిని డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నుకోవడం ద్వారా బిహార్‌లోని గయ మున్సిపాలిటీ ప్రజలు చరిత్ర సృష్టించారు. చింతాదేవి గత 40 ఏళ్లుగా మున్సిపాలిటీలో స్కావెంజర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈమె 16వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. 1996లో కూడా గయ ప్రజలు ముసాహిర్ వర్గానికి చెందిన రాళ్లు కొట్టుకునే భగవతీదేవి అనే సాధారణ మహిళను లోక్‌సభకు పంపారు.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీది ఒంటరిపోరే: షా

బెంగళూరు: కర్ణాటకలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. బీజేపీ బూత్ అధ్యక్షులు, ఏజెంట్లతో శనివారం అమిత్ షా సమావేశమయ్యారు. మూడింట రెండు వంతుల మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జేడీ(ఎస్)కు ఓటేస్తే కాంగ్రెస్‌కు వేసినట్టేనన్నారు.

2022లో 186 మంది ఉగ్రవాదులు హతం

జమ్మూ: 2022లో జమ్మూకశ్మీర్‌లో 56 మంది పాకిస్తానీయులు సహా 186 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు డీజీపీ దిల్బాగ్ సింగ్ చెప్పారు. 159 మంది అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది కశ్మీర్‌కు చెందిన సుమారు 100 మంది యువత ఉగ్రవాదం బాట పట్టారని చెప్పారు. ప్రస్తుతం లోయలో 100 మంది కంటే తక్కువగానే ఉగ్రవాదులున్నారన్నారు.

వాట్సాప్ వీడియోలో తప్పుగా ఇండియా మ్యాప్

న్యూఢిల్లీ: మెసేజింగ్ వేదిక వాట్సాప్ విడుదల చేసిన నూతన సంవత్సర లైవ్‌స్ట్రీమ్ వీడియోలో భారత్ మ్యాప్‌ను తప్పుగా చూపడంపై కేంద్ర ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తీవ్రంగా స్పందించారు. భారత్‌లో వ్యాపారం చేసే లేదా వ్యాపారం కొనసాగించాలనుకునే సామాజిక మాధ్యమాలన్నీ సరైన భారతదేశ మ్యాపులనే ఉపయోగించాలని సూచించారు. వాట్సాప్ వెంటనే సంబంధిత వీడియోను వెంటనే తొలగించి క్షమాపణ కోరింది. ముస్ముందు ఇలాంటి పొరపాట్లు జరక్కుండా చూసుకుంటామని తెలిపింది. వాట్సాప్ మాతృసంస్థ మెటావెర్స్ విడుదల చేసిన నూతన సంవత్సర వేడుకల గ్లోబ్ వీడియోలో భారత్‌కు సంబంధించి జమ్మూకశ్మీర్‌ను తప్పుగా చిత్రీకరించారు.

బెనెడిక్ట్-16 అస్తమయం

- వృద్ధాప్యంతో వాటికన్‌లో తుది శ్వాస విడిచిన మాజీ పోప్
- మోదీ సహా దేశాధినేతలు తదితరుల ప్రగాఢ సంతాపం

వాటికన్ సిటీ: మాజీ పోప్ బెనెడిక్ట్-16 ఇక లేరు. 95 ఏళ్ల వయసున్న ఆయన వృద్ధాప్య సమస్యలతో శనివారం వాటికన్‌లో తుది శ్వాస విడిచారు. ''గౌరవ విశ్రాంత పోప్ ఉదయం 9.34 గంటలకు వాటికన్‌లోని మాటర్ ఎక్లెసియా ఆరామంలో పరమపదించారని చెప్పేందుకు ఆవేదనగా ఉంది'' అంటూ వాటికన్ అధికార ప్రతినిధి మటెయో బ్రూనీ ప్రకటన విడుదల చేశారు. ఆయన భౌతిక కాయాన్ని సోమవారం నుంచి అభిమానులు, విశ్వాసుల సందర్శనార్థం సెయింట్ పీటర్స్ బాసిలికాలో ఉంచుతారు. అనంతరం గురువారం సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో పోప్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరుగుతాయి. మాజీ పోప్‌కు ప్రస్తుత పోప్ అంతిమ సంస్కారాలు జరిపిన అరుదైన సన్నివేశంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. బెనెడిక్ట్ కోరిన విధంగా కార్యక్రమాన్ని నిరాడంబరంగా జరపనున్నట్టు వాటికన్ పేర్కొంది. ఆయన అస్తమయం పట్ల పలువురు దేశాధినేతలు, ఇతర ప్రముఖులు సంతాపం వెలిబుచ్చారు. 'లౌకిక యూరప్‌లో క్రైస్తవాన్ని పునరుజ్జీవింపజేసేందుకు బెనెడిక్ట్-16 ఎంతగానో పాటుపడ్డారు. జీవితమంతటినీ చర్చికి, జీసస్ బోధల వ్యాప్తికే ధార పోశారు. ఆయన చేసిన సమాజ సేవ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుంది' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.



పదవిని పరిత్యజించి...

బెనెడిక్ట్-16 2005లో పోప్‌గా బాధ్యతలు స్వీకరించారు. గత వెయ్యేళ్లలో ఆ పదవి చేపట్టిన తొలి జర్మన్‌గా చరిత్ర సృష్టించారు. 2013 ఫిబ్రవరి 11న ఉన్నట్టుండి పదవి నుంచి వైదొలిగి నివ్వెరపరిచారు. ''120 కోట్ల మంది విశ్వాసులైన రోమన్ క్యాథలిక్కులను ముందుకు తీసుకెళ్లే మనోబలం నాలో సన్నగిల్లింది. వయో భారం వల్ల ఇక ఈ బాధ్యతలను కొనసాగించలేను'' అంటూ ఆయన చెప్పిన కారణం అందరి మనసులూ గెలుచుకుంది. ఒక పోప్ పదవిని త్యజించడం గత 600 ఏళ్లలో ఇదే తొలిసారి. అప్పటినుంచీ వాటికన్ గార్డెన్స్‌లో పోప్ నివాసం పక్కనే నివసిస్తున్నారు.

సంచలనాలకు నెలవు...!

జోసెఫ్ అలోసియస్ రాట్జింగర్. ఇలా చెబితే ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. కానీ పోప్ బెనెడిక్ట్-16 అనగానే పసిపాపలను పోలిన స్వచ్ఛమైన పసిడి నవ్వులు చిందించే ఒక పవిత్ర మూర్తి కళ్లముందు కదలాడతారు. రోమన్ క్యాథలిక్కులకు పరమ పవిత్రమైన అత్యున్నత పోప్ పదవిని స్వీకరించేందుకు ససేమిరా అన్నా, తీరా బాధ్యతలు స్వీకరించాక అవి మెడకు ఉచ్చులా తోస్తున్నాయని వ్యాఖ్యలు చేసినా, కోట్లాది మందిలో భగవంతుని పట్ల సిసలైన భక్తి భావనలను ఉద్దీపింపజేసేందుకు అహరహం పాటుపడి తన వారసులకు ఆదర్శంగా నిలిచినా, చివరికి సంచలనాత్మక రీతిలో బాధ్యతల నుంచి వైదొలగినా... అడుగడుగునా అంతరాత్మ ప్రబోధానుసారమే నడుచుకున్న ఆసక్తికరమైన జీవితం ఆయనది.

సంప్రదాయవాది

బెనెడిక్ట్-16 1927 ఏప్రిల్ 16న జర్మనీలోని బవేరియాలో జన్మించారు. ఏళ్ల తరబడి తత్వశాస్త్రం బోధించారు. 1977లో మ్యూనిక్ బిషప్, మూణ్నెల్లకు కార్డినల్ అయ్యారు. 78 ఏళ్ల వయసులో శేష జీవితాన్ని బవేరియాలో తనకిష్టమైన రచనలు చేస్తూ గడపాలని ఆకాంక్షించగా విధి మరోలా తలచింది. ఫాదర్ల లైంగిక వేధింపుల వివాదం తదితరాలతో క్యాథలిక్ చర్చి సతమతమవుతున్న వేళ పోప్ బాధ్యతలను స్వీకరించాల్సి వచ్చింది. వాటన్నింటినీ మొక్కవోని స్థైర్యంతో



పరిష్కరించారు. సంప్రదాయవాదిగా పేరుబడ్డ ఆయన యూదులకు స్నేహ హస్తం చాచడమే గాక వారి ప్రార్థనా మందిరమైన సినగాగ్‌ను సందర్శించిన రెండో పోప్‌గా చరిత్ర సృష్టించారు. జీసస్ మృతికి యూదులు కారణమన్న వాదన ఆధార రహితమంటూ జీజెస్ ఆఫ్ నజరేత్ పేరుతో 2011లో పుస్తకం రాశారు! ముస్లింలపై బెనెడిక్ట్-16 చేసిన వ్యాఖ్యలు వివాదానికీ కారణమయ్యాయి. ''ఎయిడ్స్ వ్యాప్తిని కేవలం కండోముల పంపిణీ ద్వారా అడ్డుకోలేం. సరికదా, వాటివల్ల సమస్య మరింత పెరుగుతుంది'' అంటూ వ్యాఖ్యానించారు. పదవిని త్యజించినప్పటి నుంచీ ఒంటరి జీవితం గడుపుతున్నారు.

బాత్రూముల్లో కంపు

- ట్విట్టర్ సిబ్బంది గగ్గోలు
- టాయ్‌లెట్ పేపర్‌కూ కరువే
- చుక్కలు చూపుతున్న మస్క్



వాషింగ్టన్: ట్విట్టర్‌ను కొనుగోలు చేసినప్పటి నుంచీ సిబ్బందికి చుక్కలు చూపుతున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నిర్వాకాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి. ఓవైపు పొదుపు చర్యలకు దిగుతుంటే పారిశుధ్య సిబ్బంది వేతన పెంపుకు డిమాండ్ చేయడంతో చిర్రెత్తుకొచ్చి వారందరినీ పీకిపడేశారు. దాంతో సరైన నిర్వహణ లేక బాత్రూములన్నీ భరించలేనంత కంపు కొడుతున్నాయని సిబ్బంది మొత్తుకుంటున్నారు. చివరికి వాటిలో టాయ్‌లెట్ పేపర్లకు కూడా దిక్కు లేదట! వాటిని ఇంటి నుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నట్టు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. పలు నగరాల్లోని ట్విట్టర్ కార్యాలయాల్లో సెక్యూరిటీ సిబ్బంది కూడా కరువయ్యారట! నిర్వహణ భారం తగ్గించుకునేందుకు ఉద్యోగులందరినీ రెండంతస్తుల్లోనే కుక్కి నాలుగింటిని ఖాళీ చేశారట. సియాటిల్, శాన్‌ఫ్రాన్సిస్కో కార్యాలయ భవనాలకు అద్దె చెల్లించడం కూడా ఆపేశారు. సిబ్బందిని వీలైనంత వరకూ వర్క్ ఫ్రం హోం చేయాలని చెబుతున్నారు. ట్విట్టర్ సిబ్బందిలో సగం మందిని తీసేయడం తెలిసిందే. టెస్లా, స్పేస్ ఎక్స్ తదితర సొంత కంపెనీల నుంచి సిబ్బందిని ట్విట్టర్‌కు మస్క్ తరలిస్తున్నారట!

బీజేపీపై తీవ్ర వ్యతిరేకత

ఏం చేయకూడదో ఆ పార్టీని చూసే తెలుసుకుంటున్నా: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: బీజేపీపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత ఉందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రతిపక్షాలన్నీ ఒకే లక్ష్యంతో ఏకతాటిపై నిలబడితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలవడం బీజేపీకి చాలా కష్టమవుతుందని జోస్యం చెప్పారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని జోడో యాత్రలో తెలుసుకున్నానన్నారు. ''గతంలోలా వ్యూహాత్మక రాజకీయ పోరాటం ద్వారా, కొన్ని పార్టీలు కలిసి బీజేపీని ఓడించడం అసాధ్యం. దేశమంతా ఒకే భావజాలం చేతుల్లో ఉంది. అదే దేశ రాజకీయాలపై పూర్తి ఆధిపత్యం చెలాయిస్తోంది. దాన్ని ఓడించేందుకు మరో భావజాలం కావాలి. ప్రజలకు ప్రత్యామ్నాయ జాతీయ విధానాన్ని చూపాలి. కాంగ్రెస్‌కు మినహా మిగతా ప్రాంతీయ పార్టీలకు అలాంటి విధానమేదీ లేదు'' అన్నారు.

బీజేపీయే గురువు!

ఎప్పటికప్పుడు ఏం చేయకూడదో చెప్పే బీజేపీని గురువుగా భావిస్తానని రాహుల్ అన్నారు. కాంగ్రెస్‌పై బీజేపీ ఎంతగా దాడి చేస్తే దాని భావజాలాన్ని అంతగా అర్థం చేసుకుని ఎదురొడ్డి నిలుస్తుందన్నారు. ''ప్రజలందరినీ ఏకం చేసేలా భారత్ జోడో యాత్రకు కాంగ్రెస్ రూపకల్పన చేసింది. విపక్షాలు రాజకీయ తదితర కారణాలతో యాత్రలో పాల్గొనకున్నా అవన్నీ యాత్రకు తోడుగా ఉన్నాయి. దూరంగా ఉండిపోతున్నట్లు వివరించారు. యాత్రలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరికీ తలుపులు తెరిచి ఉంటాయన్నారు.

కేంద్రం ఆరోపణలపై ధ్వజం

ఢిల్లీలో జోడో యాత్ర సమయంలో సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌ను ఉల్లంఘించారన్న కేంద్రం ఆరోపణలను రాహుల్ తోసిపుచ్చారు. ''ఇది ప్రజలతో మమేకమవుతూ చేసే పాదయాత్ర. బుల్లెట్ ప్రూఫ్ కార్లలో చేయడం అసాధ్యం. బీజేపీ నేతలు బుల్లెట్ ప్రూఫ్ కార్లలో తిరుగుతూ నిబంధనలను ఉల్లంఘిస్తున్నా చర్యలే లేవు. ప్రొటోకాల్స్ ఒక్కో పార్టీకి ఒక్కోలా ఉంటున్నాయి'' అని ధ్వజమెత్తారు.

భారత్‌లోకి సూపర్ వేరియెంట్

గుజరాత్‌లో తొలి ఎక్స్‌బీబీ.1.5 కేసు
- ఆందోళన వద్దంటున్న వైరాలజిస్టులు


న్యూఢిల్లీ: చైనాలో కరోనా కేసులతో దడ పుట్టిస్తున్న బీఎఫ్.7 కంటే ప్రమాదకరమైన వేరియెంట్ భారత్‌లోకి ప్రవేశించింది. అమెరికాలో కొత్తగా పుట్టుకొచ్చి అత్యంత వేగంగా వ్యాపిస్తున్న ఎక్స్‌బీబీ.1.5 సబ్ వేరియెంట్ తొలికేసు గుజరాత్‌లో బయటపడింది! దీన్ని కేంద్ర ఆరోగ్య శాఖలోని జెనోమ్ సీక్వెన్సింగ్ సంస్థ ఇన్సాకాగ్ ధ్రువీకరించింది.

అమెరికాలో 40 శాతానికి పైగా కేసులివే

అమెరికాలో గత అక్టోబర్‌లో న్యూయార్క్‌లో ఈ వేరియెంట్ బయటపడింది. అప్పట్నుంచి కరోనాతో ఆస్పత్రిలో చేరేవారి సంఖ్య పెరిగిపోతూనే ఉంది. అమెరికాలో నమోదవుతున్న కరోనా కేసుల్లో 40% పైగా ఈ వేరియెంట్‌వే. అత్యంత తీవ్రంగా వ్యాప్తి చెందే లక్షణాలున్న ఎక్స్‌బీబీ.1.5ని సూపర్ వేరియెంట్ అని పిలుస్తున్నారు. ''ప్రపంచంలో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన కరోనా వేరియెంట్లలో ఇది అత్యంత ప్రమాదకరమైనది. ఇప్పుడు పలు దేశాలకు విస్తరిస్తోంది'' అని మిన్నెసోటా వర్సిటీ అంటువ్యాధి నిపుణుడు మైఖేల్ హెచ్చరించారు. సింగపూర్‌లోనూ ఈ కేసులు బాగా ఉన్నాయి.

ఏమిటీ ఎక్స్‌బీబీ.1.5?

ఒమిక్రాన్‌లో బీఏ.2 నుంచి ఈ ఎక్స్‌బీబీ.1.5 సబ్ వేరియెంట్ పుట్టుకొచ్చింది. బీక్యూ, ఎక్స్‌బీబీ వేరియెంట్ల కాంబినేషన్ జన్యు మార్పులకు లోనై ఎక్స్‌బీబీ.1.5 వచ్చింది. ఎక్స్‌బీబీ కంటే 96% వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటివరకు వచ్చిన కరోనా వేరియెంట్లలో దీని విస్తరణ అత్యధికంగా ఉంది. డెల్టా తరహాలో ఇది ప్రాణాంతకం కాకపోయినా ఆస్పత్రిలో చేరాల్సిన కేసులు బాగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ వేరియెంట్‌తో అమెరికాలో వారంలో కేసులు రెట్టింపయ్యాయని అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వెల్లడించింది. అమెరికా అంటు వ్యాధి నిపుణుడు ఎరిక్ ఫీగెల్ డింగ్ తన ట్విటర్‌లో ఈ వేరియెంట్ గురించి వెల్లడిస్తూ ఆర్ వాల్యూ అత్యధికంగా ఉన్న వేరియెంట్ ఇదేనని తెలిపారు. ఎక్స్ఎక్స్‌బీ కంటే 120% అధికంగా ఈ వేరియెంట్ సోకుతోందని తెలిపారు. కరోనా సోకి సహజ ఇమ్యూనిటీ, టీకాల ద్వారా వచ్చే ఇమ్యూనిటీని కూడా ఎదుర్కొని మనుషుల శరీరంలో ఈ వైరస్ స్థిరంగా ఉంటోందని వివరించారు.



లక్షణాలివే..!

ఎస్‌బీబీ.1.5 సోకితే సాధారణంగా కరోనాకుండే లక్షణాలే ఉంటాయి. జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, జ్వరం, తలనొప్పి, పొడిదగ్గు, తుమ్ములు, గొంతు బొంగురుపోవడం, ఒళ్లు నొప్పులు, వాసన కోల్పోవడం వంటివి బయటపడతాయి.

మనకు ముప్పు ఎంత?

ఎక్స్‌బీబీ.1.5తో మనం అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైరాలజిస్ట్ గగన్‌దీప్ కాంగ్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో ఒమిక్రాన్ వేరియెంట్ ప్రబలినప్పుడు దేశ జనాభాలో దాదాపుగా 90శాతం మందికి కరోనా సోకి హెర్డ్ ఇమ్యూనిటీ వచ్చిందని దాని వల్ల రక్షణ ఉంటుందని ఆమె అంచనా వేస్తున్నారు. అయితే దేశ జనాభాలో బూస్టర్ డోసు 27% మంది మాత్రమే తీసుకున్నారని, ప్రజలందరూ మరింత ఇమ్యూనిటీ కోసం టీకా తీసుకుంటే మంచిదని సూచించారు. కోవిడ్ కేసులు పెరిగే విధానాన్ని లెక్కించే ఐఐటీ సూత్ర కోవిడ్ మోడల్‌లో భాగస్వామిగా ఉన్న ఐఐటీ కాన్పూర్ ప్రొఫెసర్ మణీంద్ర అగర్వాల్ అమెరికాలో మాదిరిగా మన దేశంలో కేసులు నమోదయ్యే అవకాశాల్లేవని వివరించారు. మరోవైపు దేశంలో 24 గంటల్లో 226 కేసులు నమోదు కాగా, యాక్టివ్ కేసుల సంఖ్య 3,653కి చేరుకుంది.

ఎన్నికల ఏడాది

కోటి ఆశలతో కొత్త ఆకాంక్షలతో సరికొత్త ఏడాదిలోకి అడుగు పెట్టాం.
ఈ ఏడాది ఎలా ఉంటుంది ? గతేడాదితో పోలిస్తే ఏం మార్పులొస్తాయి?
సామాన్యుల దగ్గర్నుంచి రాజకీయ నాయకుల వరకు
ప్రతి ఒక్కరి మదిలో ఇవే ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.
వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ పీఠాన్ని కొల్లగొట్టాలంటే
మోదీ చరిష్మా, రాహుల్ గాంధీ పాదయాత్ర, కేజ్రివాల్ క్రేజ్ కీలకంగా మారాయి...

త్రిపుర నుంచి తెలంగాణ దాకా...
- తొమ్మిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు
- 116 లోక్‌సభ స్థానాల పరిధిలో
- పార్టీలకు అగ్నిపరీక్షగా సెమీ ఫైనల్స్

ఇది ఎన్నికల ఏడాది. ఈ ఏడాది మొత్తం తొమ్మిది రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఫైనల్ అనుకుంటే ఇవి సెమీఫైనల్స్‌గా భావించవచ్చు. 2022లో ఏడు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగితే బీజేపీ అత్యంత కీలకమైన యూపీ, గుజరాత్‌తో పాటు ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో తిరుగులేని విజయం సాధించి ఆధిక్యం ప్రదర్శించింది. కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్‌తో సరిపెట్టుకుంటే, అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీ పార్టీ పంజాబ్‌లో ఘన విజయం సాధించడంతో పాటు గోవా (2 స్థానాలు), గుజరాత్ (5 సీట్లు)లో ఖాతా ప్రారంభించి జాతీయ స్థాయిలో ఒక కొత్త శక్తిగా ఎదిగింది. దీంతో రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ ఆధిక్యం ప్రదర్శిస్తుంది ? వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి రాజకీయాలు ఎలా మారుతాయన్న చర్చ వేడెక్కిస్తోంది. త్రిపుర నుంచి తెలంగాణ వరకు మొత్తం తొమ్మిది రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలు 116 లోక్‌సభ స్థానాల పరిధిలో జరుగుతూ ఉండడంతో అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ సారి త్రిపుర, మేఘాలయాలో తృణమూల్ కాంగ్రెస్ పోటీకి దిగుతూ ఉండడంతో మమతా బెనర్జీ కూడా జాతీయ స్థాయిలో చక్రం తిప్పడానికి సిద్ధమవుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, పెరిగిపోతున్న ధరలు, సైద్ధాంతికపరమైన విభేదాలు, మత పరమైన విభజనలు,, సామాజిక అస్థిరతలు, రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఎన్నికల్ని ఎలాంటి మలుపు తిప్పుతాయో చెప్పలేని పరిస్థితులున్నాయి.

బీజేపీ వ్యూహాలు ఇలా..!

కేంద్రంలో అధికార బీజేపీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకున్న వ్యక్తిగత చరిష్మానే నమ్ముకుంది. వివిధ రాష్ట్రాల్లో స్థానిక అంశాలే కీలకంగా మారినప్పటికీ కమలనాథులు మరోసారి మోదీ మ్యాజిక్‌నే పరీక్షకు నిలబెడుతున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే కేంద్రం ప్రతీ నిర్ణయం తీసుకోనుంది. అన్నింటికి మించి ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్రబడ్జెట్ ఈ ఎలక్షన్ ఏడాదిలో సలక్షణంగా ఉండే అవకాశాలే ఉన్నాయి. విదేశీ వ్యవహారాలను సమర్థంగా నడిపిస్తున్న మోదీ సర్కార్ వచ్చే సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరిగే జీ-20 సదస్సు ద్వారా భారత్ ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టామన్న నినాదంతో వచ్చే ఎన్నికల్ని ఎదుర్కోవచ్చంటున్నారు. సదస్సుకు ముందే జమ్ము కశ్మీర్‌లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని మోదీ, అమిత్ షా ద్వయం భావిస్తోంది. డిసెంబర్ నాటికి అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని పూర్తి చేస్తే మత పరంగా ఓట్లను ఏకీకృతం చేసే వ్యూహం ఫలించి ఢిల్లీ పీఠం మరోసారి తమకే దక్కుతుందన్న ఆత్మ విశ్వాసం అధికార పార్టీలో కనిపిస్తోంది.

ప్రతిపక్షాల ఐక్యత సాధ్యమా?

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆధ్వర్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి 2022 తీపి జ్ఞాపకాలనే అందించి వెళ్లింది. జాతీయ పార్టీగా కొత్త హోదా రావడంతో ప్రధాని మోదీ చరిష్మాకు దీటుగా నిలబడే వ్యక్తిగా కేజ్రీవాల్ నిలబడతారని ఆ పార్టీలో కొత్త ఆశలు చిగురించాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 2025లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు తేజస్వి యాదవ్ ఆధ్వర్యంలో జరుగుతాయని ప్రకటించడం ద్వారా తాను పూర్తిగా రేసు నుంచి తప్పుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం కేసీఆర్ మరిన్ని రాష్ట్రాలకు తమ పార్టీలని విస్తరించి జాతీయ స్థాయిలో పట్టు బిగించాలని చూస్తున్నారు. ప్రాంతీయ పార్టీల నాయకులందరూ ఢిల్లీ పీఠంపైనే గురి పెట్టడంతో అధికార బీజేపీని ఎదుర్కోవడానికి వీరంతా కలసికట్టుగా ఉండే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో కాంగ్రెస్‌ని కలుపుకుంటూ పోతూ విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వస్తేనే ప్రధాని మోదీని ఎదుర్కొని నిలబడగలరు. ప్రతిపక్షాలు చేతులు కలిపి బీజేపీకి సవాల్ విసురుతారో లేదో ఈ ఏడాదిలోనే తేలిపోనుంది.



కాంగ్రెస్‌కి పూర్వ వైభవం వస్తుందా ?

కాంగ్రెస్ పార్టీకి కొత్త జవసత్వాలు కల్పించే రెండు ఘటనలు 2022లో జరిగాయి. గాంధీ కుటుంబానికి చెందని వ్యక్తి మల్లిఖార్జున్ ఖర్గేకి పార్టీ అధ్యక్ష పగ్గాలు అప్పగించడం ద్వారా ఒక కొత్త చరిత్ర నెలకొల్పితే, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర మరో చరిత్రగా మారుతోంది. రాహుల్ పాదయాత్రకి వస్తున్న ప్రజాదరణని చూస్తుంటే తనపైనున్న పప్పు ముద్రను తొలగించుకొని రాహుల్ సరికొత్త రాజకీయ నాయకుడిగా ఎదిగే రోజు ఎంతో దూరం లేదనే అనిపిస్తోంది. పార్లమెంటు వేదికగా బీజేపీని ఇరుకున పెట్టేలా మాటల తూటాలు విసురుతూ, వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంతర్గత పోరుల్ని చక్కదిద్దుతూ మల్లికార్జున ఖర్గే తన కొత్త బాధ్యతల్ని సమర్థంగా నిర్వహిస్తూ ఉండడం కాంగ్రెస్‌కి కలిసొచ్చే అంశం. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాటిని నిలబెట్టుకుంటూనే, తమకు అనుకూలంగా ఉన్న కర్ణాటక, మధ్యప్రదేశ్‌లో విజయం సాధిస్తే లోక్‌సభ ఎన్నికల నాటికి ప్రధాని మోదీని ఎదుర్కొనే నాయకుడిగా రాహుల్ అవతరిస్తారని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

2023 కేలండర్
- **ఫిబ్రవరి–మార్చి:** త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు
- **మే:** కర్ణాటకలో శాసనసభ ఎన్నికలు
- **జూలై– ఆగస్టు:** 10 స్థానాలకు రాజ్యసభ ఎన్నికలు, పశ్చిమ బెంగాల్ నుంచి అత్యధిక సీట్లు
- **నవంబర్–డిసెంబర్:** హిందీ బెల్ట్ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం తో పాటుగా తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 1 । జనవరి । 2023



బై బై 2022

పాత ఏడాదిలో చిట్టచివరి సూర్యాస్తమయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు. శనివారం సాయంత్రం మడికెరిలో రాజా సీట్ వద్ద దృశ్యమిది

న్యూస్‌రీల్

ఈ సర్కారే ఏటీఎం: కుమార

శివాజీనగర: జేడీఎస్ గెలిస్తే కర్ణాటక ఒక కుటుంబానికి ఏటీఎం అవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండ్యలో చేసిన ఆరోపణలపై జేడీఎస్ నేత హెచ్.డీ.కుమార స్వామి మండిపడ్డారు. బీజేపీ బూటకపు పార్టీ, తప్పుడుకోరుల సంత అనేందుకు ఈ మాటలే సాక్ష్యమని ఆయన ట్విట్టర్లో ఆరోపించారు. నియంత హిట్లర్‌లా అమిత్ షా ప్రవర్తిస్తున్నాడని, అబద్ధపు మాటలు చెప్పి ప్రచారం చేసుకోవాల్సిన పరిస్థితి వారికెందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం బీజేపీకి ఏటీఎం అని విమర్శించారు.

సీఎం పదవి అమ్మకానికి లేదు

శివాజీనగర: తమ పార్టీలో ముఖ్యమంత్రి పదవి, మరే ఇతర పదవులు అమ్మకానికి లేదని మాజీ సీఎం సిద్దరామయ్యపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. హోం మంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి పదవి కోసం రూ. 2 వేల కోట్లు అమ్మకానికి పెట్టి రాజకీయ వ్యాపారి అయ్యారని సీఎల్‌పీ నేత సిద్దు వ్యాఖ్యలపై బీజేపీ ట్విటర్‌లో ధ్వజమెత్తింది. అబద్ధాలను ఎన్నిసార్లు చెప్పిన నిజాలు కావని చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.35 వేల కోట్లకు లెక్కలే లేవన్నది కాగ్ నివేదికలో తేలిందని, సిద్దరామయ్య నేటికి సమాధానం చెప్పలేదని విమర్శించింది.

ఖర్గే, గోపాలగౌడకు పురస్కారం ప్రదానం

శివాజీనగర: ప్రజాస్వామ్యాన్ని కాపాడే విషయంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. శనివారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ అవార్డును ఖర్గేతో పాటు విశ్రాంత న్యాయమూర్తి గోపాలగౌడకు అందజేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ...నేడు మీడియా రంగం విస్తృతి భారీగా పెరిగిందని, మీడియా బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. మంత్రులు ఎస్టీ సోమశేఖర్, మురుగేశ్ నిరాణీలకు ప్రత్యేక పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్ అధ్యక్షుడు గోవిందరాజు, యూ.బీ.వెంకటేశ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మల్లప్ప, ఉపాధ్యక్షుడు ఆనంద బైదనమనె, కార్యవర్గ సభ్యులు మోహన్, దొడ్డబొమ్మై, సోమణ్ణ, మునిరామేగౌడ పాల్గొన్నారు.

నెలలోగా కళసా డీపీఆర్ పనులు

శివాజీనగర: కళసా బండూరి నీటి ప్రాజెక్టుపై మరో నెలలోగా సమగ్ర పథక నివేదిక (డీపీఆర్) పనులను ఆరంభించనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి గోవింద కారజోళ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కళసా బండూరి పథకానికి కేంద్ర జలవనరుల కమిషన్ ఇచ్చిన అనుమతి పత్రంలో తేదీ లేదని హెచ్.కే.పాటిల్ చెప్పడం సరికాదన్నారు. మరో నెలలోగా డీపీఆర్‌కు అనుమతి పొంది భూమి పూజ చేసినపుడు హెచ్.కే.పాటిల్‌కు ప్రత్యేక ఆహ్వానం ఇస్తామని, అప్పుడు ఆయన మాట్లాడాలని సవాల్ చేశారు. ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి పొంది టెండర్ పిలుస్తాం, పనులను ప్రారంభిస్తామని అన్నారు.

రూ. కోటి మద్యం స్వాధీనం

యశవంతపుర: అక్రమంగా తరలిస్తున్న రూ. కోటి విలువైన మద్యాన్ని శుక్రవారం అధికారులు కార్వారలో స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా తరలిస్తున్న నాలుగు వందల బాక్స్‌ల లిక్కర్‌ని సీజ్ చేశారు. కొత్త ఏడాది రోజున అధిక ధరలకు అమ్మడానికి వీటిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో బాటిల్ విలువ రూ. 2500 ఉంది. దాదాపు 4800 బాటిళ్లను పట్టుకున్నారు. దీని విలువ ఏకంగా రూ. కోటి 19 లక్షలుగా అధికారులు తెలిపారు. లారీని కూడా స్వాధీనం చేసుకున్నారు.

కొత్త ఏడాది సంతోషం

- చోరీ కేసుల్లో సొంతదార్లకు సొత్తు



మైసూరు: మైసూరు నగరంలో ఉన్న వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 320 చోరీల కేసుల్లో దొంగలను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, విలువైన వస్తుసామగ్రిని యజమానులకు అప్పగించారు. రూ. 3.55 కోట్ల సొత్తును పోలీస్ కమిషనర్ రమేష్ బానోతు సొంతదారులకు అందజేశారు. మైసూరు నగరంలో 2022లో మొత్తం 753 చోరీ కేసులు నమోదు కాగా ఇందులో 320 కేసులను ఛేదించారు. 346 మంది నిందితులను అరెస్టు చేశారు. రూ. 6.34 కోట్ల విలువైన బంగారు నగలు, విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ. 3.55 కోట్ల సొత్తు సొంతదారులను గుర్తించి అందజేయడంతో కొత్త ఏడాది కానుక అని సంతోషభరితులయ్యారు. ఇందులో 4.6 కేజీల బంగారు ఆభరణాలు, 17 కిలోల వెండి సామగ్రి, 106 మొబైల్ ఫోన్లు, 181 బైకులు, 10 కార్లు ఉన్నాయి.



శనివారం అర్ధరాత్రి బెంగళూరు బ్రిగేడ్ రోడ్డులో సంబరాలకు తరలివచ్చిన నగరవాసులు



ఎంజీ-బ్రిగేడ్ రోడ్డులో ఎటుచూసినా యువత సందడి

ఆశల పందిరి 2023

- కొత్త ఏడాదికి సుస్వాగతం
- బెంగళూరులో యువత సందడి

బనశంకరి: 2022 సంవత్సరానికి తీపి, చేదు జ్ఞాపకాలతో టాటా చెబుతూ కోటి ఆశలతో 2023 సంవత్సరానికి రాష్ట్రమంతటా ఘన స్వాగతం పలికారు. ఐటీ సిటీలో యువతీ యువకులు పెద్దఎత్తున సంబరాల్లో మునిగితేలారు. వేడుకలకు వేదికలైన ఎంజీ.రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, రిచ్మండ్ రోడ్డు, ఇందిరానగర, కోరమంగల తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి సందడికి శ్రీకారం చుట్టారు. బార్లు, పబ్‌లు, రెస్టారెంట్లు, హోటళ్ల సందర్శకులతో సందడిగా మారాయి. పంచతార హోటళ్ల పార్టీలతో, సంగీత కార్యక్రమాలతో హోరెత్తాయి. యువత నృత్యాలు చేస్తూ మజాగా గడిపారు. ఇక యువత, ఔత్సాహికులు ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్‌లతో గుంపులుగా చేరి కేరింతలు కొడుతూ చిందులు వేశారు. యువతీ యువకులు బైక్‌లు, కార్లలో రౌండ్లు కొడుతూ సందడి చేశారు. ఎంజీ రోడ్డు, ట్రినిటీ మెట్రో స్టేషన్ల వద్ద రద్దీ కనిపించింది. ప్రభుత్వం అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే బహిరంగ వేడుకలకు అనుమతి ఇచ్చింది. కార్వార, మంగళూరు తీర నగరాల్లో విందు వినోదాలు మిన్నంటాయి.

ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం

- ఇది దక్షిణాదికి ముఖద్వారం
- బెంగళూరు సభలో బీజేపీ అగ్రనేత అమిత్ షా వెల్లడి
- కాంగ్రెస్, జేడీఎస్ ఒక నాణేనికి రెండు ముఖాలని ధ్వజం



మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనశంకరి: కాంగ్రెస్– జేడీఎస్ ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలు. ఎవరికి మెజారిటీ రాకపోయినప్పటికి హెచ్‌డీ కుమారస్వామి సీఎంగా కూర్చుంటారు. బీజేపీకి ఒకసారి పూర్తి మెజారిటీని అందించి కుటుంబ రాజకీయాలు, అవినీతి, మతవాదాన్ని తుడిచిపెట్టాలని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా అన్నారు. శనివారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మహానగర బూత్‌స్థాయి బీజేపీ కార్యకర్తల విజయసంకల్ప సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించి మాట్లాడారు. జేడీఎస్, కాంగ్రెస్‌లు ఎన్నికలు దగ్గరకు రాగానే ఒక్కటై కూర్చుంటారు, వారి పాలనను ప్రజలు చూశారు. యడియూరప్ప, బసవరాజబొమ్మై విజయవంతంగా పాలన అందిస్తున్నారు. దక్షిణాదిలో బీజేపీని బలోపేతం చేయాలి. దక్షిణ భారతదేశానికి కర్ణాటక ముఖద్వారం లాంటిది. కర్ణాటక ద్వారా దక్షిణ భారత దేశంలోని బీజేపీ ప్రవేశిస్తుంది అని పేర్కొన్నారు.

తుకెడే గ్యాంగ్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

మండ్యలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ర్యాలీ అద్భుతంగా జరిగిందని అన్నారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీకి సంపూర్ణ ఆధిక్యం లభించింది. గుజరాత్‌లో నరేంద్రమోదీ రికార్డు సృష్టించారు, కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు అని అమిత్‌షా అన్నారు. బీజేపీ ఎవరితోనూ పొత్తుపెట్టుకోదంటూ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, సిద్దరామయ్య పేర్లు ప్రస్తావిస్తూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తుకెడే గ్యాంగ్ తో ఒప్పందం కుదుర్చుకుందని, జేడీయస్ ఎన్నికలు వచ్చినప్పుడు పొత్తు గురించి మాట్లాడుతుందని, కానీ బీజేపీ ఒంటరిగా అధికారంలోకి వస్తుందని, ఎవరితోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. మోదీ అయోధ్యలో రామమందిరం నిర్మిస్తున్నారని, కానీ ఇక్కడ కాంగ్రెస్‌వారు టిప్పు సుల్తాన్ ను హీరో చేస్తారని ఎద్దేవా చేశారు. మోదీ పాలనతో దేశం భద్రంగా ఉంది, కానీ సిద్దరామయ్య, కుమారస్వామి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లు పీఎఫ్ఐ వంటి సంస్థల నుంచి దేశాన్ని సురక్షితంగా ఉంచుతారనే నమ్మకం ఉందా? వీరు ఓటు బ్యాంక్‌కు భయపడుతున్నారు, కానీ బీజేపీకి ఓటుబ్యాంక్ భయం లేదని, దేశభద్రతే తమ లక్ష్యమని చెప్పారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ఈ సారి బెంగళూరు నగరంలో 20 కి పైగా సీట్లు గెలుపొందాలని పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఎం బసవరాజ బొమ్మై, యడియూరప్ప, నళిన్‌కుమార్ కటీల్, పెద్దసంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

ఏకాదశి భక్తులకు లడ్డూలు



బొమ్మనహళ్లి: వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 1 లక్ష లడ్డూలను సిద్ధం చేసినట్లు శరవణ ట్రస్టు అధ్యక్షుడు, జేడీఎస్ ఎమ్మెల్సీ టి.ఎ. శరవణ తెలిపారు. నగరంలోని శ్రీసాయి ఫంక్షన్ హాల్లో లడ్డూలను పరిశీలించారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు భారీగా పదోన్నతులు

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఏడాదికి ముందు పరిపాలనలో భారీగా మార్పులు చేసింది. శనివారం 42 మంది ఐఏఎస్, 27 మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ కొందరిని బదిలీలు చేసింది. సామాన్యంగా న్యూ ఇయర్ సమయంలో అధికారులకు పదోన్నతి లభిస్తుంది. ఈసారి భారీ సంఖ్యలో ఉండడం గమనార్హం. ఐఏఎస్‌లు తుషార్ గిరినాథ్, ఎస్ఆర్.ఉమాశంకర్, రిత్విక్ రాజనం పాండే, పీ మణివణ్ణన్, నవీన్‌రాజ్, మానీశ్ మౌద్గిల్, త్రిలోక్‌చంద్ర, మోహన్‌రాజ్, రిచర్డ్ విన్సెంట్ డిసౌజా తదితరులను బదిలీచేసింది. అలాగే నగరపోలీస్‌కమిషనర్‌గా ఉన్న సీహెచ్.ప్రతాప్‌రెడ్డికి అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించింది. ఐపీఎస్‌లు పంకజ్‌కుమార్ ఠాకూర్, సౌమెందు ముఖర్జీ, ఎం. చంద్రశేఖర్, ఎస్.సతీశ్ కుమార్ తదితరులకు పదోన్నతులు దక్కాయి.



మకరం... భయం భయం

చెరువులో గజం దూరంలో పెద్ద మొసలిని చూడగానే పర్యాటకులు అమ్మో అనుకున్నారు. శనివారం రంగనతిట్టు పక్షిధామంలో బోటులో పర్యాటకులు షికారు చేస్తుండగా మొసలి నీటిలో నుంచి బయటకు వచ్చింది

బాలికపై లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

మైసూరు: మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల కఠిన జైలుశిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తూ చామరాజనగర మొదటి అదనపు జిల్లా కోర్టు తీర్పు చెప్పింది. చామరాజనగర జిల్లా యలందూరులోని మొత్తకేరి వీధిలో నివాసం ఉంటున్న మహేశ్ 8 ఏళ్ల బాలికను మాయమాటలతో ఇంటికి తీసుకువచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు యళందూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిశారాణి ముద్దాయి మహేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. 14 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

గుంటూరు నుంచి వచ్చి.. అంకోలాలో ఆత్మహత్యాయత్నం

- తండ్రీ కొడుకులు ఆస్పత్రిలో మృతి

యశవంతపుర: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు మరణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రాంతానికి చెందిన గంగరాజు వెంకట నాగ నరసింహ రాఘవ దినకర (41), అయన తనయుడు గంగరాజు వ్యాఘ్రేశ్వర కార్తికేయ తరుణ్ (15)లు మృతులు. వీరిద్దరు గుంటూరులో సోదరి ఇంట్లో ఉండేవారు. ఇటీవల కుటుంబ సమస్యలతో ఎవరికీ చెప్పకుండా తండ్రీకొడుకులు గోకర్ణకు బయలుదేరారు. డిసెంబరు 26వ తేదీన తెల్లవారుజామున అక్కడి నుంచి అంకోలాకు బస్‌లో వెళ్తూ ఇద్దరూ పురుగుల మందు తాగారు. అంకోలా బస్టాండ్‌లో వాంతులు చేసుకొంటూ ఉండగా స్థానికులు చూసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం హుబ్లీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దినకర 27న, తరుణ్ 28న మృతి చెందారు. మృతుని సోదరి పద్మజా గుంటూరు నుంచి అంకోలాకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

భారీగా బంగారం సీజ్

దొడ్డబళ్లాపురం: ఒక ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు అతడి నుంచి రూ.28 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మాల్దీవుల నుంచి జీ8 44 విమానంలో కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు చెక్ చేయగా మల ద్వారంలో బంగారాన్ని మాత్రల రూపంలో దాచి తరలిస్తున్న సంగతి వెలుగు చూసింది. రూ.28 లక్షల విలువైన 532 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.



ఇది వీధి లైట్ కాదు, కెమెరా మాయ. శనివారం సాయంత్రం బెళగావిలో సూర్యాస్తమయం వేళ వీధి బల్బు కింద సూర్యుడు ఇలా దర్శనమిచ్చాడు

నేటి నుంచి కేఐఏలో కొత్త రూల్స్

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కోవిడ్ నియంత్రణలో భాగంగా జిల్లా ఆరోగ్యశాఖ కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. చైనా, సింగపూర్, హాంకాంగ్, దక్షిణ కొరియా, థాయ్‌ల్యాండ్, జపాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తప్పనిసరిగా ఆర్‌టీ పీసీఆర్ టెస్టును చేయించుకోవాలి. ఎయిర్ సువిధ యాప్‌లో ఆర్‌టీ పీసీఆర్ రిపోర్టును అప్‌లోడ్ చేయాలి. 72 గంటలలోపు రిపోర్టును మాత్రమే పరిగణిస్తారు. విదేశీ ప్రయాణికులకు ఉష్ణ పరీక్ష చేయడం తప్పనిసరి. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో 2 శాతం మందికి ఆకస్మికంగా పరీక్షలు చేస్తారు. 12 ఏళ్ల లోపు పిల్లలకు ఆకస్మిక పరీక్షల నుండి మినహాయింపు ఇవ్వడం జరిగింది. కరోనా రోగ లక్షణాలు కనిపిస్తే బాలలకు కూడా టెస్టులు చేస్తారు. లేదంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచనలు ఇస్తారు.

సొరంగంలో దాడుల బెడద

- మెజెస్టిక్- రైల్వేస్టేషన్ మధ్య ప్రయాణికులకు పరీక్ష



సొరంగ మార్గం

యశవంతపుర: మెజెస్టిక్ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే సొరంగ మార్గంలో కొందరు వీధి వ్యాపారులు ప్రజలపై దాడులు చేస్తున్నారు. ముఠాలుగా ఏర్పడిన వ్యాపారులు చాకులు, కత్తులను చూపించి బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు, ప్రయాణికుల అనుకూలం కోసం నిర్మించిన సొరంగ మార్గం అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారింది. బస్టాండు- రైల్వేస్టేషన్‌కు మధ్య ప్రయాణికులు సొరంగ మార్గంలో వెళ్లాలని అధికారులు, పోలీసులు బోర్డులు పెట్టారు. అయితే విచ్చలవిడిగా వ్యాపారులు ఆక్రమించుకోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ దందా పై రవికుమార్ అనే పౌరుడు కంచనహళ్లి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేయగా 2019 ఆగస్ట్ 27న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించింది. దీనితో బీబీఎంపీ అధికారులు వ్యాపారాలను తొలగించారు. కరోనా లాక్‌డౌన్ తరువాత మళ్లీ వ్యాపారులు ఆక్రమించుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

క్లుప్తంగా

మంత్రి శ్రీరాములుతో ఎమ్మెల్యే పరణ్ణ భేటీ



మంత్రి శ్రీరాములుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

గంగావతి: బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీ.శ్రీరాములు తాలూకాలోని పంపాసరోవర్‌కు శుక్రవారం సాయంత్రం విచ్చేశారు. ఆయనకు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, బీజేపీ నేత సంతోష్ కెలోజీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంగావతి అసెంబ్లీ రాజకీయ పరిణామాల గురించి మంత్రితో ఎమ్మెల్యే చర్చించినట్లు సమాచారం. గాలి జనార్దన్ రెడ్డి గంగావతిలో తిష్ట వేసిన సందర్భంగా శ్రీరాములు ఈ నియోజకవర్గంలో పర్యటించడం, ఆయన వెంట బళ్లారి నగర ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కూడా రావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏదేమైనా శ్రీరాములు అండదండలు కోరేందుకే ఎమ్మెల్యే ఆయనను కలిసినట్లు సమాచారం.

సావిత్రిబాయి ప్రశస్తికి ఫరీదా అక్తర్ ఎంపిక

గంగావతి రూరల్: నగరంలోని సీపీఎస్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఫరీదా అక్తర్ దళిత విద్యార్థి పరిషత్ నుంచి అందించే రాష్ట్ర స్థాయి అక్షరదవ్వ సావిత్రిబాయి పూలె ప్రశస్తికి ఎంపికయ్యారు. ఆమె వృత్తి జీవితంలో, సమాజ సేవలో దళిత, అణగారిన వర్గాల విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మహిళా సాధికారతకు అందించిన సేవలు అనన్యం అని తెలిపారు. అందుకోసమే జనవరి 3న విజయపుర స్టేషన్ రోడ్డులోని కందగల్ హనుమంతరాయ రంగమందిరంలో ప్రశస్తిని ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆమెను ఉర్దూ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షులు తాజుద్దీన్, కన్నడ మాధ్యమ ఎస్‌డీఎంసీ అధ్యక్షులు అబ్దుల్ జవళగేరా, పాఠశాల సిబ్బంది వర్గం అభినందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మంటల్లో కాలిపోయిన గుడిసె ఇదే

రాయచూరు రూరల్: పార్టీ పేరుతో వ్యక్తి అనుమానాస్పద రీతిలో సజీవ దహనమైన ఘటన బీదర్ జిల్లాలో జరిగింది. శుక్రవారం రాత్రి భాల్కి తాలూకా హరనాళలో పార్టీ చేసుకున్న అనంతరం జగన్నాథ్(60) అనే వ్యక్తి మరణించాడు. గ్రామంలో జగన్నాథ్, మారుతిలు జొన్న పంట పొలంలో కాపలా కాయడానికి వేసిన చిన్న గుడిసెలో మద్యం తాగి పార్టీ చేసుకొని అక్కడే నిద్రలోకి జారుకున్నారు. అయితే ఆకస్మికంగా గుడిసెకు నిప్పంటుకుంది. మంటల్లో సజీవదహనమై జగన్నాథ్ మరణించగా మారుతికి గాయాలు కావడంతో చికిత్స కోసం అతనిని బీదర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై భాల్కి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చదువులకు ఆటంకం ఉండరాదు

గౌరిబిదనూరు: ఎలాంటి ఆటంకం లేనప్పుడే విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోగలరని, అటువంటి వాతావరణం కల్పించడం ప్రభుత్వాల బాధ్యతని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. శనివారం మునిసిపల్ కాలేజీ ఆవరణలో సిమెంటు ఫ్యాక్టరీ సహాయంతో రూ.14 లక్షలతో నిర్మించే శౌచాలయాలకు భూమిపూజ చేశారు. విద్యార్థులు ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా సమాజానికి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో నగరసభ సభ్యులు మార్కెట్ మోహన్, వెంకటరెడ్డి, అమరనాథ్, కాంగ్రెస్ నాయకుడు వెంకట్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్,నారాయణస్వామి పాల్గొన్నారు.

బాలాంజనేయ స్వామికి 101 కేజీల లడ్డూ పంపిణీ



లడ్డూ ప్రసాదం పంపిణీ చేస్తున్న దృశ్యం

గంగావతి రూరల్: గాలి జనార్దన రెడ్డి స్థాపించిన కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీకి మంచి జరగాలని కోరుకుంటూ శనివారం గంగావతి గ్రామదేవత దుర్గామాత ఆలయం నుంచి ఆనెగుంది సమీపంలోని అంజనాద్రి కిష్కింధా బాలాంజనేయ స్వామి ఆలయం వరకు బైక్ యాత్రలో జనార్దన రెడ్డి జనసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యమనూరప్ప(పుండెగౌడ) 101 కేజీల లడ్డూతో పాటు 101 టెంకాయలను స్వామి వారికి సమర్పించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద రూపంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ల పాటు రాజకీయంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ అంతిమంగా కొత్త పార్టీని స్థాపించి ప్రజాసేవలోకి అడుగిడుతున్న జనార్దనరెడ్డికి మంచి జరగాలని స్వామిని ప్రార్థించినట్లు వివరించారు.

'కొత్త' వేడుకలకు నగరం ముస్తాబు

- కేక్‌లు, స్వీట్లకు పెరిగిన గిరాకీ
- బేకరీల వద్ద క్యూకట్టిన జనం



నగరంలో ఓ బేకరీ వద్ద న్యూ ఇయర్ వేడుకల కోసం కేక్‌ను కొనుగోలు చేస్తున్న యువకులు

సాక్షి,బళ్లారి: నిన్నటితో 2022వ సంవత్సరానికి గుడ్‌బై చెప్పడంతో పాటు నూతన సంవత్సరం 2023కు స్వాగతం పలికేందుకు బళ్లారి జిల్లాలో ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం రాత్రి 12 గంటల తర్వాత కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. అర్ధరాత్రి వరకు యువత నిద్ర మేల్కొని నూతన సంవత్సరానికి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్వాగతం పలికారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలోని బేకరీల వద్ద కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు జనం క్యూకట్టారు. ఉదయం నుంచి బేకరీల వద్ద జనం క్యూలో నిలబడి కేక్‌లు తీసుకెళ్లి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కేక్‌లు కట్ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. శనివారం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత కొందరు కేక్‌లు కట్ చేసుకుని ఆనందోత్సవాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది.

ఫ్లైఓవర్లపై రాకపోకలకు బ్రేక్

శనివారం రాత్రి సత్యనారాయణ పేట ఫ్లెఓవర్ బ్రిడ్జి, కౌల్‌బజార్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. యువత వేగంగా వాహనాల్లో సంచరిస్తారనే ముందుస్తుగా వాహన రాకపోకలు నిలిపివేయడంతో నగర వాసులు హర్షం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాల్లో ముగ్గురు వెళ్లకుండా కఠిన ఆంక్షలు విధించారు. వాహనాలకు సైలెన్సర్ తీసివేసి ఎవరైనా డ్రైవ్ చేస్తే అలాంటి వారిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నారు. ఆదివారం నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ముందుగా కేక్‌లు తీసుకున్న వారు తమ తమ ఇళ్లలో కేక్‌లు కట్ చేసుకుని నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరు శనివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు జరుపుకోగా, మరికొందరు ఆదివారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. గత రెండేళ్లుగా కరోనా భయంతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు జనం కొంత భయపడటంతో కేక్‌ల వ్యాపారం బాగా తగ్గిపోయిందని, ఈ ఏడాది కేక్‌లు, స్వీట్ల వ్యాపారాలు గత ఏడాదితో పోలిస్తే బాగా జరిగిందని రేణుక బేకరీ యజమాని విశ్వనాథ్ సాక్షికి తెలిపారు. కాగా నూతన సంవత్సర వేడుకలను చర్చిల్లో జరుపుకునేందుకు క్రైస్తవ సోదరులు ఉత్సాహం చూపుతుండటంతో నగరంలో విద్యానగర్‌తో పాటు పలు చర్చిల్లో ఘనంగా ఏర్పాట్లు చేశారు.

కిడ్నాప్‌కు గురైన వ్యక్తి హత్య

- మైసూరు జిల్లాలో సంఘటన

మైసూరు: ఓ వ్యక్తిని దుండగులు కిడ్నాప్ చేసి హత్య చేసి కావేరి నది వంతెవ వద్ద పడేశారు. ఈ సంఘటన మైసూరు జిల్లాలోని టి.నరసిపురలో జరిగింది. తాలూకాలోని హొస నరసిపుర గ్రామానికి చెందిన గురుప్రసాద్ (32) హతుడు. వివరాలు.. గురుప్రసాద్ డిసెంబర్ నెల 25వ తేదీన అనారోగ్యంగా ఉండడంతో ఆటోలో టి.నరసిపురలో ఆస్పత్రికి బయల్దేరాడు. అయితే హొరళహళ్లి క్రాస్ రోడ్డులో 2 బైక్‌లలో ముగ్గురు దుండగులు వచ్చి ఆటోను అడ్డుకుని గురుప్రసాద్‌ను కిడ్నాప్ చేశారు. ఆటోడ్రైవర్ సమాచారం ఇవ్వడంతో గురుప్రసాద్ అన్న కాంతరాజ బన్నూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు గాలింపు జరుపుతుండగా నది వంతెన వద్ద గురుప్రసాద్ మృతదేహం కనిపించింది. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అవినీతిపై వార్తలు రాశాడని విలేకరిపై దాడి

తమ అవినీతిపైన వార్తలు రాశాడని విలేకరి పైన గ్రామ పంచాయతీ సభ్యులు దాడి చేసిన సంఘటన టి.నరసిపుర తాలూకాలోని బన్నూరు జీపీ సభలో జరిగింది. స్థానిక విలేకరి అయిన నాగరాజు జీపీ సమావేశం వార్త కోసం వెళ్లాడు. గతంలో యూజీడీ అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయని నాగరాజు వార్త రాసి ఉండడంతో ఆగ్రహానికి గురైన కొందరు కాంగ్రెస్, జేడీఎస్ సభ్యులు నాగరాజుపైన దాడి చేశారు. దీంతో బాధిత విలేకరి టి.నరసిపుర పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పోలీసులూ సైనికులతో సమానమే

- కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణ
- టౌన్ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కరడి సంగణ్ణ, ఎమ్మెల్యేలు

గంగావతి: దేశ సరిహద్దుల్లో సైనికులు ఎంత ముఖ్యమో దేశం లోపల ప్రజలకు అంతర్గత భద్రత కల్పించే పోలీసుల సేవలు సైతం వారితో సమానమే అని కొప్పళ లోక్‌సభ సభ్యులు కరడి సంగణ్ణ పేర్కొన్నారు. ఆయన నగరంలో నూతనంగా నిర్మించిన టౌన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం కార్యక్రమానుద్దేశించి మాట్లాడారు. ప్రజల మధ్య నిత్యం చట్టాన్ని కాపాడే బాధ్యతలను నిర్వర్తిస్తున్న పోలీసులకు మానసిక ఒత్తిళ్లు అనివార్యం అన్నారు. ఇందుకోసం పోలీసులు యోగా ప్రాణాయామాలు ఆచరించాలని ఎంపీ సూచించారు.

కాంగ్రెస్ కోవర్టుల దుష్ప్రచారం నమ్మొద్దు

గాలి జనార్దన్ రెడ్డి స్థాపించిన నూతన పార్టీ కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ బీజేపీ బీ టీమ్‌గా ఉందన్న ప్రచారంపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ దీటుగా బదులిచ్చారు. ఆయన శనివారం నగరంలో నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సందర్భంగా పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గాలి జనార్దన్ రెడ్డి నూతన పార్టీ స్థాపించిన అనంతరం కాంగ్రెస్ కోవర్టులు లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని, ఎలాంటి అపోహలను నమ్మవద్దని ఆయన సూచించారు. తమది జాతీయ పార్టీ, అలాంటివి ఏమైనా ఉంటే హైకమాండ్ చూసుకుంటుందన్నారు. గాలి జనార్దన్ రెడ్డి విషయంలో తాము ఎలాంటి ప్రతిక్రియ చేయబోమన్నారు. పార్టీ సిద్ధాంతాలకు, నిర్ణయాలకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి అధ్యక్షత వహించగా, కనకగిరి ఎమ్మెల్యే బసవరాజ్ ధడేసూగూరు, ఎమ్మెల్సీ హేమలత నాయక్, మాజీ కాడా అధ్యక్షులు తిప్పేరుద్రస్వామి, కేలోజీ సంతోష్, బళ్లారి ఐజీపీ లోకేష్‌కుమార్, కొప్పళ ఎస్పీ అరుణాంశుగిరి, నగరసభ ప్లానింగ్ కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శ్రేష్టి, మాజీ ఎమ్మెల్యే టీ.వీరప్ప, నగరసభ అధ్యక్షురాలు మాలాశ్రీ సందీప్, కనకప్ప నాయక, గిరేగౌడ, స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతిపై కన్నెర్ర



రాజేశ్వరి(ఫైల్), మరణించిన యువతి రాజేశ్వరి



రోదిస్తున్న బంధువులు



ఆస్పత్రిలో ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

- మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన
- ప్రభుత్వం నుంచి పరిహారానికి డిమాండ్

రాయచూరు రూరల్: రాయచూరు ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్)లో వైద్యుల నిర్లక్ష్యంతో ఓ యువతి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దేవినగర్‌కు చెందిన రాజేశ్వరి(18) శ్వాస తీసుకునే ముక్కు సమస్యతో బాధపడుతుండేది. ఆమె నగరంలోని ప్రైవేట్ క్లినిక్‌లో చూపించుకున్నారు. అక్కడ వైద్యుడు ఆపరేషన్ కోసం రూ.60 వేలు ఖర్చవుతుందన్నారు. అంత ఖర్చు భరించలేక డిసెంబర్ 26న రిమ్స్‌లో చేరగా తక్కువ ఖర్చుతో 30వ తేదీన ఆపరేషన్ చేశారు. అయితే వైద్యం వికటించడంతో రాజేశ్వరి మరణించింది. దీంతో కోపోద్రిక్తులైన బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద మృతదేహంతో ఆందోళనకు దిగారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని, మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాగా మృతురాలు రాజేశ్వరికి రిమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ కోర్సుకు ప్రభుత్వ కోటాలో ఉచిత ప్రవేశం లభించింది. జనవరి 10న నర్సింగ్ కౌన్సిలింగ్ జరగనుండగా ఇంతలో ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు వాపోయారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

హుబ్లీ: తనకు 30 ఏళ్ల వయస్సు వచ్చినా పెళ్లి కాలేదన్న మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ధార్వాడ తాలూకా అమ్మినబావి గ్రామంలో చోటు చేసుకుంది. సంతోష్ కొరడి(30) అనే యువకుడు శ్మశానంలో తాను తెచ్చుకున్న బాటిల్‌లోని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. సుమారు 50 శాతం మేర శరీరం కాలిపోయింది. గమనించిన స్థానికులు అతడిని రక్షించి కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ధార్వాడ గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బూడిదైన గుజరీ దుకాణం

మైసూరు: గుజరీ షాపులో మంటలు లేచి పూర్తిగా కాలిపోయిన సంఘటన నగరంలోని గ్రామీణ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఉన్న అశోకా రోడ్డులో చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకొని మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే వస్తువులు మొత్తం బూడిదయ్యాయి. లక్షల రూపాయల్లో నష్టం వచ్చినట్లు బాధితులు తెలిపారు. లష్కర్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

న్యూ ఇయర్‌కు భారీ బందోబస్తు

- పోలీస్ కమిషనర్ లాబూరామ్



హుబ్లీ: కరోనా నాలుగో వేవ్ వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నియమాల మేరకు హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనర్ లాబూరామ్ ఆధ్వర్యంలో జంట నగరాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి 9 గంటల నుంచే ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా బందోబస్తు నిర్వహిస్తున్నాయి. శాంతిభద్రతల పరిరక్షణకు 7 కేఎస్‌ఆర్‌పీ బెటాలియన్లతో పాటు 20 సీఆర్‌పీ బృందాలను నియమించారు. బైక్ వీలింగ్, డ్రింక్ అండ్ డ్రైవ్‌కు అడ్డు కట్ట వేసే ప్రయత్నంలో ప్రముఖ సర్కిళ్లలో ప్రత్యేక బృందాలు పహారా కాస్తున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. స్టార్ హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, పార్టీ హాళ్లలో అర్ధరాత్రి 1 గంట వరకు వేడుకలకు అవకాశం కల్పించారు. ముందస్తుగా సంబంధిత హాల్, హోటల్ యజమానులతో సమావేశం కూడా నిర్వహించారు. జంట నగరాలు, అతి సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించినందువల్ల డేగకళ్లతో పహారా కాస్తున్నామని కమిషనర్ లాబూరామ్ తెలిపారు. సహజంగానే కేక్‌లు, మద్యం, బార్లు, సంబంధిత మార్కెట్లలో జన సందడి నెలకొంది. కోవిడ్ ముంచుకొస్తున్న నేపథ్యంలో తగిన ముందస్తు జాగ్రత్తలతో న్యూయర్ 2023కి ఘన స్వాగతాన్ని పలకడానికి ముఖ్యంగా యువత సంగీత నృత్య కార్యక్రమాలతో హంగామా చేయడానికి సిద్ధమయ్యారు.

ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాలేవీ?



అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

హొసపేటె: నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కరునాడ కలిగళ క్రియాశీల సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రి అధికారి డాక్టర్ సలీంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులను చూసేందుకు వచ్చే రోగుల బంధువులకు సరైన ఆసనాల వ్యవస్థతో పాటు మరుగుదొడ్డి లేదన్నారు. ఆస్పత్రిలో గదులు స్వచ్ఛతగా లేకపోవడంతో రోగులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. మంచినీటి వ్యవస్థతో పాటు అంటువ్యాధులు సోకకుండా ఆవరణలో డీడీటీ బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమితి నేతలు గుజ్జల గణేష్, వాదిరాజ్ పాల్గొన్నారు.

వంతెనను కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: వంతెనను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం రాత్రి యాదగిరి జిల్లా హుణసిగి తాలూకా రాజనకోళూరు వద్ద జరిగింది. ఈ ఘటనలో మల్లికార్జున(45), పరశురాం(40) మరణించారు. హుణసిగి తాలూకా బలశెట్టిహాళకు చెందిన ఇద్దరు హుణసిగి నుంచి కోడేకల్ మీదుగా కారులో వెళుతుండగా అకస్మాత్తుగా కారు అదుపు తప్పి వంతెనను ఢీకొన్నట్లు ఎస్పీ వేదమూర్తి తెలిపారు. ఘటనపై కోడేకల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రంగనతిట్టు పక్షిధామంలో మొసలి ప్రత్యక్షం



మండ్య: మండ్య జిల్లాలో ఉన్న ప్రసిద్ధ రంగనతిట్టు పక్షిధామంలో శనివారం వచ్చిన పర్యాటకులకు అరుదైన పక్షులతో పాటు పెద్ద మొసలి కూడా దర్శనమిచ్చింది. ఎప్పుడూ నీటిలో దాగి ఉండే మొసలి చెరువులోని బండపైకి చేరిన సమయంలో పర్యాటకులు బోటులో అటువైపు వచ్చారు. బండపైన నోరు తెరుచుకొని ఉన్న మొసలిని చూసి క్షణకాలం పాటు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

కాలువలో నీటి గేజ్ నిర్వహించండి

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువలో నీటిమట్టం(గేజ్) నిర్వహించి సక్రమంగా ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని అందించాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం సిరవారలో ఆందోళన చేపట్టిన సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువలో నీటి గేజ్ నిర్వహణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నాడ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

కోలారు వార్తలు...

టమాటా పండు తపాలా బిళ్ల విడుదల



తపాలా బిళ్లను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు : నగరంలోని తపాలా ప్రధాన కార్యాలయంలో శనివారం కేంద్ర ప్రభుత్వ ఒక జిల్లా, ఒక ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఎంపిక చేసిన టమాటా పండు ప్రత్యేక తపాలా బిళ్లను రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు సీఎంఆర్ శ్రీనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమాటా కోలారు జిల్లా ప్రజల జీవితంలో ఒక భాగమైందన్నారు. టమాటా జాతీయ స్థాయిలో పరిచయం అవుతుండడం హర్షణీయమన్నారు. దీని వల్ల జిల్లా ప్రజల్లో భావనాత్మక సంబంధం మరింత బలపడుతుందన్నారు. గతంలో బంగారుదుంప జిల్లాలో ప్రముఖ పంటగా ఉండేదన్నారు. ప్రస్తుతం టమాటా జిల్లాలో ప్రముఖ పంటగా ఉందన్నారు. టమాటా బొమ్మతో పోస్టల్ స్టాంపును విడుదల చేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఏడీ పరమేష్, పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్ సుభాని, పోస్ట్ మాస్టర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను తెరవండి

మాలూరు : జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ మాస్తి వెంకటేష అయ్యంగార్ స్వగ్రామమైన మాస్తిలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అనుకూలం చేయాలని నగరంలోని కేపీఎస్ పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు అక్రం పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలోని కర్ణాటక పబ్లిక్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మాస్తి ఫిర్కాలోని ప్రభుత్వ పాఠశాలలకు సావిత్రిబాయి పూలే ఫొటోలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామీణ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను అందించాలన్నారు. ఉద్యోగుల సమన్వయ సమితి ప్రధాన కార్యదర్శి కె పి రవిశంకర్, కోశాధికారి ఏఎం రమేష్, సమన్వయ కార్యదర్శి వి తిమ్మరాయప్ప పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కోసం వినతి

శ్రీనివాసపురం : తమకు వేళకు సరిగా బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ తాలూకా కార్యదర్శి ఎం సీ శ్రీహరి మాట్లాడుతూ పట్టణంలోని వివిధ విద్యా సంస్థలకు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిగా వస్తున్న విద్యార్థులకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతూ ఆలస్యంగా తరగతులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల సమస్యను గుర్తించి వారి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శిరీన్‌తాజ్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత

కోలారు : బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆరేళ్ల బాలిక చికిత్స కోసం డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ రూ.1.5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఉదారతను చాటారు. వివరాలు..తాలూకాలోని బెత్తని గ్రామానికి చెందిన సుమంత్‌కుమార్, చైత్రా దంపతుల కుమార్తె కారుణ్య అనే బాలిక బ్లడ్ క్యాన్సర్ బారిన పడింది. వ్యాధి మొదటి దశలో ఉండడం వల్ల చికిత్స అందిస్తే పూర్తిగా కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. అయితే ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న బాలిక తండ్రి సుమంత్‌కుమార్‌కు చికిత్స ఖర్చు భరించడం కష్టమైంది. దీంతో బ్యాంకు అధ్యక్షుడు గోవిందగౌడ బాలిక చికిత్సకు అయ్యే ఖర్చును తానే భరించాడు. ప్రస్తుతం బాలిక పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉండడంతో శనివారం బాలికతో పాటు తల్లిదండ్రులు కార్యాలయంలో గోవిందగౌడను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతో పాటు సంస్కృతి ముఖ్యమే

శ్రీనివాసపురం : విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతిని కూడా పెంచుకోవాలని ఆదిచుంచనగిరి చిక్కబళ్లాపురం శాఖా మఠం మంగళానంద స్వామీజీ తెలిపారు. శనివారం బైరపల్లి సమీపంలోని విద్యా నికేతన పాఠశాలలో నిర్వహించిన మాతృభోజన పాఠశాల, కళాశాల వార్షికోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆదిచుంచనగిరి శిక్షణా ట్రస్టుకు చెందిన డాక్టర్ శివరామరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల విద్యా ప్రగతికి అవసరమైన సౌకర్యాలను, వాతావరణాన్ని కల్పించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంఘటిత ప్రయత్నంతోనే విద్యార్థుల ప్రగతి సాధ్యమన్నారు. బీఈఓ ఉమాదేవి మాట్లాడుతూ భైరవేశ్వర విద్యా సంస్థ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ విద్యా సేవలను అందిస్తోందని ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ మహాపోషకులు డీ ఎల్ సదాశివరెడ్డి, డీఈఓ కృష్ణమూర్తి, ఎం శ్రీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మంచినీటి సమస్య తీరుస్తాం

- ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి



పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: నగరంలో అన్ని కాలనీల్లో శాశ్వతంగా మంచినీటి సమస్య తీరుస్తామని ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం నగరంలోని 36వ వార్డులో మంచినీటి కల్పన పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ఈ వార్డు తరహాలో నగరంలో అక్కడక్కడ మంచినీటి సమస్య ఉందన్నారు. అన్ని కాలనీల్లో ఇంటింటికీ కొళాయిల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో తాము నగరంలో మంచినీటి సమస్య తీర్చేందుకు ఎల్ఎల్‌సీ నుంచి దాదాపు రూ.115 కోట్లకు పైగా ప్రత్యేక నిధులతో పైప్‌లైన్ వేయించడంతో నీటి సమస్య తగ్గిందన్నారు. తుంగభద్ర డ్యాంలో తగినంత నీరు ఉన్నందున ఈ ఏడాది వేసవిలో కూడా నీటి సమస్య ఉండదన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వార్డుల్లో పర్యటించి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. తుంగభద్ర డ్యాం నుంచి నేరుగా బళ్లారికి ప్రత్యేక పైప్‌లైన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే నగరంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభా, విచ్చలవిడిగా సిద్ధమవుతున్న లేఅవుట్లతో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య తీర్చేందుకు గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, కార్పొరేటర్ కల్పన వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు దేగులపాడు గుడ్‌బై

సాక్షి,బళ్లారి: నగరంలో 22వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున గత ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలుపొందిన దేగులపాడు లక్ష్మి, కంప్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన దేగులపాడు నారాయణప్ప కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు శనివారం కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు రాజీనామా లేఖ పంపారు.

టిప్పర్ ఢీకొని మహిళ బలి



ఘటనా స్థలంలో మృతి చెందిన మహిళ

హొసపేటె: అతివేగంగా వస్తున్న టిప్పర్ లారీ దూసుకెళ్లి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. కారిగనూరు బనశంకరి గుడి ప్రాంత నివాసి రేణుకమ్మ పొలం పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా శంకరనగర క్యాంపు క్రాస్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రేణుకమ్మను ఢీకొనడంతో కింద పడింది. అదే సమయంలో టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఆమె మీద గుండా దూసుకు పోయింది. ఈ ఘటనలో ఆమె ఘటనాస్థలిలోనే మరణించింది. కారు డ్రైవర్ శశికాంత్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి పరారీలో ఉన్న లారీ డ్రైవర్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నివృత్త పోలీస్ అధికారికి వీడ్కోలు

కేజీఎఫ్ : కేజీఎఫ్ పోలీస్ శాఖలో డీసీఆర్‌బీ విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహించి శనివారం నివృత్తి పొందిన సి.కృష్ణప్పను నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ ధరణీదేవి మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించడం ద్వారా ప్రజల విశ్వాసం సంపాదించాలన్నారు. నివృత్త పోలీస్ అధికారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి జి.విశ్వనాథ్, డీసీఆర్‌బీ ఏఎస్ఐ జి.రమేష్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

కోలారు : జిల్లాలోని పేద రోగులకు అనుకూలమయ్యే ధరల్లో శ్రీనివాస స్కానింగ్ సెంటర్ సేవలు అందించాలని బంగారుపేట ఎమ్మెల్యే ఎస్ ఎన్ నారాయణస్వామి తెలిపారు. ఆయన శనివారం నగరంలోని శ్రీనివాస స్కానింగ్ డయాబెటిస్ కేంద్రంలో ఆస్పత్రి నూతన సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ మనిషికి అత్యవసర సేవల్లో ఆరోగ్య సేవలు కూడా ప్రముఖమన్నారు. డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పి.గోవిందరాజు, కేపీసీసీ కార్యదర్శి బి.మునివెంకటప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి సీసంద్ర గోపాలగౌడ ఉన్నారు.

సహకార బ్యాంకు అధ్యక్షునిగా శశికుమార్



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం : తాలూకాలోని దళసనూరు పట్టు ఉత్పత్తిదారుల రైతు సేవా సహకార బ్యాంకు అధ్యక్షుడిగా గాండ్లహళ్లి శశికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బ్యాంకు కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా శశికుమార్, ఉపాధ్యక్షుడిగా కోనేటి తిమ్మనహళ్లి ఎం వీరప్ప ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ప్రముఖులు దళసనూరు ఎల్ గోపాలకృష్ణ, ఎన్ హనుమేష్, గోపాలరెడ్డి, శ్రీనివాసగౌడ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

బోనులో చిక్కిన చిరుత



తుమకూరు: తుమకూరు జిల్లా కొరటిగెరె తాలూకా కోలాల సమీపంలో తిరుగుతూ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. వారం రోజుల క్రితం ఇరక సంద్ర కాలనీలో చిరుత కనిపించడంతో గ్రామస్తులు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బోను ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది.

కాంట్రాక్టర్ ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

తుమకూరు: అప్పుల పాలైన కాంట్రాక్టర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తుమకూరు తాలూకా దేవరాయణదుర్గ అతిథి గృహంలో చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ సప్తగిరి లేఔట్‌లో నివాసం ఉంటున్న కాంట్రాక్టర్ టీ.ఎస్. ప్రసాద్ (52) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాంట్రాక్ట్ పనుల కోసం ప్రసాద్ పలుచోట్ల అప్పులు తీసుకువచ్చాడు. కాంట్రాక్ట్ చేసిన డబ్బులు రాకపోగా, అప్పులు ఎలా తీర్చాలో తెలియక డెత్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. క్యాత్సంద్ర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటర్లను కలవండి

శిడ్లఘట్ట: పార్టీ కార్యకర్తలు తమ పరిధిలోని ఓటర్లను కలిసే కార్యక్రమాన్ని ఇప్పటి నుంచే చేపట్టాలని తాలూకా మండల బీజేపీ అధ్యక్షుడు కంబదహళ్లి సురేంద్రగౌడ తెలిపారు. శనివారం నగరంలోని నగరేశ్వర కల్యాణ మంటపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వివిధ మోర్చాల పదాధికారులు, శక్తి కేంద్రాల అధ్యక్షులను ఉద్దేశించి మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు తెలియజేయండి. ఎన్నికలు మార్చిలో జరిగే అవకాశం ఉంది, జనవరి నుంచే బూత్‌స్థాయి ప్రచారం ప్రారంభించాలి, 26న రిపబ్లిక్ డే రోజు ప్రతి కార్యకర్త తమ ఇళ్లపై పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. అనంతరం ప్రధాని మోదీ మాతృమూర్తి మృతికి సమావేశంలో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, రాఘవేంద్ర, రజనీకాంత్, బాబు, రమేశ్, వెంకటేశ గౌడ, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

నాపై దుష్ప్రచారం : హోం మంత్రి

శివాజీనగర: వక్క రైతుల హిత రక్షణపై అసెంబ్లీలో మాట్లాడిన విషయాలను వక్రీకరిస్తూ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు మలెనాడు, కరావళి ప్రాంతాల వక్క పెంపకందారుల అనుకూలంగా మాట్లాడటాన్ని వారికి అర్థంకాక తన వ్యాఖ్యలనే తప్పుగా చిత్రీకరిస్తున్నారన్నారు. వక్క పెంపకందారుల భవిష్యత్‌నే నాశనం చేసిన ప్రయత్నంలో వీరు సుప్రీంకోర్టులో వక్కలు క్యాన్సర్‌కు రోగానికి కారణమని అఫిడవిట్ సమర్పించిన సంగతిని ఎవ్వరు మరిచిపోలేదన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ వక్కలు ఆరోగ్యమైనదని విజయవంతంగా వాదనను వినిపించి రైతులకు అనుకూలమయ్యే విధంగా చేయటాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలని అన్నారు.

ఐక్యవేదిక అధ్యక్షునిగా కాంతరాజు



మాట్లాడుతున్న కాంతరాజు

గౌరిబిదనూరు: జీపీ సభ్యుల ఐక్యవేదిక తాలూకా అధ్యక్షునిగా తొండేబావి జీపీ అధ్యక్షుడు కాంతరాజును తాలూకా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నగరంలో శుక్రవారం కాంతరాజు మాట్లాడుతూ... గ్రా.పం.అభివృద్ధికి ఐక్యవేదిక అవసరం. కొన్ని అధికారాలు మన చేతుల నుంచి తాలూకా ఈఓలకు పోతున్నాయని అన్నారు. రాజీవ్ గాంధీ వసతి లబ్ధిదారుల ఎంపిక అధికారాలు మనకు రావాలి. అప్పుడే గ్రామ ప్రజలకు మనం న్యాయం చేయడానికి వీలవుతుందన్నారు. వేదిక ప్రధాన కార్యదర్శి బేవినహళ్లి జీపీ అధ్యక్షుడు రేవణశిద్దేశ్వర వేదిక ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంగాధరయ్య, మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, సరళ, ప్రియాంక, కోశాధికారిగా ఏకగ్రీవంగా యోగానందాను ఎన్నిక చేశారు.

మోడలింగ్‌లో కంబళ వీరుడు

యశవంతపుర: కంబళ పోటీలలో వేగంగా పరిగెడుతూ అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధించిన మంగళూరుకు చెందిన శ్రీనివాసగౌడ మోడలింగ్‌లో ప్రవేశించారు. మంగళూరుకు చెందిన జువెలరీ సంస్థ తన ప్రకటనల కోసం శ్రీనివాసగౌడతో ఒప్పందం కుదుర్చుకుంది. దున్నపోతుతో ఆయన ఆభరణాలను ధరించిన ప్రకటనల బోర్డులు తీర ప్రాంతాలలో కనిపిస్తున్నాయి. చేతి నిండా వైవిధ్యమైన అభరణాలను ధరించారు. చేతికి బంగారు కడగ, బ్రాస్‌లైట్ ధరించి మంగళూరు ప్రజలను అకర్షిస్తున్నారు.

మంత్రిమండలి విస్తరణ లేనట్టేనా?

- అమిత్‌షాతో చర్చకు రాష్ట్ర నేతల విఫలయత్నం
- సీనియర్లలో నిరాశ





శివాజీనగర: రాష్ట్ర మంత్రిమండలిలో ఆరు పదవులు ఖాళీగా ఉండగా కనీసం ఒక్కటైనా దక్కుతుందని పాలకపక్ష నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. కానీ మంత్రివర్గ విస్తరణకు అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనలో మోక్షం లభిస్తుందని సీఎం బొమ్మై సహా ఆశావహులు నిరీక్షించగా అటువంటిదేమీ లేదని తెలుస్తోంది. దీంతో మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యం కానుంది. అమిత్‌షా రాష్ట్ర పర్యటనలో మంత్రిమండలి పదవుల పంపకానికి ఆమోదముద్ర వేస్తారని, తమకు కుర్చీలు దక్కుతాయని పలువురు సీనియర్లు భావించారు. అయితే షా రాష్ట్ర నాయకులతో ఇప్పటివరకు విస్తరణపై ఎలాంటి చర్చలు జరపలేదని సమాచారం. శనివారం కూడా బిజీబిజీగా గడిపారు. సాయంత్రం ఢిల్లీకి వెళ్లడంతో కేబినెట్ విస్తరణ గురించి చర్చలు లేనట్లేనని తేలిపోయింది. మరోసారి పదవుల పందేరం పెండింగ్‌లో పడినట్లయింది. అమిత్ షాతో పాటు శనివారం అల్పాహార విందు భేటీలో సీఎం బసవరాజ బొమ్మై, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో పాటు ప్రముఖ నాయకులు చర్చలు జరపాలని ఆకాంక్షించారు. కానీ షా ఎందుకనో ఈ భేటీని రద్దు చేశారు. చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రికి సాధ్యపడలేదు. ముఖ్యమంత్రి మరోసారి ఢిల్లీ యాత్ర చేసి పదవుల పంపకానికి అనుమతి పొందటం అనివార్యం కానుంది.

అల్పాహార విందు భేటీ రద్దు..

పదవుల కోసం పట్టుబట్టిన మాజీ మంత్రులు రమేశ్ జార్కిహొళి, సీపీ యోగేశ్వర్‌లు శనివారం ఉదయం నుంచే ముఖ్యమంత్రితో కలసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే వీరి ఒత్తిడిని గమనించిన సీఎం బొమ్మై, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిలు అల్పాహారభేటీలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్‌తో చర్చించి అందరూ అమిత్ షాను కలవాలని వెళ్లారు. అయితే అమిత్ షాకు సమయం లేని కారణంగా చర్చించేందుకు సాధ్యపడలేదు.

ఎన్నికల వేళ అసమ్మతి ఎందుకని..

ఈసారి కూడా మంత్రిగిరీ దక్కకపోతే కే.ఎస్. ఈశ్వరప్ప, రమేశ్ జార్కిహొళి ఏం చేస్తారనేది కుతూహలంగా ఉంది. ఎన్నికల ముందు మంత్రి మండలిలో మార్పులు చేసి అసమ్మతిని మూటగట్టుకునే కంటే ఇలాగే ఉంచాలని హైకమాండ్ భావిస్తోంది. అందుచేత మంత్రివర్గ విస్తరణపై దృష్టిపెట్టిన ఆకాంక్షులకు మళ్లీ నిరాశ అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. మంత్రి పదవుల ఆకాంక్షులు, సీనియర్ ఎమ్మెల్యేలకు కూడా అమిత్‌షాను కలిసి మనసులో మాట చెప్పుకోవాలని ప్రయత్నాలు చేశారు.

నోరూరిస్తున్న కేక్‌లు



మండ్య: కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా మండ్య నగరంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల కేక్‌లు మండ్య వాసులను నోరూరిస్తున్నాయి. నగరంలోని చాముండేశ్వరి నగరలో ఉన్న బేక్ పాయింట్ వార్షికోత్సవం సందర్భంగా కేక్ మేళాను మన్‌ముల్ అధ్యక్షుడు బీ.ఆర్. రామచంద్ర కేక్ ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర కార్యకారణి సభ్యుడు సిద్దరామయ్య మన్‌ముల్ డైరెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాతో జార్కిహొళి భేటీ

శివాజీనగర: మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి శనివారం కేంద్ర మంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. సీఎం బొమ్మైతో పాటు రమేశ్ జార్కిహొళి కూడా షా బసచేసిన తాజ్ వెస్టెండ్ హోటల్‌కు చేరుకుని మంత్రి పదవిపై ఆఖరి కసరత్తు చేసినట్లు సమాచారం. అమిత్ షా భేటీకి ముందుగా రమేశ్ జార్కిహొళి ఆర్టీ నగరలోని సీఎం నివాసంలో కలిసారు. మంత్రి పదవిపై చర్చించారు. అదే విధంగా మంత్రి స్థానం కోసం గోకాక్ సాహుకార్ కూడా ఉదయం అమిత్‌షాతో భేటీ అయి చర్చించినట్లు సమాచారం.

వేడుకగా మహాగణపతి హోమం



అలంకరణలో బనశంకరీదేవి



గంగపూజ దృశ్యం

బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పుష్య శుద్ధ దశమి శనివారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం ఆలయ యాగశాలలో సహస్రమోదక, శ్రీమహాగణపతి హోమం నిర్వహించారు. శుక్రవారం రాత్రి బనశంకరి ఆలయంలో గంగాపూజలో ఆలయ అర్చకులు, దేవస్థాన అభివృద్ధి సమితి అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, కమిటీ సభ్యులు, ఆలయ ఈఓ పద్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గణపతిపూజ, వాస్తు హోమం, వాస్తు బలి నిర్వహించారు.

కిలాడీ దంపతులు అరెస్ట్



అరెస్టయిన గీతాంజలి, అజిత్‌లు

యశవంతపుర: దుస్తుల కొనుగోలు చేయడానికి వచ్చి దుకాణదారులను మోసగిస్తున్న కిలాడీ దంపతులను బెంగళూరు గిరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 8న అజిత్, గీతాంజలిలు కారులో గిరినగరలోని దుస్తుల దుకాణానికి వచ్చారు. శుభ కార్యం ఉందని చెప్పి రూ. లక్షకు పైగా దుస్తులు కొనుగోలు చేశారు. తీరా బిల్లు వేసిన తరువాత చిన్నారికి అనారోగ్యంగా ఉండటంతో ఇంజక్షన్ వేయటానికి వచ్చామని, ఆ సమయంలో ఏటీఎం కార్డు తీసుకురాలేదని చెప్పి గీతాంజలిని దుకాణంలో కుర్చోపెట్టి అజిత్ వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తరువాత అజిత్ బైక్‌లో వచ్చి గీతాంజలికి ఫోన్ చేశాడు. ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ మెల్లగా అక్కడి నుంచి జారుకుంది. ఇందుకు సంబంధించి దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు గిరినగర పోలీసులు దంపతులను అరెస్ట్ చేశారు. గతంలోను మద్దూరులో వీరిద్దరు రూ. 4 వేల విలువైన చెప్పులు కొనుగోలు చేసుకుని ఉడాయించారని పోలీసుల విచారణలో బయటపడింది.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ విడుదల చేస్తున్న పాస్టర్ ఎంబీ.మోజస్, సంఘం సభ్యులు

బనశంకరి: బెంగళూరు నగరంలోని రామచంద్రాపుర తెలుగు బాప్టిస్ట్ (టీబీసీ) ఆవరణలో సంఘం సభ్యులు శనివారం తెలుగు క్రైస్తవ క్యాలెండర్‌ను విడుదల చేశారు. బైబిల్ నీతి సూత్రాలతో క్యాలెండర్ రూపొందించామని పాస్టర్ రెవరెండ్ ఎంబీ. మోజస్ తెలిపారు. కరోనా మహమ్మారి అనంతరం పూర్తిస్థాయిలో క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు చర్చిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. కరోనా వల్ల తీవ్ర కష్టాలు నేటికి ఎదుర్కొన్నారని కరోనా ఫోర్త్‌వేవ్ రాకుండా సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు క్రైస్తవులకు క్యాలెండర్ వితరణ చేస్తామన్నారు.

గూడ్స్ రైలు ట్యాంక్ నుంచి గ్యాస్ లీకేజీ



రిపేరీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యశవంతపుర: కుక్కే సుబ్రమణ్య రోడ్డు (నెట్టణ) రైల్వేస్టేషన్‌లో గ్యాస్ రవాణా చేస్తున్న గూడ్స్ బోగీల నుంచి గ్యాస్ లీకేజీ కావడం కలకలం రేగింది. శనివారం తెల్లవారుజామున స్టేషన్‌లో గూడ్స్ బోగీల నుంచి గ్యాస్ లీకేజీ విషయాన్ని లోకో పైలెట్ గుర్తించాడు. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో హుటాహుటిన నాలుగు అగ్నిమాపక దళాలు అక్కడికి చేరుకుని లీకేజీని అరికట్టారు. అనంతరం గూడ్స్‌ను వెళ్లటానికి అనుమతించారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

యశవంతపుర: స్కూటీని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో 13 ఏళ్ల బాలిక మృతి చెందిన ఘటన కారవార పట్టణంలోని బిణగాద జాతీయ రహదారిలో శనివారం ఉదయం జరిగింది. లవితా జార్జ్ ఫెర్నాండిస్ (13) అనే చిన్నారి అక్కడిక్కడే మృతి చెందగా ఆమె తండ్రి జార్జ్ ఫెర్నాండిస్ తీవ్రంగా గాయపడి కారవార క్రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బిణగాద జాతీయ రహదారిలో లవిత, ఆమె తండ్రి స్కూటీపై వెళ్తుండగా ప్రైవేట్ బస్సు ఢీకొంది. కారవార ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. స్కూటీ నుజ్జునుజ్జుకాగా, డ్రైవర్‌ను కారవార ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేశారు.

నగరేశ్వర స్వామిపై మర్కటం భక్తి



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని ప్రసిద్ధి చెందిన హరిహర సంగమ క్షేత్రం శ్రీనగరేశ్వర స్వామి దేవాలయంలో గడిచిన 15 రోజులుగా ధనుర్మాసం పూజలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి ప్రతి రోజు పూజలు జరుగుతున్న సమయంలో కోతి స్వామి వారి సన్నిధిలో కూర్చొంటోంది. ఇలా రెండు వారాలుగా జరుగుతోందని భక్తులు తెలిపారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



సహాయక చర్యల దృశ్యం



స్నోతో మంటలను ఆర్పే ప్రక్రియ

మైసూరు: ఉన్నట్టుండి రసాయనాలతో వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైనప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై పరిశ్రమల అధికారులు నగరంలోని హెబ్బాల పారిశ్రామిక వాడలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మైసూరు జిల్లా యంత్రాంగం, మైసూరు జిల్లా పరిసరాల సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పీసీటీ గ్యాస్ లిమిటెడ్ సహకారంతో విపత్తు జరిగినప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలనే దానిపై సహాయక చర్యలు, విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గాయాల పాలైన వారికి ప్రథమ చికిత్స, ఆస్పత్రికి తరలింపు తదితర చర్యలు అక్కడి వారిని అబ్బురపరిచాయి. మాక్‌డ్రిల్‌ను మైసూరు కలెక్టర్ రాజేంద్ర ప్రారంభించారు.

కొత్త ఏడాదికి పటిష్ట భద్రత

- రాజధానిలో 10 వేల మంది పోలీసుల మోహరింపు



ఎంజీ రోడ్డులో ఉమెన్ సేఫ్టీ జోన్ ఏర్పాటు

బనశంకరి: ఐటీ సిటీలో కొత్త సంవత్సరాది వేడుకలు ప్రశాంతంగా జరిగేలా నగరవ్యాప్తంగా లక్షకు పైగా సీసీ కెమెరాలను అమర్చి పోలీసులు నిఘా పెట్టారు. ముఖ్యమైన ప్రాంతాల్లో భారీ భద్రతను కల్పించారు. వందలాది పోలీస్ అధికారులతో పాటు 10 వేల మంది పోలీస్ సిబ్బందిని భద్రత కోసం నియమించారు. నగరవ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ గస్తీ కొనసాగుతుంది. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా పెట్టారు. నగరవ్యాప్తంగా మూలమూలలో లక్షకు పైగా సీసీటీవీలను అమర్చి వీటి నిర్వహణకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాల ద్వారా వచ్చే దృశ్యాలను అక్కడ పరిశీలిస్తూ అసాంఘిక శక్తులపై పోలీస్ సిబ్బంది కన్నేసి ఉంచుతారు. గొడవలు అసభ్య ప్రవర్తన, చోరీ తదితర ఘటనలు కనిపిస్తే అక్కడ ఉన్న పోలీసులకు సమాచారం చేరవేస్తారు. పోలీసులు తక్షణం అప్రమత్తమై చర్యలు తీసుకుంటారు.

37 వాచ్‌టవర్లు..

ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్‌లో అదనంగా సీసీటీవీలను అమర్చారు. మహిళల కోసం సురక్షిత కేంద్రాలను తెరిచారు. తొక్కిసలాట, అనారోగ్యం వంటివి తలెత్తితే మహిళలను ఇక్కడకు తరలిస్తారు. ఎంజీ రోడ్డు, బ్రిగేడ్‌రోడ్డులో 37 చోట్లకు పైగా వాచ్ టవర్లను ఏర్పాటు చేసి అక్కడి నుంచి పోలీసులు జనం సంచారాన్ని గమనిస్తూ ఉంచారు. రాత్రి 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నగరంలో 30 కి పైగా ఫ్లై ఓవర్ల పై సంచారం నిలిపివేశారు.

హోసూరు వార్తలు..

ఎక్కడి చెత్త అక్కడే

- పారిశుధ్యం లోపించిన హోసూరు పట్టణం



చెత్త సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ కుబేరన్

హోసూరు: హోసూరు పట్టణంలో చెత్త తొలగింపునకు కోట్లు ఖర్చు పెట్టినా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో పట్టణంలో పారిశుద్ధత లోపించిందని స్థానికులు మండిపడుతున్నారు. హోసూరు సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం జరిగిన కార్పొరేటర్ల కమిటీ సమావేశంలో కార్పొరేటర్ కుబేరన్ ఇదే విషయంపై తీవ్ర స్థాయిలో నిలదీశారు. గత అన్నాడీఎంకే హయాంలో ప్రతి నెలా రూ. 20 లక్షల ఖర్చుతో పరిశుభ్రంగా ఉంచేవారని, ప్రస్తుతం నెలకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా చెత్తాచెదారం మాత్రం బయటకెళ్లడం లేదని, కార్పొరేషన్ పరిధిలోని 45 వార్డులలో ఇదే పరిస్థితిగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. పట్టణంలో కొత్తగా పార్కుల ఏర్పాటుకు ముందే ప్రస్తుతం ఉన్న పార్కుల నిర్వహణ చేపట్టాలన్నారు.

గ్రామంలోకి చొరబడిన ఏనుగు



హోసూరు సమీపంలో సంచరిస్తున్న ఒంటి ఏనుగు (ఫైల్)

హోసూరు: శ్యానమావు అటవీ ప్రాంతం వైపు వెళ్లిన ఒంటి ఏనుగు గ్రామంలోకి చొరబడడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. డెంకణికోట అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగుల మంద నుంచి విడిపోయిన ఒంటి ఏనుగు శుక్రవారం సాయంత్రం హోసూరు సమీపంలోని శ్యానమావు అటవీ ప్రాంతం వైపు జరిగింది. రాత్రి సినిగిరిపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో రాగి, క్యాబేజ్, టమాటా తదితర పంటలను తొక్కి ధ్వంసం చేసి గ్రామంలోకి వచ్చింది. ప్రజలు భయాందోళనలకు గురై హోసూరు అటవీ శాఖాధికార్లకు సమాచారం అందజేశారు. అటవీ శాఖ సిబ్బంది టపాకాయలు పేల్చి శ్యానమావు అటవీ ప్రాంతంలోకి మళ్లించారు.

ఆటల పోటీల్లో పాల్గొనండి

హోసూరు: తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా 2022–23 ముఖ్యమంత్రి ట్రోఫీ ఆటల పోటీలు జరుగుతాయని, ఇందులో జిల్లా క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటుకోవాలని కలెక్టర్ జయచంద్రభానురెడ్డి అన్నారు. క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో క్రీడాశాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విభాగాల క్రీడాకారులకు జనవరి, ఫిబ్రవరి నెలల్లో క్రీడాపోటీలు జరుగుతాయని, పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఉద్యోగులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు.

ఇంట్లోకి చొరబడి దోపిడీ

- అడ్డొచ్చిన వ్యక్తికి కత్తిపోట్లు

హోసూరు: ఇంట్లో దోపిడీకి పాల్పడి కత్తితో దాడి చేసిన దుండగుల కోసం హడ్కో పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వివరాల మేరకు హోసూరు తిరువళ్లువర్ నగర్‌కు చెందిన మార్కెట్ రాజ (48) శుక్రవారం రాత్రి కొడుకుతో కలిసి బజారుకెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి రాజా భార్య, అత్తపై కత్తి ఉంచి బీరువాలో ఉన్న 15.5 పౌన్ల బంగారు నగలను దోచుకెళ్తుండగా అప్పుడే రాజా వచ్చాడు. అతనిపై కత్తితో దాడి చేసి నగలతో పరారైయ్యారు. తీవ్ర గాయాలేర్పడిన రాజాను స్థానికులు చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజా ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు.

మరో కేసులో దొంగల అరెస్టు..

ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కత్తితో బెదిరించి రూ. 4.5 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ముగ్గురు నిందితులను ప్రత్యేక పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు రాయకోట టమాటా మార్కెట్ ప్రాంతానికి చెందిన కాడురామ్ అదే ప్రాంతంలో హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని భార్య యశోద. డిసెంబరు 22వ తేదీ ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం గమనించి ముగ్గురు దుండగులు ఇంట్లోకి చొరబడి యశోదను కత్తితో బెదిరించి బీరువాలో ఉన్న రూ. 4.5 లక్షల నగదును లాకెళ్లారు. ఈ ఘటనపై కాడురామ్ రాయకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాయకోటకు చెందిన లక్ష్మణ్‌రామ్, బెంగళూరుకు చెందిన శంకర్‌సింగ్, సురేందర్‌సింగ్‌లను అరెస్ట్ చేశారు. వీరిని శుక్రవారంసేలం జైలుకు తరలించారు.

ఆర్టీసీ బస్సు– పికప్ వ్యాన్ ఢీ







నుజ్జయిన పికప్ వ్యాన్ ముందు భాగం, రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు, గాయపడిన పికప్ వాహన డ్రైవర్

- ముగ్గురికి తీవ్ర గాయాలు

కెలమంగలం: డెంకణీకోట– అంచెట్టి రోడ్డుపై ప్రభుత్వ ఆర్టీసీ బస్సు– పికప్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో పికప్ వాహన డ్రైవర్‌తో పాటు ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం అంచెట్టి నుంచి డెంకణీకోట వైపు వెళ్తున్న బస్సు– ముత్తురాయన్ కోయిల్ వద్ద ఎదురుగా వెళ్తున్న పికప్ వాహనం ఢీకొన్నాయి. పికప్ వాహనం బాగా దెబ్బతింది. అందులోని డ్రైవర్‌తో పాటు బస్సులో ఇద్దరికి తీవ్ర గాయాలేర్పడింది. వెంటనే వీరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అంచెట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి ఫిల్టర్ ప్రారంభం



ఫిల్టర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

తుమకూరు: తుమకూరు మహా నగర పాలికె పరిధిలోని 9వ వార్డు జయపురలో తాగునీటి ఫిల్టర్‌ను శనివారం తుమకూరు నగర ఎమ్మెల్యే జ్యోతిగణేష్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ ప్రాంతం ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించడానికి రూ. 2 లక్షల వ్యయంతో తాగునీటి ఫిల్టర్‌ను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెరకు తోట ధ్వంసం



చెరకు తోటలో ఏనుగు

మండ్య: మండ్య జిలా మద్దూరు తాలూకా చిక్కరసినకెరె గ్రామ శివారులో అడవి ఏనుగు వీరంగం సృష్టించింది. చెరకు పంటపై పడి తొక్కేసింది. శనివారం తెక్కి పడేసింది. తెల్లవారుజామున గ్రామానికి చెందిన శివలింగయ్య అనే రైతుకు చెందిన చెరకు తోటలోకి ప్రవేశించిన ఒంటి ఏనుగు పంటను తొక్కి నాశనం చేసింది. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని ఏనుగును తరిమివేశారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

పావగడ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన చేనేత సన్మాన్ పథకం ప్రయోజనాలు అర్హులందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అనిల్, గోవింద, గంగాధర్ తదితరుల నేతృత్వంలో కార్మికులు వైఎన్ హొసకోటలో శనివారం ఆందోళన చేపట్టారు. సంఘం నాయకుడు అనిల్ మాట్లాడుతూ... సన్మాన్ యోజన పథకం కొంత మందికి మాత్రమే అందుతోందని, వైఎన్ హొసకోటతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు ఉండగా వారిలో కేవలం 4 వేల మందికి మాత్రమే ప్రయోజనం చేకూరిందన్నారు. సంబంధిత అధికారులు రీ సర్వే చేసి ప్రతి ఒక్కరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నేటి తరంతో అంతరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తా



"ఒక తల్లిగా, ఒక పోలీస్ అధికారిగా నా ఆలోచనా విధానానికి నేటి తరంతో నాకున్న అంతరాన్ని తగ్గించుకునేలా ప్రయత్నించాలనుకుంటున్నాను. నేటి తరం ఆలోచనలను అర్థం చేసుకుంటూ వారి అభివృద్ధికి తగిన సూచనలు ఇస్తూ ఒక తల్లిగా ముందుకు వెళ్లాలనుకుంటున్నాను. చట్టం పరిధిలో మరింత చేరువయ్యేలా పనిచేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటాను.

– సుమతి, మహిళా భద్రత విభాగం డీజీ

కొత్త ఏడాదిలో ప్రాజెక్టులు పూర్తవ్వాలి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా ప్రాజెక్టులను కొత్త ఏడాదిలోనైనా పూర్తి చేయాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని ప్రార్థించారు. సామాజిక దురాచారాలు, అనారోగ్యంపై పోరును కొనసాగించాలని తన సందేశంలో పిలుపునిచ్చారు.. కొత్త సంవత్సరంలో దేశం మరెన్నో లక్ష్యాలను సాధించాలన్నారు.



క్లుప్తంగా...

కాంగ్రెస్ నేతలకు కొత్త బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్‌లో పని విభజన జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న ఏడుగురికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొత్త ఏడాదిలో కొత్త బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ మల్లు రవి (సమన్వయం, నిర్వహణ), జి.నిరంజన్ (ఎన్నికల కమిషన్), టి.కుమార్‌రావు (కార్యక్రమాలు, సమాచారం), వేం నరేందర్‌రెడ్డి (సంస్థాగతం, డీసీసీలు, మండల కాంగ్రెస్ కమిటీలతో సమన్వయం), హెచ్.వేణుగోపాల్‌రావు (ప్రొటోకాల్, సంస్థాగత శిక్షణ), ఎస్.జగదీశ్వర్‌రావు (ఏఐసీసీ కార్యక్రమాల సమన్వయం), చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కమ్యూనికేషన్స్, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా, బీమా)లకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్ర అప్పులకు వడ్డీలు జనాలు కట్టాల్నా?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అప్పులకు వడ్డీలు జనాలు కట్టాల్నా అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. 'ఊపర్ షేర్వానీ.. అందర్ పరేషానీ' అన్నట్లుంది రాష్ట్ర పరిస్థితి అని ఆమె ట్వీట్ చేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్ర ఆదాయం కిస్తీలకే మిగలట్లేదన్నారు. రాష్ట్రం సిద్ధించిన నాటికి సంపద 16వేల కోట్లుకాగా.. ఇప్పుడు అప్పు 4.50 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఎనిమిదిన్నరేళ్లుగా చేసిన అప్పులకు కట్టిన వడ్డీ లక్ష కోట్లని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చడం దుర్మార్గమని, ఇంత అప్పు చేసినా జనానికి ఒరిగింది మాత్రంసున్నా అని షర్మిల విమర్శించారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేశానని.. ఇక బంగారు భారత్ చేస్తానంటూ దేశాన్ని దోచుకోవడానికి పోతున్నాడని షర్మిల ఆరోపించారు.

ప్రజలకు షర్మిల నూతన సంవత్సర శుభాకాంక్షలు.. రాష్ట్ర ప్రజలకు వైఎస్ షర్మిల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజల జీవితాల్లో మరింతగా వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. 2023 ఎన్నికల ఏడాదని, కేసీఆర్ నీచ, నికృష్ట, నియంత, అవినీతి, అరాచక పాలనకు స్వస్తి పలికే సంవత్సరమన్నారు.

ఎంబీబీఎస్ సీట్లలో తెలంగాణ మేటి

- ప్రతి లక్ష జనాభాకు 19 సీట్లున్నాయి: మంత్రి హరీశ్
- 929 సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నియామకపత్రాలు అందజేత



సివిల్ అసిస్టెంట్ సర్జన్లతో మంత్రి హరీశ్‌రావు సెల్ఫీ

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: ఎంబీబీఎస్ సీట్ల విషయమై దేశంలోనే తెలంగాణ ముందువరుసలో ఉందని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ప్రతి లక్ష జనాభాకు 19 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ తర్వాతి స్థానాల్లో కర్ణాటక(17), తమిళనాడు(15), గుజరాత్(10), మహారాష్ట్ర(9) సీట్లు ఉన్నాయన్నారు. తలసరి పీజీ సీట్లలో తెలంగాణ దేశంలోనే రెండోస్థానంలో ఉందని, ప్రతి లక్ష జనాభాకు 2.77 మంది పీజీ డాక్టర్లు తయారవుతున్నారని, అతిత్వరలో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ నిలుస్తుందని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖలో కొత్తగా నియమితులైన 929 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు మంత్రి హరీశ్ శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శిల్పకళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలను అందించాలని, బదిలీల కోసం ప్రయత్నం చేయెుద్దని కోరారు. 81 వేల నియామకాలు చేపడతామని ముఖ్యమంత్రి చెప్పారని, మీరే మొదటి రిక్రూట్‌మెంట్ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి వైద్య, ఆరోగ్యశాఖలో ఇప్పటివరకు 21,202 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, మరో 10వేల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో కేవలం 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, ఇప్పుడు 17కు చేర్చగలిగామని, ఎంబీబీఎస్ సీట్లను 6,615 సీట్లకు పెంచగలిగామని పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో ఏడాదికి 8 చొప్పున ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తామని, దీంతో ప్రతి జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాలు ఏర్పాటు చేసినట్లు అవుతుందని అన్నారు. తల్లిజన్మ ఇస్తే.. పునర్జన్మ ఇచ్చే అవకాశం కేవలం డాక్టర్లకే ఉంటుందన్నారు.

గొప్ప డాక్టర్లుగా పేరుపొందాలి

గ్రామీణులకు, పేదలకు మంచి వైద్యం అందించి గొప్ప డాక్టర్లుగా పేరు పొందాలని, ప్రజల మన్ననలను పొందాలని మంత్రి హరీశ్ ఆకాంక్షించారు. మెడికల్ సర్వీసెస్‌లో తెలంగాణ మూడో స్థానంలో ఉందని నీతి ఆయోగ్ చెప్పిందని, దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణను నిలిపేందుకు అందరం కలిసి కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, డీపీహెచ్ శ్రీనివాసరావు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతామహంతి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వండి


- సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ
- క్వింటాలుకు రూ.15 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: పత్తి పంటకు మద్దతు ధర కావాలని రైతులు రోడ్డెక్కితే ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని, విపత్కర పరిస్థితుల్లో ఉన్న రైతుల సమస్యలను ప్రభుత్వమే పట్టించుకోకుంటే రైతులు ఎవరికి చెప్పుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. వానలు, చీడపీడల బెడదను తట్టుకుని, పండిన పత్తిని చూసిన రైతన్న ఆనందం, మార్కెట్‌లో ధర చూడగానే ఆవిరైపోతోందని, దళారుల రాజ్యంలో గిట్టుబాట ధర రాక రైతులు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తికి పెట్టిన పెట్టుబడిని పరిగణనలోకి తీసుకుంటే కనీసం రూ.15 వేలు క్వింటాలుకు వస్తేకానీ రైతుకు గిట్టుబాటు కాని పరిస్థితి ఉందని, కానీ దళారులు కేవలం రూ.6–7 వేలు మాత్రమే చెల్లించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. సరైన వ్యవసాయ విధానం, పంటల ప్రణాళిక లేకపోవడం, దిశానిర్దేశం చేసే వ్యవస్థలు కుంటుపడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని రేవంత్ పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ రుణ ప్రణాళికలు సరిగా అమలు చేయకపోవడం, విత్తనాలు, పురుగు మందుల సరఫరా చేయలేకపోవడం, ప్రకృతి విపత్తుల సమయంలో భరోసా ఇవ్వలేకపోవడం, తెగుళ్ల సోకి పంట నష్టం జరిగినప్పుడు పరిహారానికి భరోసా లేకపోవడం వంటి అనేక కారణాలు రాష్ట్రంలో వ్యవసాయాన్ని, రైతును సంక్షోభంలో పడేశాయని విమర్శించారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా సగటున రోజుకు ఇద్దరు అన్నదాతలు బలవన్మరణానికి పాల్పడుతున్నారని, రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉందని జాతీయ క్రైం బ్యూరో (ఎన్సీఆర్బీ) లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం రైతుల ఆత్మహత్యల సంక్షోభంపై దృష్టి సారించాల్సిన అవసరం సూచించారు. అయితే తూతూ మంత్రపు చర్యలు కాకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని అన్నారు. పత్తికి క్వింటాలుకు రూ.15 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, తక్షణమే రూ.లక్ష రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాల ప్రైవేటు అప్పులను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిష్కరించేలా ప్రభుత్వ వ్యవస్థలు చొరవ తీసుకోవాలని, కౌలు రైతులకు కూడా అన్ని పథకాలను వర్తింపజేయాలని, పంటల బీమా పథకాల అమలుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో రేవంత్‌రెడ్డి కోరారు.

2022లో సర్కారు రైతుల ఉసురుపోసుకుంది

- ప్రజాకోర్టులో టీఆర్ఎస్‌కు శిక్ష తప్పదు: కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: సొంత రాష్ట్రంలోని ప్రజాసమస్యలు తీర్చకుండా సెంటిమెంట్‌గా పుట్టిన టీఆర్ఎస్ పేరు మార్చి ఢిల్లీ వెళ్లాలనుకుంటున్న సీఎం కేసీఆర్ ప్రయత్నాన్ని ఎవరూ హర్షించబోరని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి వ్యాఖ్యానించారు. ఇంట గెలవకుండా రచ్చ గెలవాలనుకోవడం అత్యాశే అవుతుందని అభిప్రాయపడ్డారు. శనివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంచాయతీరాజ్ సంఘటన్ వైస్ చైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధీర్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుందని, రైతులు, రైతు కూలీలకు ఇబ్బందినామ సంవత్సరంగా మిగిలిపోయిందని చెప్పారు. కేసీఆర్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత 7,098 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కనీసం ఆ కుటుంబాలకు పరిహారం కూడా ఇవ్వలేదని అన్నారు.

జనవరి 2న సర్పంచుల ధర్నా

గ్రామపంచాయతీలకు వచ్చే అన్ని నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాల కోసం దారి మళ్లిస్తోందని రాచమళ్ల సిద్దేశ్వర్ ఆరోపించారు. రాష్ట్రంలోని 12,750 గ్రామపంచాయతీలకు నాలుగైదు నెలలుగా ఇవ్వాల్సిన రూ.1,250 కోట్ల రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెప్రగతి పేరుతో సర్పంచ్‌లను అప్పులపాలు చేశారని అన్నారు. స్థానిక సంస్థల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఈనెల 2న ఇందిరాపార్కు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపోడికి కల్యాణలక్ష్మి చెక్కు ఇవ్వనంటావా?

బాజిరెడ్డిపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆగ్రహం



దుబ్బాక టౌన్: 'ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న బాజిరెడ్డి గోవర్దన్ సభలో బీజేపోడు కల్యాణలక్ష్మి చెక్కు కోసం వస్తే ఇవ్వలేదని, అంత సంస్కారహీనంగా మాట్లాడుతున్నా, వేదికమీద ఉన్న మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి నోరు మెదపకపోవడం సిగ్గుచేటని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. శనివారం దుబ్బాక పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుల, మతాలకు అతీతంగా వ్యవహరిస్తానని బాజిరెడ్డి గోవర్దన్ భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. కేంద్రం కూడా అదే విధానం అవలంబిస్తే తెలంగాణకు అన్యాయం జరగదా అని మంత్రులను ప్రశ్నించారు.

మద్దతు ధర పెంపుపై కేంద్రాన్ని ప్రశ్నించవా?

రేవంత్.. ధర నిర్ణయం కేంద్ర పరిధి అని తెలియదా?: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ధాన్యం కొనమంటే ముఖం చాటేసిన కేంద్రం గురించి పల్లెత్తు మాట అనని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం మీద బురదజల్లడం విడ్డూరంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయంగా వేరైనా ఈ రాష్ట్రం బిడ్డగా రేవంత్ ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని, బీజేపీతో ఉన్న లోపాయికారి ఒప్పందం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ పత్తి గిట్టుబాటు ధర రాష్ట్రం పరిధిలో ఉంటుందా? కేంద్రం పరిధిలో ఉంటుందా? అనే విషయం కూడా తెలీదా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇటీవల పత్తి మద్దతు ధర, రైతుల సమస్యలపై సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి రాసిన లేఖపై నిరంజన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ గిట్టుబాటు ధర గురించి కేంద్రాన్ని ప్రశ్నించకుండా సీఎంకు లేఖ రాయడంలో రేవంత్‌రెడ్డి ఆంతర్యమేంటని ప్రశ్నించారు. మద్దతు ధరల విషయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తానని మాటతప్పిన ప్రధాని మోదీని, బీజేపీని ఎప్పుడైనా నిలదీశావా? అని అడిగారు.

నగర వార్తలు

ముగిసిన మహాభారతోపన్యాస లహరి

మోతీనగర్: జంటనగరాల సాహితీ సాంస్కృతిక సంస్థ యువభారతి నిర్వహిస్తున్న 'మహాభారతోపన్యాస లహరి' కార్యక్రమం శనివారంతో ముగిసింది. మోతీనగర్ శంకరమఠం ప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఉపన్యాస కార్యక్రమాల్లో పలువురు ప్రవచనకర్తలు, మహా పండితులు మహాభారతం ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ ఏడింటితో పాటు ఎనిమిదవ అంశం భగవద్గీతను కూడా కలిపి వీరి ఉపన్యాస సారాంశాలను 'మహాభారతోపన్యాస లహరి' పేరుతో డా. వై.కృష్ణకుమారి రచించిన 'దక్షిణ భారత వనితా వాగ్గేయ వాఙ్మయం' పుస్తకాలను రమణాచారి ఆవిష్కరించారు. ఆ పుస్తకాలను యువభారతి ప్రచురణల సంపాదకులు డా. బి.జయరాములు సమీక్షించారు. ఎల్.వి. గంగాధర శాస్త్రి మహాభారతము–భగవద్గీత అన్న అంశంపై ప్రసంగించారు. భగవద్గీత బోధించిన నాలుగు ప్రధాన అంశాలను వివరించారు. నేటి యువతకు భగవద్గీత పఠనం అత్యంత ఆవశ్యకమని, దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే అన్ని సమస్యలకు పరిష్కారం భగవద్గీతలోనే ఉన్నదని, ఎందరో ప్రముఖులకు మార్గనిర్దేశనం చేసింది భగవద్గీతే అని, ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుత వరం భగవద్గీత అన్నారు. భగవద్గీత జీవన గీతే కానీ, మరణ గీత కాదని అందరూ గ్రహించాలని సూచించారు.

క్రీడాకారులకు అభినందన



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఇంటర్ స్టేట్ ఫెన్సింగ్ (కత్తి యుద్ధం) ఛాంపియన్ పోటీలలో పతకాలు సాధించిన బాల బాలికలను ప్రభుత్వ క్రీడా శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అభినందించారు. శనివారం బి ఆర్ కే ఆర్ భవన్ లోని తన చాంబర్‌లో కలిసిన అండర్ 14 విభాగంలో వైష్ణవి (బంగారు పతకం), హర్షిత (సిల్వర్), అనన్య సారో (సిల్వర్), రిత్విక (సిల్వర్) గౌరవ్ సింగ్ (బ్రాంజ్), లక్ష్మీనారాయణ (సిల్వర్)లు వ్యక్తిగత పతకాలను సాధించడం పట్ల ఆయన ప్రశంసించారు. విజేతలు జనవరి 10 నుంచి 13 వరకు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి కత్తియుద్ధం పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నారు.

నేడు ఎంజీబీఎస్‌లో నూతన సంవత్సర వేడుకలు

అఫ్జల్‌గంజ్: మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించనున్నారు. ఉ. 9.30 గంటలకు ఎంజీబీఎస్‌లో జరుగనున్న వేడుకల్లో టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పాల్గొని ప్రయాణికులతో కలిసి వేడుకలు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు.

'పది' గట్టెక్కేదెలా?

- సిలబస్ పూర్తి కాని వైనం..
- ప్రత్యేక తరగతులు, వారాంతపు పరీక్షలకు ఆదేశాలు
- సర్కారు బడుల్లో ఎస్సీఈఆర్టీ ప్రణాళిక అమలయ్యేనా..



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను గటెక్కించడం విద్యాశాఖకు సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. మహానగరంలోని సర్కారు బడుల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత, మరోవైపు సిలబస్ పూర్తి కాక పోవడం వంటివి తలకు మించిన భారంగా మారాయి. తాజాగా సర్కారు బడుల్లో మంచి ఫలితాల సాధన కోసం నిర్వహించ తలపెట్టిన ప్రత్యేక తరగతులు, వారాంతపు పరీక్షల అమలు ప్రశ్నార్థకంగా మారాయి. కరోనా నేపథ్యంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు తగ్గడంతో పాటు సబ్జెక్టులపై కనీస పట్టులేకుండా పోయింది. వాస్తవంగా సబ్జెక్టు నిపుణుల కొరతతో ప్రధాన సబ్జెక్టుల్లో పాఠ్యాంశాల బోధన అంతంత మాత్రంగా తయారైంది. అయా పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతోనే ప్రధానోపాధ్యాయులు బోధన కొనసాగిస్తున్నారు. కరోనా, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో కొత్త అడ్మిషన్లు బాగానే పెరిగాయి. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యను విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని సాక్షాత్తు ప్రధానోపాధ్యాయులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సర్కారు బడుల్లో వంద శాతం ఫలితాలు సాధించడానికి అధికారులు మాత్రం ఏటా మొక్కుబడిగా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నా అందుకు అనుగుణంగా టీచర్ల ఖాళీల భర్తీ ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం కావడంతో మరింత వెనుకబాటు తప్పడం లేదు.

సరికొత్త ప్రణాళిక

- సర్కారు బడుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను అధిగమించకుండా పదవ తరగతి పరీక్షలో మంచి ఫలితాల కోసం రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) తొలిసారిగా
- సరికొత్త ప్రణాళిక రూపొందించింది. వాస్తవంగా పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తరగతులు, పరీక్షలపై ప్రణాళిక రూపొందించి అమలు చేసేవారు. ఆయితే సర్కారు బడుల్లో తగ్గుతున్న పదవ తరగతి ఫలితాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక రూపొందించడం విశేషం.

40రోజులు ప్రత్యేక తరగతులు..

- పదవ తరగతి విద్యార్థులు సబ్జెక్టులపై మరింత పట్టు సాధించేందుకు 40 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. జనవరి 3 నుంచి మార్చి 10వ వరకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. పాఠశాల ప్రారంభ సమయం కంటే ముందు ఉదయం 8.30నుంచి 9.30 గంటల వరకు ఒక సబ్జెక్టు, పాఠశాల సమయం అనంతరం
- సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు మరో సబ్జెక్టులో తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు సబ్జెక్టులు బోధిస్తారు. వాటిపైనే వారం వారం పరీక్షలు నిర్వహిస్తారు.

3 నుంచి వారాంతపు పరీక్షలు

- పదో తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమయ్యేవిధంగా ప్రతి ఆదివారం, రెండో శనివారాల్లో వారాంతపు పరీక్షలు జరుగుతాయి. ప్రతి వారం ఒకే రోజు రెండు పరీక్షలు
- ఉదయం 9 నుంచి11 గంటల వరకు ఒక పరీక్ష, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రెండో పరీక్ష నిర్వహించాల్సి ఉంది..

ఫుడ్ బిజినెస్‌కు ఫుల్ జోష్...

- ఫుల్ ఆర్డర్లకు న్యూ డిమాండ్.
- 15వేల కేజీల బిర్యానీలతో బావార్చీ రికార్డ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పేరొందిన ఓ క్లబ్‌కు చెందిన సభ్యుడు కాల్ చేసి తనకు కొన్ని వంటకాలను ఇంటికి పంపాల్సిందిగా కోరితే... ఆర్డర్స్ ఎక్కువ కావడం వల్ల పంపలేమంటూ సమాధానం వచ్చింది. ఓ క్లబ్ తన సభ్యునికే ఈ రకమైన సమాధానం ఇవ్వాల్సి రావడం..నగరంలోని న్యూ డిమాండ్‌కు అద్దం పడుతుంది. సంవత్సరాంతంతో పాటు వారాంతపు రోజైన శనివారం పలు వ్యాపారాలు సరి కొత్త రద్దీని చవి చూశాయి. స్వీట్ షాప్స్, బేకరీల రద్దీ ఎప్పుడూ ఉండేదే అయినా, ఈసారి రెస్టారెంట్స్, హోటల్స్‌కు ఆర్డర్లు వెల్లువెత్తాయి. ఫుడ్ డెలివరీ యాప్స్ ఫుల్ జోష్‌గా నడిచాయి. పలు పేరొందిన రెస్టారెంట్స్, క్లౌడ్ కిచెన్స్ డ్రైవ్ ఇన్స్, టేక్ ఎవే పాయింట్స్...సాయంత్రం నుంచే కొత్త ఆర్డర్స్ తీసుకోలేమని చేతులెత్తేశాయి. ఇళ్లల్లో, గెస్ట్ హౌస్, ఫార్మ్ హౌస్‌లు, వంటి చోట్ల పార్టీలు చేసుకునేవారు పెరగడంతో ఫుడ్ డెలివరీకి డిమాండ్ బాగా పెరిగింది. గత ఏడాది నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అత్యధిక సంఖ్యలో బిర్యానీ ఆర్డర్స్ అందుకున్న స్విగ్గీ ఈ దఫా అంతకు రెట్టింపు వచ్చాయని అంటోంది. ఇక క్రాస్‌రోడ్స్‌లోని బావార్చీ రెస్టారెంట్ గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 15వేల కేజీల బిర్యానీలను సిద్ధం చేస్తే అవన్నీ హాంఫట్ అయిపోయాయని సమాచారం.

కమీషన్ ఏజెంట్ల సంఘంపై 'ఉచిత' ప్రేమ

- అద్దెకు తీసుకున్న స్థలం కేటాయించడంపై సంఘాల మండిపాటు
- ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక

సాక్షి, సిటీబ్యూరో: అసలే అద్దె స్థలం..తగినంత స్థలం లేకపోవడంతో వ్యాపారుల ఇబ్బందులు. వీటిని పట్టించుకోని మార్కెటింగ్ పెద్దలు మాత్రం ఉన్న స్థలంలో కొంత భాగాన్ని ఉదారంగా కమీషన్ ఏజెంట్ల కార్యాలయానికి కేటాయించారు. బాటసింగారంలో పండ్ల మార్కెట్ నిర్వహణకు ప్రభుత్వం.. అద్దెకు స్థలాన్ని తీసుకుంది. కోహెడలో శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేసే వరకు ఫ్రూట్ మార్కెట్‌ను ఇక్కడే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు 17 ఎకరాలను లీజుకు తీసుకుంది. నిర్దేశిత ఒప్పందం ప్రకారం అద్దెలు కూడా చెల్లిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా..అత్తెసరు స్థలంలో వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు నానాయాతనలు పడుతున్న వ్యాపారులను పట్టించుకోని మార్కెటింగ్ శాఖ.. కమీషన్ ఏజెంట్లపై మాత్రం ఎనలేని ప్రేమను కనబరిచింది. తమ కార్యాలయాన్ని ఖాళీ చేసి కమీషన్ ఏజెంట్ల సంఘానికి అప్పగించింది. ఇది కాస్తా కమీషన్ ఏజెంట్ల సంఘాల మధ్య వివాదాన్ని రాజేసింది. ఈ వ్యవహారంపై మిగతా సంఘాలు భగ్గుమనడమేగాకుండా.. మార్కెటింగ్ శాఖ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించాయి. అద్దెకు తీసుకున్న స్థలాన్ని అప్పనంగా కట్టబెట్టడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ఈ స్థలం కేటాయింపు వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇతర సంఘాలు డిమాండ్ చేశాయి.

ముగిసిన నిసర్గ వైభవం...

గన్‌ఫౌండ్రీ: ఇన్ఫోసిస్ ఫౌండేషన్(బెంగుళూరు), భారతీయ విద్యాభవన్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో కొనసాగుతున్న నిసర్గ వైభవ్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా బీవీబీ బెంగుళూరు కేంద్రం చైర్మన్ కెజి రాఘవన్ మాట్లాడుతూ.. భారత దేశ సంస్కృతి పునరుజ్జీవనం, విలువైన విద్య కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతిని కాపాడుకోవాలని యువతకు సూచించారు. అనంతరం భవన్ వ్యవస్థాపకులు డాక్టర్ కెఎం మున్షీజీ 135వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కళాకృష్ణ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సప్త సర్వాలు–ఆంధ్ర నాట్యం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీవీబీ బీహెచ్ఈఎల్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ ఉమా చేబోలు, బీవీబీ బెంగుళూరు జాయింట్ డైరెక్టర్ నాగలక్ష్మీ, నగర కేంద్ర వైస్ చైర్మన్ ఎస్.గోపాలకృష్ణన్, సి.రమాదేవి పాల్గొన్నారు.



ప్రశాంత ఆత్మకు మనూభాయ్ ఎం.షా అవార్డు



అవార్డు అందుకుంటున్న డా. ప్రశాంత ఆత్మ

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ప్రశాంత ఆత్మ ప్రతిష్టాత్మకమైన 'ప్రొఫెసర్ మనుభాయ్ ఎం.షా మెమోరియల్ అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఇటీవల ఔరంగాబాద్‌లోని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ మరట్వాడా యూనివర్సిటీలో డిసెంబర్ 22 నుంచి 24 వరకు జరిగిన 73వ ఆల్ ఇండియా కామర్స్ కాన్ఫరెన్స్(ఐసీఏ)లో ప్రశాంత ఆత్మకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఆల్ ఇండియా కామర్స్ అసోసియేషన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డును 2012 నుంచి ప్రొ. మనుభాయ్ ఎం.షా మెమోరియల్ కామర్స్ అండ్ బిజినెస్‌మెనేజ్‌మెంట్ అవార్డుగా పేరు మార్చారు. ప్రతి సంవత్సరం కామర్స్ అండ్ బిజినెస్ మెనేజ్‌మెంట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డు అందజేస్తున్నారు, అవార్డు కింద రూ 2 లక్షల నగదు, సర్టిఫికెట్, ట్రోఫీను అందజేశారు. గతంలో ఐఐఎం నుంచి పలువురు అధ్యాపకులు ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు. స్టేట్ యూనివర్సిటీకి చెందిన అధ్యాపకురాలికి ఈ అవార్డు దక్కడం గమనార్హం. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం చరిత్రలో మైలు రాయిగా నిలుస్తుందని డా. ప్రశాంత ఆత్మ పేర్కొన్నారు. సీనియర్ ప్రొఫెసర్‌గా 93 పరిశోధన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 15 మంది పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలంగాణలోని దూర విద్యా కేంద్రం 30 పాఠ్యపుస్తకాలను రాశారు. 2022 జూన్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ డీన్‌గా పదవీ విరమణ చేశారు.

నిమ్స్‌లో దిద్దుబాటు చర్యలు..

- ఖజానాకు చేటు తెచ్చే వ్యాపార సంస్థలపై ఆగ్రహం
- పాలనాపరమైన అంశాలపై డైరెక్టర్ అజమాయిషీ



లక్డీకాపూల్ : నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) యాజమాన్యం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పాలనాపరంగా నెలకొంటున్న అవకతవకలను చక్కదిద్దడంపై ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప దృష్టి సారించారు. గత ఏడేళ్లుగా ఆస్పత్రిలో కొరవడిన డైరెక్టర్ విజిట్‌ను అమలులోకి తీసుకువచ్చారు. దీంతో ఆస్పత్రిలో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. నెల రోజుల్లో ఆయన పార్కింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించారు. ఆంధ్రాబ్యాంక్ ముందు ఏర్పాటు చేసిన టూ వీలర్ పార్కింగ్‌ను కూడా ఫోర్‌వీలర్ పార్కింగ్ ప్రాంతానికి తరలించారు. అదే విధంగా సంస్థకు నష్టం చేకూర్చే అంశాలను చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో అతి తక్కువ అద్దెతో, అసలు అద్దె లేకుండా నడుస్తున్న వ్యాపార సంస్థలను పరిశీలించారు. ఆస్పత్రి ఉన్నతాధికారుల అండదండలు, గత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సిఫార్సులతోనే వ్యాపార కేంద్రాలను విస్తరించినట్లు ఆయన గుర్తించారు. నెలకు రూ. 45 వేల అద్దెకు జిరాక్స్ సెంటర్‌ను కేటాయించగా, అసలు అద్దె లేకుండా టీ స్టాల్, కిరాణా షాపులను నిర్వహించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయ డైరీలో నీళ్లు, బిస్కెట్లు, కిరాణా వస్తువులు విక్రయిస్తుండటంపై నిర్వాహకుడు వెంకటేశ్వరావును నిలదీశారు. సోమవారంలోగా షాప్‌లో రోగులకు వేడి వేడి పాలను మాత్రమే సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రూ. లక్షలు అద్దె వచ్చే షాపులను కేవలం రూ. 7వేలకు కేటాయించింది వ్యాపార ప్రయోజనాల కోసం కాదని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో మరుగుదొడ్ల నిర్వహణ నిమిత్తం నిర్వాహకుల నుంచి నెలకు రూ. 2లక్షలు వసూలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా డైరెక్టర్ చర్యలపై ఆస్పత్రిలో టెండర్ పద్ధతిపై కొనసాగుతున్న ఆయా క్యాంటీన్ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కొలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పలకాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్ళిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకపక లాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.





సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 1-1-2023



* ఎంపిక

న్యూఇయర్ గిఫ్ట్

న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్త బుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.





పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.



క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.



రీ సైకింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యూవెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.

బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.

ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.



ముగ్గు ముచ్చట



21 చుక్కలు : 21 వరసలు



మద్దల పద్మావతి
పెందోటవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు : 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు

2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంకె కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలపగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.



1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహంభావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, విద్యలో పూర్తి చేయని కోర్సులు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్యలోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజయోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.

8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.



రామ్‌కుమార్ శుభారంభం

టాటా ఓపెన్ మహారాష్ట్ర ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో భారత ప్లేయర్లు యూకీ బాంబ్రీ, రామ్‌కుమార్ రామనాథన్‌లు మెయిన్ 'డ్రా'కు అర్హత పొందడానికి విజయం దూరంలో నిలిచారు. పుణేలో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో యూకీ 6-2, 6-2తో డీగో హిడాల్గో (ఈక్వెడార్)పై గెలుపొందగా... రామ్‌కుమార్ 2-6, 7-5, 6-2తో ప్రపంచ 175వ ర్యాంకర్ ఒటో విర్టానెన్ (ఫిన్‌లాండ్)పై సంచలన విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు.



రాఫెల్ నాదల్‌కు చుక్కెదురు

స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ 2022 సంవత్సరాన్ని ఓటమితో ముగించాడు. సిడ్నీలో జరుగుతున్న యునైటెడ్ కప్ మిక్స్‌డ్ టీమ్ టోర్నీలో భాగంగా శనివారం బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్ 0-2తో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో రెండో ర్యాంకర్ నాదల్ 6-3, 3-6, 4-6తో 14వ ర్యాంకర్ కామెరాన్ నోరీ చేతిలో ఓడిపోయాడు. గతంలో నోరీతో జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో నాదల్ ఈ బ్రిటన్ ప్లేయర్ చేతిలో తొలిసారి ఓడిపోవడం గమనార్హం.

ప్రమాదంతో పంత్ కెరీర్‌కు దెబ్బ!



డెహ్రాడూన్: భారత స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ ఇప్పట్లో మళ్లీ బ్యాట్ పట్టి మైదానంలో బరిలోకి దిగే అవకాశాలు కనిపించడంలేదు. శుక్రవారం ఉదయం ఢిల్లీ-డెహ్రాడూన్ హైవేపై పంత్ కారు ప్రమాదంలో గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం డెహ్రాడూన్‌లోని మాక్స్ ఆసుపత్రిలో పంత్ చికిత్స తీసుకుంటున్నాడు. కారు ప్రమాదంలో 25 ఏళ్ల పంత్ కుడి కాలి లిగ్మెంట్ స్థానభ్రంశం అయింది. పంత్ నుదురు భాగంలో, కుడి చేతి మణికట్టు వద్ద, వీపు భాగంలో, చీలమండకూ గాయాలయ్యాయి. రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో క్రీడా గాయాల విభాగానికి చెందిన డాక్టర్ కమర్ ఆజమ్ మాట్లాడుతూ పంత్ గాయాల నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కనీసం మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని వివరించారు. కుడి కాలి లిగ్మెంట్ గాయం తీవ్రత ఎక్కువగా ఉంటే పంత్ కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశముందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే నాలుగు టెస్టుల సిరీస్‌కు పంత్ దూరం కానున్నాడు. ఆ తర్వాత ఏప్రిల్-మే నెలలో జరిగే ఐపీఎల్ టి20 టోర్నీలో కూడా పంత్ ఆడేది అనుమానమే. ఐపీఎల్ టోర్నీలో పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇప్పటి వరకు పంత్ 33 టెస్టులు ఆడి ఐదు సెంచరీలు, 11 అర్ధ సెంచరీల సహాయంతో 2,271 వరుగులు చేశాడు. అంతేకాకుండా 30 వన్డేల్లో, 66 టి20ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

సౌదీ అరేబియా క్లబ్‌తో రొనాల్డో ఒప్పందం

- 2025 వరకు అల్ నాసర్ క్లబ్ తరఫున బరిలోకి
- ఏడాదికి రూ. 1,755 కోట్లు ఆర్జించనున్న పోర్చుగల్ స్టార్



మాడ్రిడ్: తన 20 ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో యూరోప్‌లోని విఖ్యాత క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించిన పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తొలిసారి ఆసియాకు చెందిన ఫుట్‌బాల్ క్లబ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌కు చెందిన మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్‌తో తెగదెంపులు చేసుకున్న రొనాల్డో... తాజాగా సౌదీ అరేబియాకు చెందిన అల్ నాసర్ క్లబ్‌తో రెండున్నరేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. రొనాల్డో ఒప్పందం మొత్తాన్ని అల్ నాసర్ క్లబ్ అధికారికంగా వెల్లడించలేదు. అయితే ఈ ఒప్పందం ద్వారా రొనాల్డో ఏడాదికి 20 కోట్ల యూరోలు (రూ. 1,755 కోట్లు) ఆర్జిస్తాడని సమాచారం. ఫలితంగా ఇది ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక ఒప్పందం కానుంది. 37 ఏళ్ల రొనాల్డో 2025 జూన్ వరకు అల్ నాసర్ క్లబ్ తరఫున సౌదీ ప్రొ లీగ్‌లో ఆడతాడు. గతంలో సౌదీ ప్రొ లీగ్ టైటిల్‌ను అల్ నాసర్ క్లబ్ తొమ్మిదిసార్లు సాధించింది. 'మరో దేశంలో కొత్త ఫుట్‌బాల్ లీగ్ ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. యూరోపియన్ ఫుట్‌బాల్‌లోని అన్ని ప్రముఖ టైటిల్స్‌ను సాధించాను. ఇక ఆసియా ఆటగాళ్లతోనూ నా అనుభవాన్ని పంచుకోవడానికి ఇదే సరైన సమయమని భావిస్తున్నాను' అని రొనాల్డో వ్యాఖ్యానించాడు. మాడ్రిడ్‌లో జరిగిన కార్యక్రమంలో తాను ధరించనున్న ఏడో నంబర్ జెర్సీని అల్ నాసర్ క్లబ్ అధ్యక్షుడు ముసాలి అల్ ముమార్‌తో కలిసి రొనాల్డో ఆవిష్కరించాడు.

6 ప్రొఫెషనల్ ఫుట్‌బాల్‌లో రొనాల్డో ప్రాతినిధ్యం వహించిన క్లబ్‌ల సంఖ్య. గతంలో రొనాల్డో స్పోర్టింగ్ లిస్బన్ (పోర్చుగల్: 2002-2003), మాంచెస్టర్ యునైటెడ్ (ఇంగ్లండ్: 2003 నుంచి 2009 వరకు; 2021 నుంచి 2022 వరకు), రియల్ మాడ్రిడ్ (స్పెయిన్: 2009 నుంచి 2018 వరకు), యువెంటస్ (ఇటలీ: 2018 నుంచి 2021) తరఫున పోటీపడ్డాడు. తాజాగా అల్ నాసర్ క్లబ్‌కు ఆడనున్నాడు.

అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్
జనవరి 14 నుంచి 29 వరకు
వేదిక: దక్షిణాఫ్రికా
మొత్తం జట్లు: 16

ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్
ఫిబ్రవరి 10 నుంచి 26 వరకు
వేదిక: దక్షిణాఫ్రికా
మొత్తం జట్లు: 10



భారత పురుషుల క్రికెట్ జట్టు షెడ్యూల్
భారత్‌లో శ్రీలంక పర్యటన
జనవరి 3 నుంచి 15 వరకు
3 టి20లు, 3 వన్డేలు

భారత్‌లో న్యూజిలాండ్ పర్యటన
జనవరి 18 నుంచి ఫిబ్రవరి 1 వరకు
3 వన్డేలు, 3 టి20లు

భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన
ఫిబ్రవరి 9 నుంచి మార్చి 22 వరకు
4 టెస్టులు, 3 వన్డేలు

ఐపీఎల్ టి20 టోర్నీ
ఏప్రిల్-మే

వెస్టిండీస్‌లో భారత్ పర్యటన
జూలై-ఆగస్టు
2 టెస్టులు, 3 వన్డేలు, 3 టి20లు

మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీ
జూలై 20 నుంచి ఆగస్టు 20 వరకు
వేదిక: ఆస్ట్రేలియా, న్యూజిలాండ్
మొత్తం జట్లు: 32

ఆసియా క్రీడలు
వేదిక: హాంగ్జౌ (చైనా)
సెప్టెంబర్ 23- అక్టోబర్ 8

ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడలు
వేదిక: చెంగ్డూ (చైనా)
జూలై 28 నుంచి ఆగస్టు 8 వరకు


ఏడాదంతా ఆడేద్దాం!

వచ్చేసింది 2023... క్రీడాభిమానులకు ఆటల విందు మోసుకొని వచ్చేసింది.... ఆద్యంతం ఆస్వాదించడానికి సిద్ధంగా ఉండాలని చెప్పేందుకు వచ్చేసింది... ముందుగా హాకీ ప్రపంచకప్ మెగా ఈవెంట్‌తో కొత్త ఏడాది మొదలుకానుంది... ఆ తర్వాత తొలిసారి అమ్మాయిలకు నిర్వహిస్తున్న అండర్-19 టి20 ప్రపంచకప్ కనువిందు చేయనుంది... అనంతరం మహిళల టి20 ప్రపంచకప్‌తో ధనాధాన్ ధమాకా కనిపించనుంది... మండే వేసవిలో వినోదం పంచడానికి ఐపీఎల్ టోర్నీ... శీతాకాలంలో వన్డే వరల్డ్‌కప్.... కేవలం క్రికెట్టే కాదు... పంచ్ పవర్ చాటిచెప్పడానికి ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్... 'పట్టు'పట్టడానికి ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్... 'రాకెట్'తో రఫ్ఫాడించేందుకు బ్యాడ్మింటన్, టెన్నిస్ టోర్నీలు... 'రయ్ రయ్' అంటూ సాగిపోయే ఫార్ములావన్ రేసులు... ఇంకా ఎన్నో... ఎన్నెన్నో టోర్నీలు మనను అలరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరెందుకు ఆలస్యం... మీ క్యాలెండర్‌లోనూ ఈ ఈవెంట్స్‌ను జత చేయండి... తప్పకుండా చూడండి! -సాక్షి క్రీడావిభాగం



ఫార్ములావన్

ఈ ఏడాది ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌లో మొత్తం 23 రేసులు ఉన్నాయి. మార్చి 5న బహ్రెయిన్ గ్రాండ్‌ప్రితో సీజన్ మొదలవుతుంది. అనంతరం వరుసగా బహ్రెయిన్ (మార్చి 5), సౌదీ అరేబియా (మార్చి 19), ఆస్ట్రేలియా (ఏప్రిల్ 2), అజర్‌బైజాన్ (ఏప్రిల్ 30), మయామి (మే 7), ఎమిలియా రొమాగ్నా (మే 21), మొనాకో (మే 28), స్పెయిన్ (జూన్ 4), కెనడా (జూన్ 18), ఆస్ట్రియా (జూలై 2), బ్రిటన్ (జూలై 9), హంగేరి (జూలై 23), బెల్జియం (జూలై 30), డచ్ (ఆగస్టు 27), ఇటలీ (సెప్టెంబర్ 3), సింగపూర్ (సెప్టెంబర్ 17), జపాన్ (సెప్టెంబర్ 24), ఖతర్ (అక్టోబర్ 8), యూఎస్‌ఏ (అక్టోబర్ 22), మెక్సికో (అక్టోబర్ 29), సావోపాలో (నవంబర్ 5), లాస్‌వేగస్ (నవంబర్ 18) రేసులు జరుగుతాయి. నవంబర్ 26న అబుదాబి గ్రాండ్‌ప్రితో ఎఫ్1 సీజన్ ముగుస్తుంది.



పురుషుల ప్రపంచకప్ హాకీ టోర్నీ
వేదిక: భువనేశ్వర్, రూర్కెలా (భారత్)
జనవరి 13 నుంచి 29 వరకు
మొత్తం జట్లు: 16

బ్యాడ్మింటన్

ఇండియా ఓపెన్ సూపర్-750 టోర్నీ
వేదిక: న్యూఢిల్లీ
జనవరి 17 నుంచి 22 వరకు

ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ సూపర్-1000 టోర్నీ
వేదిక: బర్మింగ్‌హామ్
మార్చి 14 నుంచి 19 వరకు



సుదిర్మన్ కప్ టోర్నీ
వేదిక: సుజౌ (చైనా)
మే 14 నుంచి 21 వరకు

ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000 టోర్నీ
వేదిక: జకార్తా
జూన్ 13 నుంచి 18 వరకు

చైనా ఓపెన్ సూపర్-1000 టోర్నీ
వేదిక: చెంగ్జూ
సెప్టెంబర్ 5 నుంచి 10 వరకు

ప్రపంచ చాంపియన్‌షిప్
వేదిక: కోపెన్‌హాగెన్ (డెన్మార్క్)
ఆగస్టు 21 నుంచి 27 వరకు

ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్
వేదిక: దుబాయ్ (యూఏఈ)
ఫిబ్రవరి 14 నుంచి 19 వరకు

ఆసియా చాంపియన్‌షిప్
వేదిక: దుబాయ్ (యూఏఈ)
ఏప్రిల్ 25 నుంచి 30 వరకు

సయ్యద్ మోదీ ఓపెన్ సూపర్-300 టోర్నీ
వేదిక: లక్నో (భారత్)
నవంబర్ 28 నుంచి డిసెంబర్ 3 వరకు

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్
వేదిక: బుడాపెస్ట్ (హంగేరి) ఆగస్టు 19 - 27



పురుషుల వన్డే ప్రపంచకప్
అక్టోబర్-నవంబర్ వేదిక: భారత్ మొత్తం జట్లు: 10

టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలు

ఆస్ట్రేలియన్ ఓపెన్
వేదిక: మెల్‌బోర్న్: జనవరి 16 - 29

ఫ్రెంచ్ ఓపెన్
వేదిక: పారిస్: మే 28 - జూన్ 11

వింబుల్డన్
వేదిక: లండన్: జూలై 3 -17

యూఎస్ ఓపెన్
వేదిక: న్యూయార్క్ : ఆగస్టు 28 -సెప్టెంబర్ 10

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్
వేదిక: బెల్‌గ్రేడ్ (సెర్బియా):
సెప్టెంబర్ 16 -24

ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్
వేదిక: న్యూఢిల్లీ
మార్చి 15 -31




ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్
వేదిక: తాష్కెంట్ (ఉజ్బెకిస్తాన్)
మే 1 - 14

సినిమా

స్టార్ క్యాలెండర్

కొత్త సంవత్సరం వచ్చేసింది. కొత్త సినిమా అప్‌డేట్స్ కోసం సినీ లవర్స్ ఎదురు చూస్తుంటారు. అలాగే తమ అభిమాన స్టార్ ఏయే సినిమాలు చేస్తున్నారో తెలుసుకోవాలని ఫ్యాన్స్‌కు ఉంటుంది. ఆ విశేషాలు 'స్టార్ క్యాలెండర్'లో తెలుసుకుందాం.



చిరంజీవి: ఈ సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య'గా జనవరి 13న రానున్నారు హీరో చిరంజీవి. ఇక చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న 'భోళా శంకర్' ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. మరోవైపు చిరంజీవి హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుందనే ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే.

* * *

బాలకృష్ణ: ఈ సంక్రాంతికి 'వీరసింహారెడ్డి'గా జనవరి 12న రానున్నారు బాలకృష్ణ. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వంలోని సినిమాతో బిజీగా ఉంటారు.

* * *

వెంకటేశ్: కొన్ని కథలు విన్నప్పటికీ ఏ ప్రాజెక్ట్ ఫైనలైజ్ చేయలేదు. కానీ హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'కీసీ కా బాయ్.. కీసీ కా జాన్'లో వెంకీ కీ రోల్ చేశారు. ఈ మూవీ రంజాన్‌కి రిలీజ్ కానుంది.

* * *

నాగార్జున: కొన్ని కథలు విన్నప్పటికీ ఇంకా ఏ ప్రాజెక్ట్‌కీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.

మోహన్‌బాబు: కుమార్తె మంచు లక్ష్మీతో కలిసి ప్రతీక్ ప్రజోష్ దర్శకత్వంలో మోహన్‌బాబు 'అగ్నినక్షత్రం' సినిమాలో నటిస్తున్నారు. సమంత టైటిల్ రోల్ చేసిన 'శాకుంతలం'లో మోహన్‌బాబు కీ రోల్ చేశారు.

* * *

రవితేజ: ఈ ఏడాది రవితేజ ఫుల్ బిజీ. ఇప్పటికే రవితేజ హీరోగా 'రావణాసుర', 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. అలాగే 'ఈగిల్' అనే కొత్త సినిమా కమిట్ అయినట్లు వార్తలు ఉన్నాయి. సుధీర్ వర్మ దర్శకత్వంలోని 'రావణాసుర' ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది. ఇక 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ కీ రోల్ చేసిన విషయం తెలిసిందే.

* * *

పవన్ కల్యాణ్: క్రిష్ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' చిత్రంలో హీరోగా టైటిల్ రోల్ చేస్తున్నారు పవన్ కల్యాణ్. అలాగే 'గబ్బర్‌సింగ్' తర్వాత హరీష్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్' అనే సినిమా చేస్తున్నారు పవన్. యువ దర్శకుడు సుజిత్ తెరకెక్కించే సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే.

* * *

గోపీచంద్: దర్శకుడు శ్రీవాస్‌తో ఓ మూవీ చేస్తున్నారు గోపీచంద్. దీనికి 'లక్ష్యం 2', 'రామబాణం' టైటిల్స్ తెరపైకి వచ్చాయి.

* * *

రాజశేఖర్: పవన్ సాధినేని దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'మాన్‌స్టర్' చేస్తున్నారు రాజశేఖర్.

* * *

ప్రభాస్: ప్రభాస్ ప్రస్తుతం నాగ్ అశ్విన్‌తో ప్రాజెక్ట్ కె, 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో 'సలార్', మారుతితో 'రాజా డీలక్స్' (అధికారికంగా ప్రకటించాల్సి ఉంది) చిత్రాలు చేస్తున్నారు. అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కనుంది. ఇక ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటించిన 'ఆదిపురుష్' పూర్తయింది. ఓం రౌత్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రం జూన్ 16న రిలీజ్ కానుంది. 'సలార్' సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది.

* * *

మహేశ్‌బాబు: త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఇది పూర్తి కాగానే రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఇంటర్నేషనల్ లెవల్ ఫిల్మ్‌లో హీరోగా నటిస్తారు మహేశ్.

ఎన్టీఆర్: కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా రూపుదిద్దుకోనున్న సినిమా సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ఈ చిత్రం తర్వాత 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ హీరోగా ఓ సినిమా రూపొందనుంది.

* * *

రామ్‌చరణ్: శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా తర్వాత 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనతో ఓ సినిమా చేస్తారు చరణ్. అలాగే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా ప్రకటన వచ్చింది.

* * *

అల్లు అర్జున్: ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప 2' చేస్తున్నారు అల్లు అర్జున్. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా రిలీజ్ కానున్నట్లుగా తెలుస్తోంది. కాగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా, వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'ఐకాన్' సినిమా అల్లు అర్జున్ కమిట్ అయిన సంగతి తెలిసిందే.

* * *

నాని: శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'దసరా' చిత్రం చేస్తున్నారు నాని. మార్చి 30న రిలీజ్ కానుంది. అలాగే తన కొత్త చిత్రాన్ని నాని ఈ రోజు ప్రకటిస్తారు.

* * *

రామ్: ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు రామ్.

నాగచైతన్య: వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో 'కస్టడీ' చిత్రం చేస్తున్నారు నాగచైతన్య. ఈ సినిమా మేలో రిలీజ్ కానుంది. ఇక పరశురామ్ దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ సినిమా ప్రకటన వచ్చిన విషయం గుర్తుండే ఉంటుంది.

* * *

విజయ్ దేవరకొండ: ప్రస్తుతం 'ఖుషి' సినిమా చేస్తున్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకుడు. కాగా విజయ్ దేవరకొండ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ హీరోగా 'జేజీఎమ్' (జన గణ మన) షూటింగ్ ఆరంభమైంది. ఈ సినిమాపై మరో అప్‌డేట్ రావాల్సి ఉంది.

* * *

నందమూరి కల్యాణ్‌రామ్: ప్రస్తుతం 'అమిగోస్', 'డెవిల్' చిత్రాలు చేస్తున్నారు కల్యాణ్‌రామ్. ఫిబ్రవరిలో విడుదల కానున్న 'అమిగోస్' చిత్రానికి రాజేంద్రరెడ్డి దర్శకుడు. 'డెవిల్' సినిమాకు నవీన్ మేడారం డైరెక్టర్. అలాగే కేవీ గుహన్‌తో ఓ సినిమా కమిట్ అయ్యారు.

* * *

శర్వానంద్: కృష్ణచైతన్య దర్శకత్వంలో ఓ సినిమా కమిటయ్యారు శర్వానంద్.

* * *

రానా దగ్గుబాటి: దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించనున్న మైథలాజికల్ ఫిల్మ్ 'హిరణ్యకశ్యప'లో రానా టైటిల్ రోల్ చేయనున్నట్లు గతంలో ప్రకటించారు. అలాగే మిలింద్ రావ్ దర్శకత్వంలో రానా హీరోగా ఓ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే.

* * *

అల్లరి నరేశ్: 'నాంది' సినిమాతో తనకు మంచి హిట్ ఇచ్చిన దర్శకుడు విజయ్ కనకమేడల డైరెక్షన్‌లో అల్లరి నరేశ్ 'ఉగ్రం' అనే సినిమా చేస్తున్నారు. అలాగే 'సభకు నమస్కారం' అనే సినిమా కూడా కమిట్ అయ్యారు నరేశ్. ఈ చిత్రానికి సతీష్ దర్శకుడు.

* * *

నితిన్: వక్కంతం వంశీ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా ఫిల్మ్ షూటింగ్‌లో నితిన్ పాల్గొంటున్నారు.

* * *

వరుణ్ తేజ్: దర్శకుడు ప్రవీణ్ సత్తారుతో ఓ యాక్షన్ ఫిల్మ్, కొత్త దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్‌తో ఎయిర్‌ఫోర్స్ యాక్షన్ బేస్డ్ ఫిల్మ్ చేస్తున్నారు వరుణ్ తేజ్. శక్తి ప్రతాప్‌తో చేస్తున్నది వరుణ్‌కి హిందీలో తొలి సినిమా.

* * *

అఖిల్: సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ఏజెంట్'తో బిజీగా ఉన్నారు అఖిల్.

* * *

సుధీర్‌బాబు: 'హంట్', 'మామా మశ్చీంద్ర' సినిమాలు చేస్తున్నారు సుధీర్‌బాబు. జనవరి 26న విడుదల కానున్న 'హంట్' మూవీకి మహేశ్ సూరపనేని దర్శకత్వం వహించగా, 'మామా మశ్చీంద్ర' సినిమాకు హర్షవర్ధన్ దర్శకుడు. అలాగే జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో 'హరోం హర' అనే సినిమా చేస్తున్నారు సుధీర్‌బాబు.

* * *

నిఖిల్: ఎడిటర్ గ్యారీ బీహెచ్ మెగాఫోన్ పట్టి తెరకెక్కిస్తున్న 'స్పై' చిత్రంలో నటిస్తారు నిఖిల్. అలాగే దర్శకుడు సుధీర్ వర్మతోనూ నిఖిల్ ఓ సినిమా చేస్తున్నారు.

* * *

సాయిధరమ్ తేజ్: సాయిధరమ్ తేజ్ తాజా చిత్రం 'విరూపాక్ష'. కార్తీక్ దండు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది. అదే విధంగా జయంత్ అనే కొత్త దర్శకుడితో కూడా ఓ సినిమా చేస్తున్నారు సాయిధరమ్ తేజ్.

* * *

బెల్లంకొండ సాయి శ్రీనివాస్: 'ఛత్రపతి' హిందీ రీమేక్ షూటింగ్‌ను దాదాపు పూర్తి చేశారు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. హిందీలో సాయి శ్రీనివాస్‌కు ఇది తొలి చిత్రం కాగా, ఈ చిత్రదర్శకుడు వీవీ వినాయక్‌కు కూడా అక్కడ దర్శకుడిగా ఇదే తొలి చిత్రం.

* * *

వైష్ణవ్ తేజ్: కొత్త దర్శకుడు శ్రీకాంత్ ఎన్. రెడ్డి తెరకెక్కిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీలో హీరోగా నటిస్తున్నారు వైష్ణవ్ తేజ్.

* * *

అడివి శేష్: తన కెరీర్‌లో వన్నాది బెస్ట్ హిట్స్‌గా నిలిచిన 'గూఢచారి' సినిమా సీక్వెల్ 'గూఢచారి 2'లో నటిస్తున్నారు అడివి శేష్. ఈ సినిమాకు వినయ్ కుమార్ దర్శకుడు.

* * *

నాగశౌర్య: అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో నాగశౌర్య హీరోగా చేసిన 'ఫలానా అబ్బాయి... ఫలానా అమ్మాయి' సినిమా విడుదలకు రెడీగా ఉంది. అలాగే 'పోలీసువారి హెచ్చరిక'తో పాటు మరో సినిమా చేస్తున్నారు నాగశౌర్య.

* * *

సందీప్ కిషన్: రంజిత్ జయకొడి దర్శకత్వంలో 'మైఖేల్', వీఐ ఆనంద్ దర్శకత్వంలో 'ఊరిపేరు భైరవకోన' సినిమాలు చేస్తున్నారు సందీప్ కిషన్. అలాగే ధనుష్ హీరోగా చేస్తున్న 'కెప్టెన్ మిల్లర్' చిత్రంలో ఓ కీ రోల్ చేస్తున్నారు.

* * *

సిద్ధు జొన్నలగడ్డ: హిట్ ఫిల్మ్ 'డీజే టిల్లు' సీక్వెల్ 'డీజే టిల్లు' స్క్వేర్‌లో నటిస్తున్నారు సిద్ధు జొన్నలగడ్డ. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది మార్చిలో రిలీజ్ కానుంది.

* * *

నవీన్ పొలిశెట్టి: అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో పి. మహేశ్‌బాబు ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. అలాగే నవీన్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'అనగనగా ఒక రాజు'ను కల్యాణ్ శంకర్ తెరకెక్కిస్తున్నారు.

* * *

బెల్లంకొండ గణేష్: రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో బెల్లంకొండ గణేష్ చేసిన 'నేను స్టూడెంట్ సర్' చిత్రం రిలీజ్‌కు సిద్ధంగా ఉంది.

* * *

వీరితోపాటు మరికొందరు హీరోలు ఆన్ సెట్స్‌లో బిజీగా ఉంటారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు /5'7"/Fair/36 సం॥ల వరుడుకు కుల ప్రసక్తి లేని (SC,ST మినహా) 1st, or 2nd మ్యారేజ్ వధువు కావలెను. Ph: 6305042436, 7396730091 [H-776384]

పద్మశాలి/ M.Tech,IIT/SWE/24Lakhs PA/5'9" ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908209244 [HA-13146]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM / 5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13146]

రజక/కట్నం ప్రసక్తి లేదు/MBA/Govt. గ్రూప్-II ఆఫీసర్/హాస్టల్ వెల్ఫేర్ Dept/50,000/-PM/5'11"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-10014]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. కస్టమ్స్ ఇన్స్పెక్టర్/కస్టమ్స్ Dept/80,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-10014]

వాల్మీకి బోయ/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. ఫీల్డ్ ఆఫీసర్/ FCI/ 50,000/-PM/5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-10014]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/M.Com/ C.Govt.మేనేజర్/కెనరా బ్యాంక్/1 Lakh PM/5'11"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-10014]

2వ పెళ్ళి /కుల పట్టింపు లేదు/45y/PG, Govt.ఆఫీసర్/3 లక్షలు PM పిల్లలు లేని తెల్లని అందమైన వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను (పిల్లలున్నా OK) Ph: 7396213324 [H-776384]

మాల/29y/5'10"/M.Tech(NIT)/Central Govt. Employee(Railway)/12 Lakhs P/A/వరుడికి తగిన వధువు కావలెను. No Brokers. Ph: 9493285326 [H-776499]

వడ్డెర/విడోయర్ /36 / 5'6"/Business/ 40,000/-PM / పిల్లలు గల వరుడికి తగిన సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. (కుల ప్రసక్తి లేదు). Ph: 7995032262 [H-776499]

Mala/29 సం॥/5'11"/B.Tech/ M.Tech/ IIM/SWE \ Job /25 L P/A Well Settled Family వరుడికి తగిన వధువు కావలెను. 7702195227 కట్నం ప్రసక్తి లేదు. [HA-10730]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు / B.Tech, IIT/ C.Govt. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్/90,000/-PM/ 5'10"ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-13148]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/CA/ అకౌంటెంట్ / 80,000/-PM / 5'10"ఎత్తు / 28 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-13148]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Business / Good Industry/ B.Tech /1997/5'11"/Very Handsome Boy/ 75Cr * Cont : K.C. Reddy- Hyd. Ph: 9849321309 /9347807015

Reddy/USA-Citizen/BS/Business/Own Company / 1995 / 5'10" /Very Handsome Boy/70Cr/200K. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/Divorcee/B.Tech/MBA/Job & Business / Fair / 1994 / 5'10"/200Cr. * Cont : K.C. Reddy - B.Hills- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Now in Hyd/B.Tech/MS/H1/ USA/1991/5'11" /140K /200Cr. *1989/ 5'7"/100K/100Cr.*Cont: K.C. Reddy- Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/Job-Hyd-24L /Yr/100Cr/Father-Burocrat. * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/MBA/UK/Business-Hyd/ Handsome Boy/1994 /5'11" / 250Cr. * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Business/B.Tech/MBA/Very Handsome Boy/1995/6'Feet/ 100Cr /3L/M/Rental income/Hyd.* Cont: K.C. Reddy Ph: 9849321309/9347807015

Reddy/ Business/B.Tech/1990/6'/ 1000Cr/Handsome Boy.* Cont : K.C. Reddy-Mar-Bureau-B.Hills- Hyd. Ph:9849321309/9347807015

Reddy/MBBS/MD / 1995/5'10" /300Cr.* 1994/5'9"/ 50Cr. *1994/5'9"/ 75Cr. * USA Doct - 1989/5'9". *1992/5'11". * 1988/6'. * Cont:K.C. Reddy- Hyd. Ph:9849321309

Reddy/B.Tech/IIT/MS/USA/230K/ Rich Family/1994/5'7"/ *IIT/Job India/ 1992/5'9"/25L/yr. * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/Divorcee/BDS-Doc / USA/ 1995 / 5'5" / 8Cr/Needs USA alliance & Well Settled. * Cont : K.C. Reddy- Hyd. Ph: 9849321309

Reddy/BE/(NIT)/MBA/Most Beautiful /1996/5'9"/10Cr.* Need Good Alliance India or Abroad. *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful/Rich. *LLM/1995/5'3"/150Cr.*MS/1996/5'9"/ 100 Cr. *BBA/1997/5'4"/100Cr. *1994/ 5'6"/ 100Cr. *1995/5'8"/100Cr * 9347807015

Reddy/ MS/ INDIA/ 1994/ 5'3"/ 200Cr/ * MBA/ 1988/ 5'3"/ 200Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/1998/5'7"/50Cr. *1996/5'8"/40 Cr. *1999/5'4"/200Cr. *1995 / 5'2"/ 50Cr. * PG/1995/ 5'7"/20Cr.*1995/5'5"/50Cr.*1997/ 5'3"/25Cr. * Cont: Ph: 9849321309

Reddy/MBBS/PG. *1994/5'3"/75Cr. *1993/ 5'3"/50Cr. *1990/100Cr. *1993/5'7"/100Cr. *1994/5'4"/50Cr. *1994/5'10"/50Cr. *1996/ 5'4"/50Cr. Cont: K.C. Reddy. Ph: 9849321309

Reddy/B.Tech/ MS/ USA/1997/5'5"/10Cr. *1996/5'8"/15Cr. 1996/5'7"/50Cr. 1990/ 5'8"/100Cr. 1996/5'5"/15Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Most Beautiful/1996/5'9"/100Cr. *1990/ 5'8" /160K/100Cr. *1996/5'7"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/ MBA/Most Beautiful/(Father Burocrat)/1995/5'5"/70Cr * Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech / 1994 / 5'6"/ 100Cr * 1995/ 5'8"/ 100Cr.* Cont: K.C. Reddy- Mar-Bureau-Road No.3, B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015

[D-427]

కాపు/52yrs/Govt.ఎంప్లాయి నెలకు ఆదాయం లక్ష రూపాయలు సొంత ఇల్లు, భార్య లేని వరుడికి కుల ప్రసక్తి లేని వధువు కావలెను. అర్జెంట్. Ph: 8179207047 [HA-13148]

Cast No Bar/2nd Match/49yrs/ Private Job/Well Settled/40,000/-PM గల వరునికి వధువు కావలెను. పిల్లలు ఉన్నా OK. Direct : 7774891975 [HA-13148]

SC మాదిగ/B.Tech/C.Govt. Sr. ఇంజనీర్ /రైల్వే/80,000/-PM/ 5'10"ఎత్తు/31 సం॥ల అందమైన వరునికి అందమైన వధువు కావలెను. Ph: 7032058965 [HA-13148]

నాగిరెడ్డి/60Yrs/30K P/M/ప్రాపర్టీ 20L, *శ్రీనివాస్/53yrs/Govt. జాబ్/9.5K/10yr బాబు ప్రాపర్టీ కలదు. * శ్రీకాంత్/46Yrs/40K Own హౌస్. Ph: 8985647610 [H-787418]

సగర - ఉప్పర / 5.6"/42 సం॥ /Govt. జాబ్ / 1.2L PM. / వెల్ సెటిల్డ్ వరునికి తగిన, రిచ్ ఫ్యామిలీ / వెల్ సెటిల్డ్ OC / BC కులానికి చెందిన వధువు కావలెను. డైరెక్ట్: 6305381643, కర్నూలు. [A-752443]

రెడ్డి 35సం॥ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 10లక్షలు జీతం 1సం॥బి మంచి రంగు హైదరాబాద్, సొంత ఇల్లు ఎత్తు 5.11 వరునికి మంచి రంగు చదువు కున్న వధువు కావలెను. 9948733173 [G-732608]

Political- Software-Businessman, 56, OC Wants tall Business Life Partner Lady. 6360474663 Widow OK. [WB-46751]

★

ఆర్యవైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను కుల పట్టింపు లేదు మరియు రెండో పెండ్లి వారు కూడా సంప్రదించండి. డైరెక్టగా సంప్ర॥ 8790197318 [Y-753133]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 5' 10", 200 K, H1, 20 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 29, 5'6", Rich, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MS, 29, 5'9", Developer, 130 K, H1, 5 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 33, 5' 10", Sr Associate, 20 L P/A, 5 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 31, 5'7", UI Developer, 120 K, 8 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MTech, 28, 5'9", SWE, 24 L P/A, 6 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 10", PG Doctor, Rich, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce BE, MS, 31, 5'9", Sr SWE, 350 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 5' 4", Analyst, 150 K, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 24, 5' 7", SWE Developer, 80 K, 10 Cr, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 6", SWE, 12 L P/A, 2 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 2", SWE, 120 K, H1, USA, Rich, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5' 4", SWE, 50 Crores, Hyd, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 23, 5' 4", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, Doctor, 27, 5' 7", 25 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి DivorceBE, 28, 5' 3", 9 L P/A, Hyd, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 98480118

LETTER

★★

రెడ్డి/ (Hyd) Age : 36 / ఎత్తు : 5.4/ Software Employee, 70,000/- P.M గల వరునికి తోడుకొరకు అమ్మాయి కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 90597 78982 [L-793209]

హిందూ మాల / ఇంటర్ & డిప్లొమా / అసిస్టెంట్ ఇంజనీర్ ప్రైవేట్ కంపెని, 25 వేల జీతం, 5.7 ఎత్తు, 34 సం॥లు వరుడికి 30 సం॥లోపు ఇంటర్/డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. సంప్ర: 7729888789 [P-1213175]

BC/65+Y/Rtd.Govt.పెన్షనర్/Pm.50వేలు, వెల్ సెటిల్డ్ వారికి, కులప్రసక్తిలేని 50Y పైబడిన సాంప్రదాయ లైఫ్ పార్టనర్ (వధువు) కావలెను. కాంటాక్ట్ : 8886339797 [S-1182412]

Tall-Rich-Woman Wanted for 60 Brahmin IIT IIM USA UK Educated Working Man. 9113679022 [WB-46511]

వరుడు కావలెను



No Caste Bar/1, 2వ, 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం OK త్వరగా చూసుకునే వారి కోసం మాత్రమే. Ph: W: 7794960803 [H-776384]

క్రిస్టియన్ మాల/ M.Sc అగ్రికల్చర్ / Govt.Asst / అగ్రికల్చర్ Dept/35000/-PM/5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8374801504 [HA-13146]

క్రిస్టియన్ /2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/ B.Tech / Govt.AE / ఇరిగేషన్ Dept/70,000/-PM/5'4" ఎత్తు/35 సం॥ల పిల్లలులేని అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8374801504 [HA-13146]

క్రిస్టియన్ మాల/B.Tech/Govt.Asst. ఇంజినీర్/TSSPDCL/65000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-13146]

బొస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ B.Tech/C.Govt.P.O/SBI బ్యాంక్/42,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10014]

యాదవ/80 లక్షల ఆస్తి/B.Tech/C.Govt. ట్యాక్స్ ఆఫీసర్/కమర్షియల్ Dept/52,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10014]

విశ్వ బ్రాహ్మణ్/ఏకైక కుమార్తె/B.Tech/ Govt.Asst.ఇంజనీర్/ట్రాన్స్‌కో/46,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-10014]

SC హిందు మాల/50 లక్షల ఆస్తి/B.Tech/ Govt.ల్యాండ్ సర్వేయర్/రెవెన్యూ Dept/ 38,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-10014]

SC హిందు మాదిగ/B.Tech/C.Govt. Asst. మేనేజర్/ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 50,000/-PM/5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-10014]

కుమ్మరి/40 లక్షల ఆస్తి/B.Tech/Agri/Govt AEO/అగ్రికల్చర్ Dept/45,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-10014]

బ్రాహ్మణ/60y/విడో/5'3"/తెల్లని ఛాయ/ Govt.రిటైర్డ్/సొంత ఇల్లు/12 ఎకరాల మాగాణి/ బిజినెస్/2L/PM/ఏ బాదరబందిలేని, ఒంటరి వధువుకు వరుడు కావలెను. Ph: 9059150892 [H-776693]

వైశ్య/విడో/58y/5'3"/సెంట్రల్ గవర్నమెంట్ జాబ్/50,000/-PM/2 సొంత ఇల్లు/మిర్చి బిజినెస్/1 L/PMఆస్తి, కుల పట్టింపులేని వధువుకి వరుడు కావలెను. Ph: 8106358849 [H-776693]

FC/విడో/58y/ఎగ్రరివాయ/తక్కువ చదువు /సొంత బిజినెస్/4 వాటాల ఇల్లు గల వెల్ సెటిల్డ్ వధువుకు మంచి వ్యక్తిత్వం గల వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 9948402716 [H-776693]

కాపు నాయుడు/విడో/60y/తక్కువ చదువు/ సొంత ఇల్లు/2 ఇళ్ళు/3 ఎకరముల వరి పొలం గల సాంప్రదాయ వధువుకు కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9550629225 [H-776693]

రెడ్డి/విడో /60y/Govt.పెన్షనర్/రెండు చిన్న ఇళ్ళు/పంట పొలం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు స్నేహభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 8297484478 [H-776693]

2వ పెళ్ళి/కుల పట్టింపు లేదు/35y/ M.Sc.B.Ed, Govt.టీచర్/1 లక్ష PM/పిల్లలులేని తెల్లని అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (పిల్లలున్నా OK). Ph: 7396213324 [H-776384]

కుల పట్టింపు లేదు/విడో/48/5'4"/PG/ Govt.Job/VRS/50K PM/Own House/ Business/ Lands / 12Cr Property గల వధువుకు ఇల్లరికం/పిల్లలున్నా OK. 9052603925 [H-776384]

రెడ్డి/ విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు. A:30, Q: డిగ్రీ బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర: 9100717575 [HA-13148]

కమ్మ/Unmarried28y/5'5"/ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్/Coal & మైనింగ్ బిజినెస్/ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9515117629 [H-776499]

రెండో పెళ్ళి/విడో/45y/Govt.Job/Legislative Affairs/1.6L PM/సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ, 19 ఎ॥ ల్యాండ్స్ గల అందమైన వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9573275162 [H-776499]

SC మాదిగ/27 సం॥/5'5"/B.Tech/ MBA/ Govt.Job/DRDO/10L P/A/Well Settled Family వధువుకు తగిన వరుడు కావలెను. 6281925716 [HA-10730]

పద్మశాలి/25 సం॥/5'4"/ B.Tech/ IIT/SWE/Job/15L P/A Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 8897091964 [HA-10730]

Mala/Govt.Job/26 సం॥/5'4"/ B.Tech/MBA (Income Tax) 12L P/A అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 7702195227 [HA-10730]

యాదవ/B.Tech/C.Govt. బ్యాంక్ P.O/ కెనరా బ్యాంక్/70,000/-PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7842467951, 7075953400 [HA-13148]

SC మాల/ B.Tech / C.Govt.ప్రొబెషన్ ఆఫీసర్ / బ్యాంక్ ఆఫ్ ఇండియా/60,000/-PM / 5'4"ఎత్తు/27 సం॥ల అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 7032058965 [HA-13148]

యాదవ/B.Tech (EEE)/C.Govt. Asst. మేనేజర్/55000/-PM/బ్యాంక్ ఆఫ్ బరోడా/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515755529 [HA-13148]

బ్రాహ్మణ/30/5'2"/B.Com. & 34/5'2"/ ఇంటర్. *35/5'3"/B.Tech *36/5'4"/ఇంటర్. *38/ 5'4"/ డిగ్రీ వధువులకు జాబ్/బిజినెస్/ పురోహితం వరులు కావలెను. వాట్సాప్: 7893005879 [HA-13148]

రెడ్డి/విడో/38 సం॥/5'3"ఎత్తు/సొంత ఇల్లు/20 ఎకరాల పొలం/స్థిరాస్తి కలిగి పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. (ఆస్తి, కుల పట్టింపు లేదు). వాట్సాప్: 7207516654 [H-776385]

ఆర్యవైశ్య, పద్మశాలి, రెడ్డి, కాపు, కమ్మ, యాదవ్స్, నాయీబ్రాహ్మిన్స్, వధువులకు (Age: 25-55) జాబ్ / బిజినెస్ వరులు A.P / T.S లో కావలెను. Ph: 8121112471. [A-752442]

మాల : B.Tech. (IIT)., 5'6" / 35Y / V.Fair, 2 Cr. / నెలకు 2లక్షల జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు అర్జెంట్‌గా సంప్ర॥ సెల్ : 92484 94810, 81065 01199. [M-242]

WantedBride Grome for P.G. Medico/ 27 Years/ 5'.4", Fair/ ONLY Daughter of A Special Chief Secretary. Preferably decent family Dalith / Tamil / Telugu Civil Servant/ P.G. Doctor or well Established Industrialist/ Business Man with IIT/IIM Background. 9701735718/9959225451. [T-361]

వేదికలు



II Match/ విడో, డైవర్సీ, CNOB 25 సం॥ నుండి 65 సం॥ వరకు SWE/PVT/Govt. Job/మెడికోస్/మొదలగు వారికి సంబంధములు చూడబడును. 93916 46037 [HA-10730]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Shyam Ph: 6281389448/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13149]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anoop. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13149]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Anoop. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13149]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ: Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13149]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13149]

గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, యాత, శ్రీశైన మా కస్టమర్లకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. "శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో, DSNR, Hyd. S.రాములు గౌడ్. Ph: 8790690309 [H-776694]

15 రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల అతి పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, © 94418 29644, 94920 33897, 94407 85888W [B-934]

అన్నపూర్ణ మ్యారేజెస్: అన్ని కులముల వారికి లక్ష సంబంధములు కుదిర్చిన సంస్థ మాది. మీ ఇంటిలో కూడ పెళ్ళి సంబరాలు జరుపుకోవాలంటే మమ్మల్ని సంప్రదించండి. సెల్: 81849 11555 [G-3750]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులాల వారికీ 1వ/2వ/లేటు తగిన సంబంధాలు చూడబడును. స్త్రీలకు ప్రత్యేకం. ధృవ మ్యారేజెస్. 9949396407 [H-776729]

వడ్డెర వధూవరుల వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ, తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి : 9381553423 [HA-9564]

40 సంవత్సరాలుగా వేలాది సంబంధాలు కుదిర్చిన సంస్థ కాకతీయ మ్యారేజెస్, kaakateeya.com Ph: 7674868080, 9383999999. [HA-9559]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS / IPS / MBBS / MD /MCA/Abroad & Govt Job Holders సంప్ర: శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182 [H-792568]

రజక వివాహ వేదిక (1994)/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ Abroad/ USA/ UK/ B.Ed/ Govt Job సంబంధాలకై సంప్రదించండి ఫోన్: 8106303155/ 9391265304. [H-776499]

★

కరీంనగర్‌లో మాదిగ వివాహ పరిచయ వేదిక. 8/1/23 ఆదివారం 10-6PM ఫీ 1 వేయి ముందుగా మీ ఫోటో బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. Ph: 9347046175 [H-776690]

రెడ్డి పెళ్ళి సంబంధాలకై సంప్ర: Veryfied Profilesతో నమ్మకమైన సంస్థ Subash Reddy లోకల్, అమెరికా, మా ప్రత్యేకత. Dubbaka Matrimony. Ph: 9059290726 [H-776671]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-740]

సౌర్య గౌడ్స్ మ్యారేజ్ బ్యూరో. ఫ్రీ రిజిస్ట్రేషన్. మొదటి/రెండవ సంబంధాలకై సంప్రదించగలరు. కె.దామోదర్ గౌడ్, అల్వాల్‌గూడ, హైదరాబాద్. Ph: 7989189635 [H-776692]

★★

మాల (క్రైస్తవ, హిందూ), M.Tech, M.S., MBA, MCA, M.B.B.S. చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్స్ చేస్తున్న వధూవరుల కొరకు kalyanamala.org © 94405 45049 [B-1197876]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

నిజామాబాద్	:99122 20764	తిరుపతి	:99122 20586	తాడేపల్లిగూడెం	:99122 20558
కరీంనగర్	:9705933396	కడప	:99516 02932	రాజమండ్రి	:99122 20358
వరంగల్	:99516 02872	అనంతపూర్	:99122 20718	విజయవాడ	:9912225442
నల్గొండ	:95055 08382	కర్నూల్	:9010825556	గుంటూరు	:99122 20349
మహబూబ్‌నగర్	:99516 02829	శ్రీకాకుళం	:99122 20343	ఒంగోలు	:99122 25431
ఖమ్మం	:99516 02868	విశాఖపట్నం	:99122 20550	నెల్లూరు	: 99516 02861

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

Combined : 1900/- for 4 Lines 485/- Extra Line | Andhra Pradesh : 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana : 1100/- for 4 Lines (Incl. Hyd) 300/- Extra Line | * Color 25% Extra

గమనిక : జాబ్లైన మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.

3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, Hyd-34 Ph: 040-2325 6000 Ext: 6230 / 6235 Cell: 9912225453

నాణ్యమైన మందులే లక్ష్యం

సత్ఫలితాలనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



- నాణ్యత తక్కువ ఉన్న మందుల తయారీ, విక్రయంపై చర్యలు
- జాతీయ స్థాయిలో పోలిస్తే ఎన్ఎస్‌క్యూ మందులు రాష్ట్రంలో తక్కువే
- జాతీయ స్థాయిలో ఎన్ఎస్‌క్యూ మందులు నాలుగు శాతం
- రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటివరకూ 3370 శాంపిళ్ల విశ్లేషణ
- ఇందులో 2.49 శాతం ఎన్ఎస్‌క్యూగా వెల్లడి

3370 నమూనాలు విశ్లేషణ

రాష్ట్రంలో 353 మందుల తయారీ యూనిట్లు, 213 బ్లడ్ బ్యాంక్‌లు, 132 బ్లడ్ స్టోరేజ్ సెంటర్లు, 44,973 హోల్ సేల్, రీటెయిల్ మందుల షాపులు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ నెలాఖరు మధ్య ఔషధ నియంత్రణ విభాగం మందుల షాపుల్లో 17,051 తనిఖీలు చేసింది. బ్లడ్ బ్యాంకులలో 289, మందుల తయారీ యూనిట్లలో 505 తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలు 3,370 నమూనాలను సేకరించి విశ్లేషించగా 2.49 శాతం అంటే 84 నమూనాలు ఎన్ఎస్‌క్యూగా తేలింది. ఈ ఘటనల్లో కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నూతన విధానం సత్ఫలితాలనిస్తోంది. ఈ నూతన విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. దాని ఆధారంగా ఔషధ నియంత్రణ మండలి హోల్‌సేల్, రిటెయిల్ మందుల దుకాణాలు, మందుల తయారీ కంపెనీలలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయడం, శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌లలో విశ్లేషించడం పకడ్బందీగా జరుగుతోంది. నాణ్యత తక్కువ ఉండే నాట్ ఆఫ్ స్టాండర్డ్ క్వాలిటీ (ఎన్ఎస్‌క్యూ) మందులను తయారు చేస్తున్న సంస్థలు, విక్రయిస్తున్న మందుల దుకాణాలపై చర్యలు తీసుకుంటోంది. దీని ఫలితంగా ఎన్ఎస్‌క్యూ మందులు రాష్ట్రంలో తగ్గిపోతున్నాయి. నాణ్యమైన మందులు ప్రజలకు లభిస్తున్నాయి. ఎన్ఎస్‌క్యూ మందులలో జాతీయ స్థాయికంటే రాష్ట్రస్థాయి సగటు తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా సగటున 4 శాతం ఎన్ఎస్‌క్యూ మందులు బయటపడుతుండగా, రాష్ట్రంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకు విశ్లేషించిన నమూనాల్లో 2.5 శాతం లోపు మాత్రమే ఎన్ఎస్‌క్యూ నమోదు ఉంది.

తనిఖీ ఎక్కడ చేయాలో యాప్ చెబుతుంది


ఔషధ నియంత్రణ మండలి డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు గతంలో వారి అభీష్టం మేరకు మందుల షాపులు, తయారీ యూనిట్లను ఎంపిక చేసుకొని తనిఖీలు చేసేవారు. ఈ విధానానికి చెక్ పెడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నూతన విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. తనిఖీలు, శాంపిళ్ల సేకరణలో అధికారుల జోక్యాన్ని తగ్గించి ర్యాండమ్‌గా చేయడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా కంప్యూటర్ ఎయిడెడ్ సెలక్షన్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్ యాప్‌ను రూపొందించింది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వారి పరిధిలోని ఏ షాప్‌లో తనిఖీ చేయాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో అలర్ట్ వెళుతుంది. వెంటనే వారు యాప్ సూచించిన షాపు, తయారీ యూనిట్‌లో తనిఖీలు చేసి, ఆ నివేదికలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. శాంపిల్స్ సేకరణలో 108 పైగా ప్రమాణాలతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని రూపొందించారు. ఈ ఎస్‌వోపీకి అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపాలి. దీనిద్వారా తనిఖీలు, శాంపిళ్ల విశ్లేషణ పకడ్బందీగా జరిగి, నాణ్యత తక్కువుండే మందుల తయారీ తగ్గుతోంది. తద్వారా ప్రజలకు మేలు జరుగుతోంది.

వీలైనన్ని ఎక్కువ శాంపిళ్లు సేకరణ

వీలైనన్ని ఎక్కువ శాంపిళ్లు సేకరించి, వాటిని విశ్లేషించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడంపై దృష్టి సారించాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పక్కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి. శాంపిళ్ల విశ్లేషణలో ఎన్ఎస్‌క్యూగా తేలినప్పుడు కేసులు నమోదు చేసి బాధ్యులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది 77 కేసులు నమోదు చేయగా, వాటిలో 36 కేసుల్లో ముద్దాయిలకు కోర్టు శిక్ష విధించింది. మిగిలిన కేసుల్లో పై కోర్టులను ఆశ్రయించి బాధ్యులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రవిశంకర్ నారాయణ్, డైరెక్టర్ జనరల్,

'పెన్నా'.. పరవళ్లు



- నీటి జాడ లేని నదిలో మూడేళ్లుగా జల సవ్వడులు
- నిండుకుండల్లా పెన్నా బేసిన్‌లోని ప్రాజెక్టులు
- గరిష్ట స్థాయిలో నీటి నిల్వలు..
- శనివారం నాటికి ప్రాజెక్టుల్లో 192.97 టీఎంసీలు..
- పెన్నా బేసిన్ చరిత్రలో ఈ స్థాయిలో నీటి నిల్వ ఎన్నడూ లేదంటున్న అధికారులు
- రబీలో పెరగనున్న పంటల సాగు విస్తీర్ణం

సాక్షి, అమరావతి: ఒకప్పుడు నీటిచుక్క జాడ లేక ఎడారిని తలపించిన పెన్నా నది.. ఇప్పుడు జలనిధిగా మారింది. 2019 నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పెన్నాతో పాటు ఉప నదుల్లో జల సవ్వడులు సందడి చేస్తున్నాయి. పెన్నా పరీవాహక ప్రాంతం(బేసిన్)లోని ప్రాజెక్టులన్నీ ఇప్పటికీ నీటితో కళకళలాడుతున్నాయి. జలాశయాలన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. బేసిన్‌లోని ప్రాజెక్టుల గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 238.75 టీఎంసీలు కాగా.. శనివారం నాటికి 192.97 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 161.2 టీఎంసీలు నిల్వ ఉండేవి. ఖరీఫ్ పంటల కోతలు పూర్తయిన దశలో కూడా జలాశయాలన్నీ నిండుగా ఉండటంతో పెన్నా పరీవాహక ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బేసిన్ చరిత్రలో ఈ స్థాయిలో నీటి నిల్వలుండటం ఇదే తొలిసారని అధికారులు చెబుతున్నారు.

ఎక్కడ చూసినా జలసిరులే..

కర్ణాటకలోని వర్షచాయ(రెయిన్ షాడో) ప్రాంతంలో పురుడుపోసుకునే పెన్నా.. దేశంలో జైసల్మేర్ తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదయ్యే శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల మీదుగా 597 కిలోమీటర్ల పొడవునా ప్రవహించి.. నెల్లూరు జిల్లా ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. జయ మంగళి, చిత్రావతి, పాపాఘ్ని, కుందేరు, చెయ్యేరు, సగిలేరు, బాహుదా, స్వర్ణముఖిలు ప్రధాన ఉప నదులు. కర్ణాటకతో పాటు ఏపీలోని శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య, వైఎస్సార్, నంద్యాల, నెల్లూరు జిల్లాల పరిధిలో పెన్నా బేసిన్ విస్తరించి ఉంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో 2019 నుంచి పెన్నా బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది మరింతగా భారీ వర్షాలు కురవడంతో.. పెన్నా, ఉప నదులు ఉరకలెత్తడం, ప్రాజెక్టులు నిండటం, భూగర్భ జలాలు పెరగడంతో దుర్భిక్ష రాయలసీమ సుభిక్షమైంది. పెన్నా ప్రధాన పాయపై అప్పర్ పెన్నార్(పేరూరు), పెన్న అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్), మధ్య పెన్నార్, పెండేకల్లు, చాగల్లు, గండికోట, మైలవరం, సోమశిల, సంగం, నెల్లూరు బ్యారేజీలున్నాయి. ఉప నదులపై కండలేరు, వెలిగల్లు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, బాహుదా రిజర్వాయర్ తదితర ప్రాజెక్టులున్నాయి. పెన్నా ప్రధాన పాయపై అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు ఉన్న అన్ని ప్రాజెక్టుల్లో గరిష్ట స్థాయిలో నీటి నిల్వలున్నాయి. ఉప నదులపై ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మద్దిలేరు(యోగి వేమన), చెన్నరాయస్వామిగుడి, వెలిగల్లు, బాహుదా తదితర ప్రాజెక్టులన్నీ నిండుగా ఉన్నాయి. దీంతో ఈ రబీ సీజన్‌లో పెన్నా ఆయకట్టులో అధిక విస్తీర్ణంలో పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు.

సేంద్రీయ సేద్యంలో అగ్రస్థానంలో ఏపీ

- 2019–20 నుంచి రాష్ట్రంలో1.44 లక్షల హెక్టార్లలో సేంద్రీయ సాగు
- 2020, 2021 సంవత్సరాల్లో లక్ష ఎకరాలకు కేంద్రం అనుమతి
- అన్ని రాష్ట్రాలకంటే ఇదే అత్యధిక విస్తీర్ణం
- దేశంలో మొత్తం 8 రాష్ట్రాల్లో 4.09 లక్షల హెక్టార్లకు అనుమతి

సాక్షి, అమరావతి: దేశంలోనే సేంద్రీయ సేద్యంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2020, 2021 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ఒక లక్ష హెక్టార్లలో సేంద్రీయ సేద్యానికి అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ ఇటీవల లోక్ సభలో వెల్లడించారు. 2019–20 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో 1,44,465 హెక్టార్లు సేంద్రీయ వ్యవసాయం కిందకు వచ్చినట్లు తెలిపారు. 2020–21లో భారతీయ ప్రాకృతిక కృషి పద్ధతి (బీపీకేపీ) కింద 8 రాష్ట్రాల్లో 4.09 లక్షల హెక్టార్లలో సేంద్రీయ సేద్యానికి అనుమతి ఇచ్చామన్నారు. ఇందులో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో లక్ష హెక్టార్లకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు.

పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకం (పీకేవీవై), భారతీయ ప్రాకృతిక కృషి పద్ధతి (బీపీకేపీ) కింద దేశంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2019–20 నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ రెండు పథకాల కింద సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు శిక్షణ, సామర్థ్యం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మూడేళ్లలో రైతుల క్లస్టర్ల ఏర్పాటు, సామర్థ్యం పెంపునకు హెక్టార్‌కు రూ.12,200 సాయాన్ని అందించినట్లు చెప్పారు. హ్యాండ్ హోల్డింగ్, సర్టిఫికేషన్, అవశేషాల విశ్లేషణ్‌కు హెక్టారుకు మూడేళ్లలో రూ. 2 వేల ఆర్థిక సాయం అందించామన్నారు. సహజ సేద్య ఉత్పత్తుల మార్కెటింగ్, ప్రచారం, విలువ జోడింపునకు రైతులకు హెక్టార్‌కు మూడేళ్లలో రూ. 8,800 డీబీటీ ద్వారా ఇచ్చామన్నారు. ఉత్పత్తి నుండి ప్రాసెసింగ్ వరకు, ధృవీకరణ, మార్కెటింగ్, పంటకోత తర్వాత నిర్వహణకు పూర్తి మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు.



తెలంగాణ డీజీపీగా అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా అంజనీకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీగా సంజయ్‌కుమార్ జైన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జితేందర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ డీజీపీగా రవిగుప్తా బాధ్యతలు చేపట్టారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా డాక్టర్ జితేందర్ బాధ్యతలు స్వీకరించారు. రాచకొండ సీపీగా పనిచేసిన మహేశ్ మురళీధర్ భగవత్ నుంచి మరో సీనియర్ పోలీస్ అధికారి దేవేంద్ర సింగ్ చౌహాన్ బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ అడిషనల్ డీజీగా మహేశ్ భగవత్ శనివారం బాధ్యతలు చేపట్టారు.

ఈఏపీసెట్ తుది విడత సీట్ల భర్తీ పూర్తి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి తుది విడత సీట్ల కేటాయింపు పూర్తిచేసినట్లు ఈఏపీసెట్ కన్వీనర్ సి.నాగరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 193 కాలేజీల్లో 10,739 సీట్లకు గాను, 10,665 సీట్లను విద్యార్థులకు కేటాయించినట్లు వివరించారు. కేవలం 74 సీట్లు మాత్రమే మిగిలాయని తెలిపారు. వీటిలో ప్రభుత్వ కాలేజీల్లో ఒక్కటి మినహా అన్ని సీట్లు భర్తీ అయ్యాయని, ప్రయివేటు కాలేజీల్లో 73 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు.



పశ్చిమ గోదావరి జిల్లా శేరేపాలెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



కాకినాడ జిల్లా రమణయ్యపేటలో వృద్ధురాలికి నవరత్న పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

మన ప్రభుత్వం



అనకాపల్లి జిల్లా కొత్తరేవుపోలవరంలో బాలిక ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



వైఎస్సార్ జిల్లా పర్లపాడులో లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

తెలంగాణ

ఈ ఏడాదిలో 73 కేసులు నమోదు చేసిన ఎన్‌ఐఏ

సాక్షి, హైదరాబాద్: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) 2022లో దేశవ్యాప్తంగా మొత్తం 73 కేసులు నమోదు చేసింది. గతేడాది 61 కేసులు నమోదు చేయగా, ఈ సారి ఎన్‌ఐఏ కేసుల సంఖ్యలో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ మేరకు ఎన్‌ఐఏ శనివారం అధికారిక ప్రకటనలో గణాంకాలు వెల్లడించింది. ఎన్‌ఐఏ చరిత్రలో ఒక్క ఏడాదిలో 73 కేసుల నమోదు అనేది అతిపెద్ద సంఖ్య అని అందులో పేర్కొంది. జమ్మూకశ్మీర్, అసోం, బిహార్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో కలిపి జీహాదీ టెర్రర్ గ్రూపులకు సంబంధించి నమోదు చేసిన 35 కేసులు ప్రధానమైనవని నివేదికలో వెల్లడించింది. ఇవి కాకుండా టెర్రర్ ఫండింగ్, నకిలీ నోట్ల ముద్రణ, స్మగ్లింగ్ సంబంధ కేసులున్నట్లు తెలిపింది. అన్ని కేసులతో కలిపి 456 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ ఏడాది నమోదు చేసిన మొత్తం కేసులకు గాను 59 కేసుల్లో 368 మందిపై ఎన్‌ఐఏ అధికారులు చార్జిషీట్లు నమోదు చేశారు. వీటిలో 38 కేసుల్లో కోర్టు తీర్పులు వెలువడ్డాయి. ఇందులో 109 మందికి కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించారు. ఆరుగురికి జీవిత ఖైదు కూడా విధించినట్లు ఎన్‌ఐఏ నివేదిక వెల్లడించింది.

100 మ్యాథ్ టేబుల్స్‌తో వరల్డ్ రికార్డుకు శ్రీచైతన్య శ్రీకారం



మాట్లాడుతున్న శ్రీ చైతన్య అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన

సాక్షి, హైదరాబాద్: శ్రీచైతన్య స్కూల్ మరో ప్రపంచ రికార్డుకు శ్రీకారం చుట్టింది. 10 రాష్ట్రాల్లోని 1,000 మంది శ్రీచైతన్య ప్రీ ప్రైమరీ చిన్నారులు 100 రోజుల శిక్షణతో, 100 మ్యాథ్ టేబుల్స్‌ను, 100 నిమిషాల్లో అప్పజెప్పేలా ఈ రికార్డు ఉంటుంది. దీన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్–లండన్ వారు పర్యవేక్షిస్తూ, పరీక్షించి, రికార్డును నమోదు చేస్తారు. అనంతరం సర్టిఫికెట్‌ను అందజేస్తారు. కాగా, శనివారం జరిగిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రీ ఈవెంట్ ప్రెస్‌మీట్‌లో శ్రీచైతన్య విద్యార్థులు మ్యాథ్ టేబుల్స్ అప్పజెప్పిన తీరు చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ విలేకరులతో మాట్లాడుతూ శ్రీచైతన్య స్కూల్స్ అంటేనే గొప్ప భవితకు గట్టి పునాది అని, ప్రీప్రైమరీ, ప్రైమరీ స్థాయిల్లోనే చిన్నారుల్లో నైపుణ్యాలను వెలికితీస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలు పాల్గొనే నాసా–ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లోనూ వరుసగా 9వ సంవత్సరం శ్రీచైతన్య స్కూల్ ప్రపంచ చాంపియన్‌గా నిలవటం శ్రీచైతన్య ఆధిపత్యానికి నిదర్శనమని ఆమె హర్షం వ్యక్తంచేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

బైరి నరేశ్‌కు రిమాండ్

పరిగి జైలుకు తరలింపు

కొడంగల్/పరిగి/కమలాపూర్: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండల పరిధిలోని రావులపల్లిలో డిసెంబర్ 19న జరిగిన ఓ కార్యక్రమంలో అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్, అతని అనుచరుడు డోలు హన్మంతును స్థానిక పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. హనుమకొండ జిల్లాలోని నరేశ్ స్వస్థలంలో అతన్ని అరెస్టు చేసి కొడంగల్‌కు తీసుకొచ్చారు. పట్టణంలోని న్యాయస్థానంలో నిందితులను హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. అనంతరం పోలీసులు నిందితులను పరిగి జైలుకు తరలించారు. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్, డోలు హన్మంతుపై కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో 153ఏ, 295ఏ, 298, 505(2) ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, నరేశ్‌ను పరిగి జైలుకు తీసుకురావడంతో జైలు వద్దకు అయ్యప్పస్వాములు భారీ సంఖ్యలో చేరుకున్నారు. నరేశ్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

మెరిసే.. మెరిసే.. బంగారంలా..

అదే బాటలో జగన్ ప్రభుత్వం

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ పార్క్‌ను మరింత అభివృద్ధి చేస్తోంది. రూ. 8 కోట్లతో రహదారులు, డ్రెయిన్లు, ఈటీపీ ఆధునికీకరణ, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపడుతోంది. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేస్తోంది. నూతన డిజైన్ల రూపకల్పనకు క్యాడ్, కాస్టింగ్ వంటి వాటిలో ఇక్కడ శిక్షణ ఇస్తారు.

మేలిమికి దీటుగా చిలకలపూడి రోల్డ్ గోల్డ్ ఆభరణాలు

- ఇమిటేషన్ గోల్డ్ క్లస్టర్ ఏర్పాటుతో వేగంగా విస్తరిస్తున్న రోల్డ్ గోల్డ్ వ్యాపారం
- 2007లో వైఎస్సార్ ప్రోత్సాహంతో 48 ఎకరాల్లో రోల్డ్‌గోల్డ్ క్లస్టర్
- రూ.10 కోట్ల నుంచి రూ.100 కోట్లను దాటిన వ్యాపారం
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ కొత్త డిజైన్లతో ఆభరణాలు
- మరో రూ.8 కోట్లతో క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్న జగన్ ప్రభుత్వం
- నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందించేలా స్కిల్ హబ్
- 30 వేల మందికి ఉపాధి





చిలకలపూడిలో తయారయ్యే దేవుని ఆభరణాల నమూనా

సాక్షి, అమరావతి: ఆకాశాన్నంటుతున్న ధరతో సామాన్యులకి బంగారం అందని ఆభరణమే అయింది. చిన్నపాటి గొలుసు కొనాలన్నా లక్షలు పెట్టాల్సిందే. డిజైన్లు అంతకంటే వేగంగా మారిపోతున్నాయి. బంగారానికి ప్రత్యామ్నాయంగా పుట్టుకు వచ్చిందే ఇమిటేషన్ లేదా రోల్డ్ గోల్డ్ లేదా వన్‌గ్రామ్ గోల్డ్ నగలు. ఏ పేరుతో పిలుచుకున్నా వీటి కేరాఫ్ అడ్రస్ కృష్ణా జిల్లా చిలకలపూడి. బంగారు ఆభరణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా గిల్ట్ నగలు తయారు చేయడం చిలకలపూడి కళాకారుల గొప్పతనం. బాగా డిమాండ్ ఉన్న యాంటిక్ నగల్లో కూడా కొత్త డిజైన్లు సృష్టిస్తూ మహిళల మనసులు దోచుకుంటున్నారు. లక్షలు విలువ చేసే బంగారు బ్రైడల్ సెట్స్‌ను రూ.5,000 నుంచి రూ.25,000కే అందిస్తున్నారు. సినిమాల్లో, సీరియల్స్‌లో నటీనటులు ధరించే ఆభరణాల్లో అత్యధిక శాతం చిలకలపూడిలో తయారైనవే. అంతేకాకుండా అనకాపల్లి నుంచి చికాగో వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు దేవుని అలంకరణకు ఉపయోగించే వజ్ర, వైఢూర్యాలు పొదిగిన కిరీటాలు, ఆభరణాలు కూడా ఇక్కడివే.

ఒక కుటుంబంతో ఆరంభం

114 ఏళ్ల క్రితం ఒక కుటుంబంతో ప్రారంభమైన ఈ కళ ఇప్పుడు గోల్డ్ పార్క్ ఏర్పాటుతో పెద్ద వ్యాపార సామ్రాజ్యంగా మారింది. 1908లో మచిలీపట్నానికి సమీపంలో ఉన్న చిలకలపూడి గ్రామంలో టేకి నరసింహం అనే స్వర్ణకారుడి ఆలోచన నుంచి మొదలయ్యింది ఈ రోల్డ్ గోల్డ్ వ్యాపారం. బంగారం ధరలు భారీగా పెరగడంతో మధ్య తరగతి ప్రజల కోసం రాగి మీద బంగారం పూతతో ఆభరణాల తయారీని మొదలుపెట్టారు. అప్పట్లో రూ. 100 ఉండే బంగారం దిద్దులను కేవలం పావలాకే అందించడంతో ఈ రోల్డ్ గోల్డ్ ఆభరణాలకు డిమాండ్ పెరిగింది.

వైఎస్సార్ చొరవతో గోల్డ్ క్లస్టర్ ఏర్పాటు

దేశంలో ఇమిటేషన్ గోల్డ్ ఆభరణాల్లో రాజస్థాన్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల పోటీని తట్టుకోలేక చిలకలపూడి తయారీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి దృష్టికి వచ్చింది. వెంటనే ఇక్కడ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చి, మచిలీపట్నం ఇమిటేషన్ గోల్డ్ జ్యువెలరీ పార్క్ ఏర్పాటు చేశారు. 2007లో 48 ఎకరాల్లో ఇమిటేషన్ జ్యువెలరీ పార్కు ఏర్పాటైంది. ఇప్పుడు ఈ పార్కులో 236 యూనిట్లలో ప్రత్యక్షంగా 3,000 మందికి ఉపాధి లభిస్తోంది. మచిలీపట్నం, పెడన, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఉండే 24 గ్రామాలకు చెందిన 27 వేల మందికి పైగా మహిళలు ఇంటి వద్దే ఆభరణాలు తయారు చేస్తూ పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. వీరు ఒక్కొక్కరు రోజుకు రూ.200 నుంచి రూ.450 వరకు సంపాదిస్తున్నారు. ప్లేటింగ్, క్యాడ్, కాస్టింగ్ వంటి సౌకర్యాలు ఒకే చోట ఉండటంతో ఈ పార్కులో ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తొలుత రూ.10 కోట్లుగా ఉన్న చిలకలపూడి వ్యాపారం రూ.100 కోట్లను అధిగమించడమే కాకుండా ఇతర రాష్ట్రాల పోటీని తట్టుకొని విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.

క్లస్టర్ మా జీవితాలను మార్చేసింది



ఈ గోల్డ్ పార్క్ ద్వారా మా వ్యాపార స్వరూపమే మారిపోయింది. గతంలోకంటే 100 రెట్లు అధికంగా ఉత్పత్తిని చేస్తూ ఇతర రాష్ట్రాలకు గట్టి పోటీనిస్తున్నాం. అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం మమ్మల్ని ఒక సంఘంగా ఏర్పాటు చేసి అతి తక్కువ రేటుకు భూమిని కేటాయించి ఈ పార్కును అభివృద్ధి చేసింది. మంచి నీటి నుంచి అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే కల్పించింది.

– పీవీ సుబ్బారావు, ప్రెసిడెంట్, మచిలీపట్నం ఇమిటేషన్ గోల్డ్ జ్యువెలరీ పార్క్

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



కేవలం పార్క్ ఏర్పాటే కాకుండా పలు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం మాకు అందిస్తోంది. వ్యాపారులకు రూ.15 లక్షల వరకు రుణాలిప్పించి, వ్యాపార విస్తరణకు సహకరిస్తోంది. ఇప్పుడు ముంబై, చెన్నై, కోల్‌కతా వ్యాపారులకు ఆభరణాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం. చికాగోలో వేంకటేశ్వర స్వామి వారి ఆభరణాల దగ్గర నుంచి రాష్ట్రంలో ఏ గుడిలో ఆభరణాలైనా చిలకలపూడిలో తయారైనవే.

– అంకెం జితేంద్ర, కార్యదర్శి, మచిలీపట్నం ఇమిటేషన్ గోల్డ్ జ్యువెలరీ పార్క్

గురుకులాల్లో ప్రతిభ పతకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంపొందించి వారి ప్రతిభాపాటవాలకు మరింత మెరుగులు దిద్దేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. చదువు, క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి వారం పతకాలు (రోలింగ్ విధానం) అందించనుంది. చదువు, క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తరగతుల వారీగా ప్రతి విభాగంలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు ప్రదానం చేయనుంది. జనవరి 3వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు సాంఘిక సంక్షేమశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పతకాలకు ఎంపిక ఇలా...

- విద్య (అకడమిక్) విభాగంలో మూడు, క్రీడలు, ఇతర విభాగాల్లో మూడు చొప్పున ప్రతి తరగతికి రెండు స్వర్ణ, రెండు రజత, రెండు కాంస్య పతకాలు చొప్పున మొత్తం ఆరు మెడల్స్‌ను విద్యార్థులకు వారి క్లాస్ టీచర్ల ద్వారా అందిస్తారు. ప్రతి గురుకులానికి అకడమిక్ విభాగంలో 48, ఆల్ రౌండర్ పతకాలు 48 ఉంటాయి.
- గురుకులాల్లో 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సాధారణ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఈ పతకాలు ప్రదానం చేస్తారు.
- 9 నుంచి 12వ తరగతి (ఇంటర్) వరకు చదివే విద్యార్థులకు వారాంతపు పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా పతకాలను అందిస్తారు.
- చదువులో మార్కులు కాకుండా క్రీడలతోపాటు ఇతర అంశాల్లో అధిక మార్కులు సాధించిన వారికి ఆల్ రౌండర్ పతకాలను ఇస్తారు.

వాహ్ వైజాగ్.. సాటిలేని మేటి సిటీ

ప్రకృతి ప్రసాదించిన వరం .. విశాఖ నగరం



బీచ్ రోడ్డు నుంచి విశాఖ నగరి ఇలా

సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి సౌందర్యానికి, ఆహ్లాదకర వాతావరణానికి, సౌమ్యులైన మనుషులకు అది నిలయం.. ఒకపక్క అతి సుందర సాగరతీరం.. మరోపక్క రాశులు పోసినట్లుండే పచ్చని పర్వతాలు.. వాటి దిగువన పుష్కలంగా నిక్షిప్తమై ఉండే భూగర్భ జలాలు.. ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే నేరాలు, ఘోరాలకు దూరంగా ఉండే నగరం.. అదృష్టానికి చిరునామాగా పిలుచుకునే సిటీ ఆఫ్ డెస్టినీ.. ఇన్ని ప్రత్యేకతలున్న అరుదైన నగరం మన విశాఖపట్నం. ఎక్కడెక్కడ నుంచి వచ్చిన వారినైనా అక్కున చేర్చుకునే నైజం విశాఖ సొంతం. నడి వేసవిలోనూ వేడి జాడ నామమాత్రంగా ఉండే ప్రాంతం. ఇక సముద్రమట్టానికి 45 మీటర్ల ఎత్తుతో భవిష్యత్తులో ముంపు ముప్పులేని ఏకైక తీర నగరం కూడా ఇదే. దక్షిణాది రాష్ట్రాల్లో ఇన్ని విశిష్టతలు విశాఖకే సొంతం. ఇలా ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక రాజధానికి అవసరమైన అన్ని అర్హతలు, హంగులతో వాహ్.. అనిపించే ప్రకృతి ప్రసాదించిన మహానగరం విశాఖపట్నం.

సముద్రానికి 45మీటర్ల ఎత్తులో..

ఇది ప్రకృతి వైపరీత్యాలకు అంతగా ప్రభావితం కాని నగరం కూడా. హుద్‌హుద్‌లాంటి సూపర్ సైక్లోన్‌తో కకావికలమైనా నెలల వ్యవధిలోనే తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకున్న విశిష్ట నగరి. తూర్పు, పశ్చిమ తీరాల్లోని ప్రధాన నగరాలన్నింటికంటే విశాఖ ఎంతో సురక్షితమైనదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే.. ఈ నగరం సముద్రమట్టానికి సగటున 45 మీటర్ల ఎత్తులో ఉంది. చెన్నై 6.7 మీటర్లు, ముంబై 14 మీటర్లు, మంగుళూరు 22 మీటర్ల ఎత్తులోనూ ఉన్నాయి. అంటే విశాఖ నగరంకంటే సముద్రం 45 మీటర్ల దిగువన ఉందన్న మాట. అందువల్ల ఇప్పట్లోనే కాదు.. భవిష్యత్తులోనూ విశాఖకు ఎలాంటి ముంపు ముప్పు ఉండే అవకాశమే లేదు. అదే చెన్నై, ముంబై నగరాలు తరచూ ముంపు బారిన పడుతున్నాయి. నిజానికి.. విశాఖ నగరం భౌగోళికంగా ఎత్తు పల్లాలుగా ఉంటుంది. దీంతో 15–20 సెం.మీ.ల మేర భారీ వర్షం కురిసినా నీరు నిలిచిపోకుండా దిగువనున్న సముద్రంలోకి వెళ్లిపోతుంది.

ఆహ్లాదకర వాతావరణం..

ఇక వైజాగ్‌లో అన్ని సీజన్లలోనూ ఆహ్లాదకర వాతావరణమే నెలకొంటుంది. ఓ పక్క చల్లగాలులను పంపించే సముద్రం, మరోపక్క పచ్చని పర్వత శ్రేణులు ఇందుకు దోహదం చేస్తున్నాయి. తూర్పు కనుమలు, సింహాచలం కొండ, యారాడ కొండ, కంబాల కొండ, కైలాసగిరి, డాల్ఫిన్ నోస్ వంటివి పర్యావరణ సమతుల్యతను పదిలంగా ఉంచుతున్నాయి. అంతేకాదు.. ఈ కొండలు భూగర్భ జలాలను సంరక్షిస్తున్నాయి. దీంతో తక్కువ లోతులోనే నీటి లభ్యత ఉంటూ ఏడాది పొడవునా నీటి ఎద్దడికి ఆస్కారం లేకుండా చూస్తున్నాయి. అలాగే, వేసవిలో విజయవాడ, గుంటూరు వంటి నగరాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 45–48 డిగ్రీల వరకు నమోదవుతాయి. కానీ విశాఖలో సగటున 36 డిగ్రీలకు మించదు. నడి వేసవిలో మధ్యాహ్నం వేళ ఒకింత ఉష్ణతాపం అనిపించినా సా.4 గంటలకే వాతావరణం చల్లబడిపోవడం ఈ నగరానికున్న ప్రత్యేకత. అందుకే ఇక్కడకు దేశ, విదేశాల నుంచి జనం పోటెత్తుతుంటారు. అయితే, సగటున 68 శాతం హ్యుమిడిటీ నమోదుతో వేసవిలో ఉక్కపోత ఒకింత ఎక్కువగా ఉంటుంది. మరోవైపు.. శీతాకాలంలోనూ సాధారణ చలే తప్ప ఎముకలు కొరికే చలి విశాఖలో ఉండదు.

ఉప్పెనల ముప్పేలేదు..

తీర ప్రాంతంలో ఉన్నప్పటికీ విశాఖ నగరానికి ఉప్పెనల ముప్పులేదు. ఎటువైపు నుంచీ వరద గాని, ఉప్పెన గాని ముంచెత్తే అవకాశంలేదు. ఇది కూడా విశాఖ నగరానికి ప్రకృతి పరంగా మేలుచేసే అంశంగా నిపుణులు చెబుతుంటారు. ఇక విశాఖలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల సీజనులో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. ఏడాదిలో సగటున 53 రోజులు వర్షిస్తాయి. ఇలా దక్షిణాది రాష్ట్రాల్లోకెల్లా అన్ని సీజన్లలోనూ అనుకూల వాతావరణం కలిగిన ఏకైక నగరంగా విశాఖపట్నం ఖ్యాతి గడించింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

ఆదివారం • 1 • జనవరి • 2023



బై బై 2022

పాత ఏడాదిలో చిట్టచివరి సూర్యాస్తమయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు. శనివారం సాయంత్రం మడికెరిలో రాజా సీట్ వద్ద దృశ్యమిది

న్యూస్‌రీల్

ఈ సర్కారే ఏటీఎం: కుమార

శివాజీనగర: జేడీఎస్ గెలిస్తే కర్ణాటక ఒక కుటుంబానికి ఏటీఎం అవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండ్యలో చేసిన ఆరోపణలపై జేడీఎస్ నేత హెచ్.డీ.కుమారస్వామి మండిపడ్డారు. బీజేపీ బూటకపు పార్టీ, తప్పుడుకోరుల సంత అనేందుకు ఈ మాటలే సాక్ష్యమని ఆయన ట్విట్టర్లో ఆరోపించారు. నియంత హిట్లర్‌లా అమిత్ షా ప్రవర్తిస్తున్నాడని, అబద్ధపు మాటలు చెప్పి ప్రచారం చేసుకోవాల్సిన పరిస్థితి వారికెందుకు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం బీజేపీకి ఏటీఎం అని విమర్శించారు.

సీఎం పదవి అమ్మకానికి లేదు

శివాజీనగర: తమ పార్టీలో ముఖ్యమంత్రి పదవి, మరే ఇతర పదవులు అమ్మకానికి లేదని మాజీ సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. హోం మంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రి పదవి కోసం రూ. 2 వేల కోట్లు అమ్మకానికి పెట్టి రాజకీయ వ్యాపారి అయ్యారని సీఎల్‌పీ నేత సిద్దు వ్యాఖ్యలపై బీజేపీ ట్విటర్‌లో ధ్వజమెత్తింది. అబద్ధాలను ఎన్నిసార్లు చెప్పిన నిజాలు కావని చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.35 వేల కోట్లకు లెక్కలే లేవన్నది కాగ్ నివేదికలో తేలిందని, సిద్దరామయ్య నేటికి సమాధానం చెప్పలేదని విమర్శించింది.



శనివారం అర్ధరాత్రి బెంగళూరు బ్రిగేడ్ రోడ్డులో సంబరాలకు తరలివచ్చిన నగరవాసులు



ఎంజీ-బ్రిగేడ్ రోడ్డులో ఎటుచూసినా యువత సందడి

ఆశల పందిరి 2023

- కొత్త ఏడాదికి సుస్వాగతం
- బెంగళూరులో యువత సందడి

బనశంకరి: 2022 సంవత్సరానికి తీపి, చేదు జ్ఞాపకాలతో టాటా చెబుతూ కోటి ఆశలతో 2023 సంవత్సరానికి రాష్ట్రమంతటా ఘన స్వాగతం పలికారు. ఐటీ సిటీలో యువతీ యువకులు పెద్దఎత్తున సంబరాల్లో మునిగితేలారు. వేడుకలకు వేదికలైన ఎంజీ.రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్, రిచ్మండ్ రోడ్డు, ఇందిరానగర, కోరమంగల తదితర ప్రాంతాల్లో శనివారం రాత్రి 8 గంటల నుంచి సందడికి శ్రీకారం చుట్టారు. బార్లు, పబ్‌లు, రెస్టారెంట్లు, హోటళ్ల సందర్శకులతో సందడిగా మారాయి. పంచతార హోటళ్ల పార్టీలతో, సంగీత కార్యక్రమాలతో హోరెత్తాయి. యువత నృత్యాలు చేస్తూ మజాగా గడిపారు. ఇక యువత, ఔత్సాహికులు ఎంజీ రోడ్డు, బ్రిగేడ్ రోడ్డు, చర్చ్‌స్ట్రీట్‌లతో గుంపులుగా చేరి కేరింతలు కొడుతూ చిందులు వేశారు. యువతీ యువకులు బైక్‌లు, కార్లలో రౌండ్లు కొడుతూ సందడి చేశారు. ఎంజీ రోడ్డు, ట్రినిటీ మెట్రో స్టేషన్ల వద్ద రద్దీ కనిపించింది. ప్రభుత్వం అర్ధరాత్రి 1 గంట వరకు మాత్రమే బహిరంగ వేడుకలకు అనుమతి ఇచ్చింది. కార్వార, మంగళూరు తీర నగరాల్లో విందు వినోదాలు మిన్నంటాయి.

ఏకాదశి భక్తులకు లడ్డూలు



బొమ్మనహళ్లి: వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా నగరంలోని వెంకటేశ్వర స్వామి వారి ఆలయాల్లో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం 1 లక్ష లడ్డూలను సిద్ధం చేసినట్లు శరవణ ట్రస్టు అధ్యక్షుడు, జేడీఎస్ ఎమ్మెల్సీ టి.ఎ. శరవణ తెలిపారు. నగరంలోని శ్రీసాయి ఫంక్షన్ హాల్లో లడ్డూలను పరిశీలించారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లకు భారీగా పదోన్నతులు

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఏడాదికి ముందు పరిపాలనలో భారీగా మార్పులు చేసింది. శనివారం 42 మంది ఐఏఎస్, 27 మంది ఐపీఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ కొందరిని బదిలీలు చేసింది. సామాన్యంగా న్యూ ఇయర్ సమయంలో అధికారులకు పదోన్నతి లభిస్తుంది. ఈసారి భారీ సంఖ్యలో ఉండడం గమనార్హం. ఐఏఎస్‌లు తుషార్ గిరినాథ్, ఎస్ఆర్.ఉమాశంకర్, రిత్విక్ రాజనం పాండే, పీ మణివణ్ణన్, నవీన్‌రాజ్, మౌనీశ్ మౌద్గిల్, త్రిలోక్‌చంద్ర, మోహన్‌రాజ్, రిచర్డ్స్ విన్సెంట్ డీసొజా తదితరులను బదిలీచేసింది. అలాగే నగరపోలీస్‌కమిషనర్‌గా ఉన్న సీహెచ్.ప్రతాప్‌రెడ్డికి అదనపు డీజీపీగా పదోన్నతి కల్పించింది. ఐపీఎస్‌లు పంకజ్‌కుమార్ ఠాకూర్, సౌమెందు ముఖర్జీ, ఎం. చంద్రశేఖర్, ఎన్.సతీశ్ కుమార్ తదితరులకు పదోన్నతులు దక్కాయి.

ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం

- ఇది దక్షిణాదికి ముఖద్వారం
- బెంగళూరు సభలో బీజేపీ అగ్రనేత అమిత్ షా వెల్లడి
- కాంగ్రెస్, జేడీఎస్ ఒక నాణేనికి రెండు ముఖాలని ధ్వజం



మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనశంకరి: కాంగ్రెస్– జేడీఎస్ ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలు. ఎవరికి మెజారిటీ రాకపోయినప్పటికి హెచ్‌డీ కుమారస్వామి సీఎం గా కూర్చుంటారు. బీజేపీకి ఒకసారి పూర్తి మెజారిటీని అందించి కుటుంబ రాజకీయాలు, అవినీతి, మతవాదాన్ని తుడిచిపెట్టాలని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖామంత్రి అమిత్ షా అన్నారు. శనివారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో మహానగర బూత్‌స్థాయి బీజేపీ కార్యకర్తల విజయసంకల్ప సమావేశాన్ని అమిత్ షా ప్రారంభించి మాట్లాడారు. జేడీఎస్, కాంగ్రెస్‌లు ఎన్నికలు దగ్గరకు రాగానే ఒక్కటై కూర్చుంటారు, వారి పాలనను ప్రజలు చూశారు. యడియూరప్ప, బసవరాజ బొమ్మై విజయవంతంగా పాలన అందిస్తున్నారు. దక్షిణాదిలో బీజేపీని బలోపేతం చేయాలి. దక్షిణ భారతదేశానికి కర్ణాటక ముఖద్వారం లాంటిది. కర్ణాటక ద్వారా దక్షిణ భారత దేశంలోని బీజేపీ ప్రవేశిస్తుంది అని పేర్కొన్నారు.

తుకెడే గ్యాంగ్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

మండ్యలో శుక్రవారం నిర్వహించిన పార్టీ ర్యాలీ అద్భుతంగా జరిగిందని అన్నారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీకి సంపూర్ణ ఆధిక్యం లభించింది. గుజరాత్‌లో నరేంద్రమోదీ రికార్డు సృష్టించారు, కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు అని అమిత్‌షా అన్నారు. బీజేపీ ఎవరితోనూ పొత్తుపెట్టుకోదంటూ మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ, సిద్దరామయ్య పేర్లు ప్రస్తావిస్తూ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తుకెడే గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకుందని, జేడీయస్ ఎన్నికలు వచ్చినప్పుడు పొత్తు గురించి మాట్లాడుతుందని, కానీ బీజేపీ ఒంటరిగా అధికారంలోకి వస్తుందని, ఎవరితోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. మోదీ అయోధ్యలో రామమందిరం నిర్మిస్తున్నారని, కానీ ఇక్కడ కాంగ్రెస్‌వారు టిప్పును ల్యాన్ ను హీరో చేస్తారని ఎద్దేవా చేశారు. మోదీ పాలనతో దేశం భద్రంగా ఉంది, కానీ సిద్దరామయ్య, కుమారస్వామి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లు పీఎఫ్ఐ వంటి సంస్థల నుంచి దేశాన్ని సురక్షితంగా ఉంచుతారనే నమ్మకం ఉందా? వీరు ఓటు బ్యాంక్‌కు భయపడుతున్నారు, కానీ బీజేపీకి ఓటుబ్యాంక్ భయం లేదని, దేశభద్రతే తమ లక్ష్యమని చెప్పారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, ఈ సారి బెంగళూరు నగరంలో 20 కి పైగా సీట్లు గెలుపొందాలని పూర్తిమెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఎం బసవరాజ బొమ్మై, యడియూరప్ప, నళిన్ కుమార్ కటీల్, పెద్దసంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు


మైసూరు: మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల కఠిన జైలుశిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తూ చామరాజనగర మొదటి అదనపు జిల్లా కోర్టు తీర్పు చెప్పింది. చామరాజనగర జిల్లా యలందూరులోని మొత్తేరి వీధిలో నివాసం ఉంటున్న మహేశ్ 8 ఏళ్ల బాలికను మాయమాటలతో ఇంటికి తీసుకువచ్చి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు యళందూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని పూర్తి ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిశారాణి ముద్దాయి మహేశ్‌కు 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ. 14 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

కేఐఏలో కొత్త రూల్స్

దొడ్డబళ్లాపురం: కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో కోవిడ్ నియంత్రణలో భాగంగా జిల్లా ఆరోగ్యశాఖ కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. చైనా, సింగపూర్, హాంకాంగ్, దక్షిణ కొరియా, థాయ్‌ల్యాండ్, జపాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తప్పనిసరిగా ఆర్‌టీ పీసీఆర్ టెస్టును చేయించుకోవాలి. ఎయిర్ సువిధ యాప్‌లో ఆర్‌టీ పీసీఆర్ రిపోర్టును అప్‌లోడ్ చేయాలి. 72 గంటలలోపు రిపోర్టును మాత్రమే పరిగణిస్తారు. విదేశీ ప్రయాణికులకు ఉష్ణ పరీక్ష చేయడం తప్పనిసరి. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో 2 శాతం మందికి ఆకస్మికంగా పరీక్షలు చేస్తారు. 12 ఏళ్ల లోపు పిల్లలకు ఆకస్మిక పరీక్షల నుండి మినహాయింపు ఇవ్వడం జరిగింది. కరోనా రోగ లక్షణాలు కనిపిస్తే బాలలకు కూడా టెస్టులు చేస్తారు. లేదంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచనలు ఇస్తారు.

భారీగా బంగారం సీజ్

దొడ్డబళ్లాపురం: ఒక ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు అతడి నుంచి రూ.28 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మాల్దీవుల నుంచి జీ8 44 విమానంలో కెంపేగౌడ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు చెక్ చేయగా మల ద్వారంలో బంగారాన్ని మాత్రల రూపంలో దాచి తరలిస్తున్న సంగతి వెలుగుచూసింది. రూ.28 లక్షల విలువైన 532 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.



ఇది వీధి లైట్ కాదు, కెమెరా మాయ. శనివారం సాయంత్రం బెళగావిలో సూర్యాస్తమయం వేళ వీధి బల్బు కింద సూర్యుడు ఇలా దర్శనమిచ్చాడు

రూ. కోటి మద్యం స్వాధీనం

యశవంతపుర: అక్రమంగా తరలిస్తున్న రూ. కోటి విలువైన మద్యాన్ని శుక్రవారం అధికారులు కార్వారలో స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా తరలిస్తున్న నాలుగు వందల బాక్సల లిక్కర్‌ని సీజ్ చేశారు. కొత్త ఏడాది రోజున అధిక ధరలకు అమ్మడానికి వీటిని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో బాటిల్ విలువ రూ. 2500 ఉంది. దాదాపు 4800 బాటిళ్లను పట్టుకున్నారు. దీని విలువ ఏకంగా రూ. కోటి 19 లక్షలుగా అధికారులు తెలిపారు. లారీని కూడా స్వాధీనం చేసుకున్నారు.

సొరంగంలో దాడుల బెడద

- మెజెస్టిక్– రైల్వేస్టేషన్ మధ్య ప్రయాణికులకు పరీక్ష

యశవంతపుర: మెజెస్టిక్ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే సొరంగ మార్గంలో కొందరు వీధి వ్యాపారులు ప్రజలపై దాడులు చేస్తున్నారు. ముఠాలుగా ఏర్పడిన వ్యాపారులు చాకులు, కత్తులను చూపించి బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలు, ప్రయాణికుల అనుకూలం కోసం నిర్మించిన సొరంగ మార్గం అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారింది. బస్టాండు– రైల్వేస్టేషన్‌కు మధ్య ప్రయాణికులు సొరంగ మార్గంలో వెళ్లాలని అధికారులు, పోలీసులు బోర్డులు పెట్టారు. అయితే విచ్చలవిడిగా వ్యాపారులు ఆక్రమించుకోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ దందా పై రవికుమార్ అనే పౌరుడు కంచనహళ్లి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేయగా 2019 ఆగస్ట్ 27న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించింది. దీనితో బీబీఎంపీ అధికారులు వ్యాపారాలను తొలగించారు. కరోనా లాక్‌డౌన్ తరువాత మళ్లీ వ్యాపారులు ఆక్రమించుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

నెలలోగా కళసా డీపీఆర్ పనులు

శివాజీనగర: కళసా బండూరి నీటి ప్రాజెక్టుపై మరో నెలలోగా సమగ్ర పథక నివేదిక (డీపీఆర్) పనులను ఆరంభించనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి గోవింద కారజోళ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కళసా బండూరి పథకానికి కేంద్ర జలవనరుల కమిషన్ ఇచ్చిన అనుమతి పత్రంలో తేదీ లేదని హెచ్.కే.పాటిల్ చెప్పడం సరికాదన్నారు. మరో నెలలోగా డీపీఆర్‌కు అనుమతి పొంది భూమి పూజ చేసినపుడు హెచ్.కే.పాటిల్‌కు ప్రత్యేక ఆహ్వానం ఇస్తామని, అప్పుడు ఆయన మాట్లాడాలని సవాల్ చేశారు. ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతి పొంది టెండర్ పిలుస్తాం, పనులను ప్రారంభిస్తామని అన్నారు.

గుంటూరు నుంచి వచ్చి.. అంకోలాలో ఆత్మహత్యాయత్నం

- తండ్రీ కొడుకులు ఆస్పత్రిలో మృతి

యశవంతపుర: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రీకొడుకులు మరణించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ప్రాంతానికి చెందిన గంగరాజు వెంకట నాగ నరసింహ రాఘవ దినకర (41), ఆయన తనయుడు గంగరాజు వ్యాఘ్రేశ్వర కార్తికేయ తరుణ్ (15)లు మృతులు. వీరిద్దరు గుంటూరులో సోదరి ఇంట్లో ఉండేవారు. ఇటీవల కుటుంబ సమస్యలతో ఎవరికీ చెప్పకుండా తండ్రీ కొడుకులు గోకర్ణకు బయలుదేరారు. డిసెంబరు 26వ తేదీన తెల్లవారుజామున అక్కడి నుంచి అంకోలాకు బస్‌లో వెళ్తూ ఇద్దరూ పురుగుల మందు తాగారు. అంకోలా బస్టాండ్‌లో వాంతులు చేసుకొంటూ ఉండగా స్థానికులు చూసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం హుబ్లీ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దినకర 27న, తరుణ్ 28న మృతి చెందారు. మృతుని సోదరి పద్మజా గుంటూరు నుంచి అంకోలాకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.